ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 203 పేజీలు: 10+4 వెల: 6.50


పబ్జిగేమ్ వద్దన్నందుకు విద్యార్థి ఆత్మహత్య 3లో

శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు 5లో



## కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం >>2


# ప్రాణాలతో చెలగాటమా?

## లైసెన్స్‌లున్న కేబుళ్లకే అనుమతి

### బర్త్‌డే రోజునే తండ్రికి తలకొరివి పెట్టిన ఘటనపై జడ్జి ఆవేదన

### విద్యుత్ ప్రమాదాలపై అంతా చేతులు దులుపుకొంటే ఎలా?

### ఎయిర్‌టెల్ పిటిషన్‌పై విచారణలో జడ్జి వ్యాఖ్యలు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** జిహెచ్‌ఎంసిలో లైసెన్స్ తీసుకున్న కేబుళ్ల తప్ప ఏవీ ఉంచవద్దని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో దురదృష్టవశాత్తు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది కేబుళ్లను ఎక్కడికక్కడ తొలగించారు. దీనిపై ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరని న్యాయమూర్తి పిటిషనర్లను ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నగేష్ భీమపాక తీవ్రవ్యాఖ్యలు చేశారు. రామంతాపూర్‌లో ఐదుగురుమరణించిన ఘటన గురించి న్యాయమూర్తి ప్రస్తావించారు. >>2

## కాళేశ్వరం నివేదికపై 'స్టే'కు తిరస్కృతి

### కెసిఆర్, హరీశ్‌లకు హైకోర్టులో నిరాశ

### పబ్లిక్ డొమైన్ నుంచి నివేదికను తొలగించాలని కోర్టు ఆదేశం





### ఘోష్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టాకే బాధ్యులపై చర్యలు

### విచారణ నాలుగువారాలు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ బిఆర్‌ఎస్ అధినేత,మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరావు,మాజీ మంత్రి హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా శుక్రవారం కెసిఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. దీనిపై >>2



## సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి ఇక లేరు

### ఎంపిగా, ప్రజా పోరాట నేతగా దశాబ్దాల ఖ్యాతి సాధించిన నేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు22:** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్టీలో తీవ్రవిషాదంనెలకొంది. సిపిఐ అగ్ర నేత, మాజీఎంపి సురవరం సుధాకర్ రెడ్డి తుదిశ్వాసవిడిచారు. గత కొంత >>2

## మైనర్లు వాహనాలు నడిపితే రూ. 25 వేలు జరిమానా 3లో

# పార్టీ పరంగా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సిద్ధం!

### నేడు పిఎసి సమావేశంలో నిర్ణయం

### స్థానిక ఎన్నికలకు సమాయత్తం

### 25న కేబినెట్ భేటీ

### అసెంబ్లీలో ఘోష్ నివేదికపై చర్చకు తేదీలు ఖరారు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు22:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్దమవుతోంది. పార్టీ పరంగా 42 బిసి రిజర్వేషన్లు కల్పించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని భావిస్తోంది. కాంగ్రెస్‌లో బిసి రిజర్వేషన్, పదవులు పంపిణీ వంటి అంశాలు ఉత్కంఠ రేపుతోంది. గాంధీ భవన్‌లో శనివారం సాయంత్రం ఎఐసిసి వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తదుపరి కార్యాచరణ, స్థానిక సంస్థల షెడ్యూల్ ఖరారు కంటే ముందే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్ళాలి అని రేవంత్‌రెడ్డి సర్కార్ భావించినప్పటికీ దానికి సంబంధించిన బిల్లులు రాష్ట్రపతివద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా తన వద్దకు వచ్చిన ఆర్డినెన్స్‌ను న్యాయసలహా కోసం కేంద్రానికి పంపడంతో అది కూడా పెండింగ్‌లోనే ఉంది. కాగా స్థానిక ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన గడువు సెప్టెంబరు 30 సమీపిస్తుండగా.. ఎన్నికలపై ఎలాగైనా ముందుకుపోవాల్సిందేనని యోచన చేస్తుంది. ఈ మేరకు పిఎసి సమావేశంలో పార్టీ నేతల అభిప్రాయాన్ని తీసుకోనున్నారు. ఒక వేళ ఎన్నికలకు వెళ్లాలనే భావిస్తే రిజర్వేషన్లు పార్టీపరంగా ఇవ్వాలా లేదా మరేదైనా మార్గం చూడాలా అనే విషయంలో పార్టీ లోని మెజార్టీ నేతల >>2

## యాదాద్రి విద్యుత్‌కేంద్రం జనవరి 15న జాతికి అంకితం

### పరిసర ప్రాంతాల్లో ఉచితంగా కార్పొరేట్ విద్య, వైద్యం

### భూ నిర్వాసితులైన 500 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించిన డి.సిఎం భట్టి




శుక్రవారం హైదరాబాద్‌లో యాదాద్రి పవర్‌ప్లాంట్ భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, అగస్టు 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అంతేకాకుండా దేశంలోనే ఉత్తమ గ్రీన్ పవర్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులైన 500మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే >>2



## ప్రముఖ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత

**హైదరాబాద్, ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత సంతతికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కపారో గ్రూప్ వ్యవస్థాపకులు లార్డ్ స్వరాజ్ పాల్ (94) మృతిచెందారు. లండన్‌లో ఉంటున్న ఆయన కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఓఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆయన గురు >>2






## 'మిషన్ డాన్'.. టెన్త్‌క్లాస్ హంతకుడు!

### ఓ బాలికను గొంతులో పలుమార్లు పొడిచి హత్య

### చోరీకి వెళ్లి ఆమెను చంపేసినట్లుగా గుర్తించిన పోలీసులు

### సినిమాటిక్‌గా కథ నడిపి పోలీసులనే ఏమార్చిన వైనం

### బాలుడి ఇంటినుంచి రక్తపు మరకల దుస్తులు, కత్తి స్వాధీనం

### హైదరాబాద్ కూకట్‌పల్లిలో సంచలన ఘటన

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో బాలిక సహస్ర(12) దారుణ హత్య వెనుక మిస్టరీ వీడింది. పదో తరగతి విద్యార్థి బాలికను హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం.హత్య నిందితుడు 10వ తరగతి విద్యార్థి తన దొంగతనం ప్లాన్‌ను 'మిషన్ డాన్' పేరుతో రాసుకోవడం విచారణలో బయటపడింది. సహస్ర ఇంట్లోకి ప్రవేశించడం, దొంగతనం చేయడం, ఆపై తప్పించుకోవడం వరకు అన్నీ చీటీలో రాసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వచ్చిన ఇంగ్లీషులో రాసిన ఆ లేఖలో, సహస్ర ఇంట్లో ఉన్న ఎంఆర్‌ఎఫ్ బ్యాట్ కోసం వెళ్లానని పోలీసులకు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశాడని అధికారులు వెల్లడించారు.?

ఏం జరిగిదంటే.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ముక్త్యాసారం గ్రామానికి చెందిన కృష్ణ, రేణుక దంపతులు ఐదేళ్లుగా కూకట్‌పల్లి సంగీతనగర్లో నివాసం ఉంటున్నారు. కృష్ణ స్థానికంగా మెకానిక్ షెడ్డులో పనిచేస్తుండగా, రేణుక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్.వీరికి కుమార్తె సహస్ర(10), కుమారుడు(7) ఉన్నారు. సహస్ర బోయిన్‌పల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. కుమారుడు ఇంటికి సమీపంలోని బడికి వెళ్తున్నాడు.సోమవారం ఉదయం యథావిధిగా తల్లిదండ్రులు విధులకు వెళ్లగా, వారి కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. క్రీడోత్సవాల నేపథ్యంలో పాఠశాలకు సెలవు ఇవ్వడంతో బాలిక ఒంటరిగా ఇంట్లో ఉంది.

స్కూల్ నుంచి ఫోన్ రావడంతో తానే స్కూలుకు వెళ్లి తమ్ముడికి లంచ్‌బాక్సు ఇస్తానని బాలిక చెప్పడంతో తల్లి భోజనం సిద్ధం చేసింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో లంచ్ బాక్సు తీసుకురాలేదేమంటూ స్కూల్ సిబ్బంది.. కృష్ణకు ఫోన్‌చేయడంతో ఆయన హుటాహుటిన ఇంటికి వెళ్లారు. తలుపు బయటనుంచి గడియ పెట్టి ఉండటంతో తెరిచారు. కుమార్తె శరీరంపై కత్తిపోట్లతో మంచంపై విగతజీవిగా కనిపించ >>2

## వైద్య, ఆరోగ్య శాఖలో 1623 పోస్టులు భర్తీ


### - నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 22:** తెలంగాణ రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. వైద్య, విధాన పరిషత్‌తోపాటు ఆర్‌టిసి హాస్పిటల్‌లో పలు వైద్యుల పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మొత్తం 1623 పోస్టులను భర్తీ చేయడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ నంబర్ 04-2025ను జారీ చేసింది. అందులో భాగంగా వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్స్‌లో 1616, ఆటిసి హాస్పి >>2

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ కూనంనేని

### 10 మంది కార్యదర్శివర్గం, 30మంది కార్యవర్గం

### పార్టీ నాలుగవ మహాసభలో ఏకగ్రీవ ఎన్నిక



కూనంనేని సాంబశివరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహ ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజుల రామారం)లో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ చివరి రోజు శుక్రవారం నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా >>2



భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా శుక్రవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం

# మళ్లీ కూనంనేని

>> ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. కార్యదర్శిగా కూనంనేని పేరును సిపిఐ సీనియర్ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర సమితి ఏక్రగీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సిపిఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు : కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డ, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహ, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యవర్గం: కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేనశంకర్, ఎం.బాలనరసింహ, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ, బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహరెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సి.హెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్‌రాజ్, మందా పవన్, బి.విజయసారధి, కర్రె భిక్షపతి, పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమా మహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా ఎంపికయ్యారు. ఆహ్వానితులుగా గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాండ్ర సదానందం ఎన్నికవ్వగా, రంగారెడ్డి నుంచి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంది. జిల్లాల నుంచి: సుధాకర్(నిజామాబాద్), ఎల్.దశరథ(కామారెడ్డి), టి.ఎం.ఖాలీఖ్ (మెదక్), విజయలక్ష్మీ పండిట్ (వికారాబాద్), చెన్నవిశ్వనాథం (జగిత్యాల), టి.నర్సింహ(నారాయణపేట్), బి.ఆంజనేయులు (గద్వాల్), బి.బాలకిషన్ (మహబూబ్‌నగర్), తోట మల్లిఖార్జున్‌రావు(ములుగు), ముదుపు ప్రభాకర్ రెడ్డి (ఆదిలాబాద్), బద్రి సాయికుమార్ (ఆసిఫాబాద్), మంద సుదర్శన్ (సిరిసిల్లా), కె.విజయరాములు (వనపర్తి), సయ్యద్ జలాలుద్దీన్ (సంగారెడ్డి), మేకల రవి, షేక్ బాసుమియా, పంజాల రమేశ్ (వరంగల్), పంజాల శ్రీనివాస్, అందె స్వామి (కరీంనగర్), రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ (మంచిర్యాల), తాండ్ర సదానందం, గోశిక మోహన్ (పెద్దపల్లి), దండి సురేశ్, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు (ఖమ్మం), ఎస్.కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి(కొత్తగూడెం), ఎస్.ఎం.డి.ఫయాజ్ (నాగర్ కర్నూల్), మందా పవన్,కె.శంకర్ (సిద్ధిపేట్), నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహ రెడ్డి, ఎల్.శ్రవణ్‌కుమార్ (నల్లగొండ), గన్నా చంద్రశేఖర్,బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు (సూర్యాపేట), గోదా శ్రీరాములు, యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, చేడె చంద్రయ్య (యాదాద్రి భువనగిరి), పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎం.డి.ఫహీదా, ఒరుగంటి యాదయ్య (రంగారెడ్డి), ఇ.ఉమా మహేశ్, జి.దామోదర్‌రెడ్డి (మేడ్చల్), కర్రె భిక్షపతి, అదారి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మందా సదాలక్ష్మి (హన్మకొండ), కొరిమి రాజ్‌కుమార్ (భూపాలపల్లి), సి.హెచ్.రాజారెడ్డి ,పాతూరి సుగుణమ్మ (జనగామ), బి.విజయసారధి, బి.అజయ్ సారధి(మహబూబాబాద్), స్టాలిన్, ఛాయాదేవి (హైదరాబాద్),ఇన్సాఫ్(1), నిర్మల్ జిల్లా(1), మజ్దూర్ ఫ్రంట్(1), రంగారెడ్డి (2) సభ్యులను ఎన్నుకోవలసి ఉంది.

# తెలంగాణకు గోదావరి జలాలలో 968టిఎంసిలు కేటాయించండి

## ఇచ్ఛంపల్లి ఎన్ఎస్‌పి అనుసంధానంపై తెలంగాణ ఎన్‌డబ్ల్యుడిఏ సంయుక్త సర్వే

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌గఢ్ జలసౌధలో ఎన్‌డబ్ల్యుడిఏతో సమావేశం

## వర్చువల్‌గా మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి హాజరు

**హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త:** తెలంగాణకు గోదావరి జలాలలో 968 టిఎంసి వాడుకొనే హక్కు కల్పించాక మిగులు జలాలు ఎటు మళ్ళించినా అభ్యంతరంలేదని ఇచ్చంపల్లిలో ప్రాజెక్టు నిర్మించి నాగార్జునసాగర్ నీటి తరలింపు కోసం చేపట్టే భూసేకరణ విస్తీర్ణం కూడా అత్యంత కనిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ఖరాఖండిగా తేల్చి చెప్పింది. శుక్రవారం జలసౌధలో జలశక్తి మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ నీటివనరుల అభివృద్ధి ఏజెన్సీ ఆధ్వర్యంలో కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన కావేరి నదుల అనుసంధానంపై పరివాహక రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపారు. అతుల్‌జైన్ మాట్లాడుతూ కావేరి బేసిన్‌కు గోదావరి ఒక్క చుక్కనీటిని తరలించమని హిమాలయాల్లో నీటిని మాత్రమే తీసుకెళ్ళుతామని చెప్పారు. గోదావరి కావేరి అనుసందానం సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఎనిమిది రాష్ట్రాలకు అందజేశామని ఎవరి నీటి హక్కులకు భంగం కలుగకుండా మరోమారు సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ అతుల్ జైన్ వెల్లడించారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ అనుసంధానం వల్ల వ్యవసాయభూములు సేకరణ చేయాల్సిన పరిస్థితి ఉందని వాటిని తగ్గించాలన్సిన అవసరం ఉందని తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ తన అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. దీనితో అతుల్ జైన్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్‌డబ్ల్యుడిఏ సంయుక్త సర్వేచేసి భూసేకరణ కనిష్ఠంగా చేసేందుకు అనుకూల ప్రత్యామ్నయాలను పరిశీలిద్దామని హామి ఇచ్చారు. గోదావరి నీటిని సాగర్ టెల్‌పాండ్‌లో వేయాలని సాగర్‌లో నేరుగా తరలించవద్దని రాహుల్ బొజ్జ తెలిపారు. జిడబ్ల్యుడిటి అవార్డుప్రకారం నికరజలాల లేవని మిగులు జలాలు ఉంటే నే ప్రాజెక్టులు చేపట్టాలని నదుల అనుసంధానంపై రాష్ట్ర అభిప్రాయాలు వివరించినట్లు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. గోదావరి కావేరి అనుసంధానం సందర్భంగా తెలంగాణ నుంచి వెళ్తున్న నీటిలో సగం అంటే. 74 టీఎంసీలు కోరినట్లు తెలిపారు. సమ్మక్కసాగర్,47టిఎంఇసిల,సీతమ్మసాగర్ 67టిఎంసిలు, డిఎల్ఐసి 38మిగితా 148 టిఎంసిలకు మంజూరుచేశాకనే నదల అనుసంధానంచేయాలని తెలంగాణ తన గొంతును వినిపించింది. ఏపీ నాలుగు ఇంట్రా లింక్లను ప్రతిపాదించిందని తెలంగాణ సమ్మతి లేకుండా ఇంట్రా లింకులు ఆమోదించవద్దని కోరాం. బనకచర్ల లింక్ అంశం అంతగా చర్చకు రాలేదని ఐనా డిపిఆర్ తీసుకోవద్దని ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రాష్ట్ర అభిప్రాయాలను గతంలోనే చెప్పిందే మళ్ళీ వివరించామని రాహుల్ బొజ్జా వివరించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. గోదావరి జలాల్లో ఛత్తీస్ గఢ్‌కు కేటాయించిన 301 టిఎంసిలలలో మిగితా 145 టీఎంసీల నీటిని కావేరికి అనుసంధానించాలన్నది ప్రతిపాదన ఆరాష్ట్రం నుంచి వచ్చింది ఇందుకోసం ఇచ్చంపల్లి వద్ద ఆనకట్ట నిర్మించి అక్కడి నుంచి గోదావరి నీటిని కావేరికి మళ్లించాలని ఆ రాష్ట్రం కోరింది. కెడబ్ల్యుడిటి అవార్డు వచ్చాక గోదావరి జలాల నీటివాటా తేల్చాల్సి ఉంటుందని అన్నారు.

# టెన్త్‌క్లాస్ హంతకుడు!

>> దంతో భయభ్రాంతులకు గురై కేకలువేశారు. ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారమిచ్చారు.

**బాలిక ఒంటి మీద 20 కత్తి గాట్లు..**

బాలిక శరీరంపై 20 వరకు కత్తి గాయాలున్నాయి. మెడపైనే 10 ఉన్నాయి. పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ప్రకారం..హత్య సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య జరిగినట్లు సమాచారం. ఆ సమయంలోనే బాలిక కేకలు వినిపించినట్లు పక్క భవనంలో నివసించేవారు పోలీసులకు సమాచారమిచ్చారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ సభ్యులు ఆధారాలు సేకరించారు. జాగిలం ఘటనా స్థలం నుంచి నేరుగా కిందికి వెళ్లింది. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సిసి కెమెరాల ఫుటేజీలు సేకరించి..గత ఐదు రోజులుగా అన్ని కోణాల్లో సమాచారం సేకరించిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హత్య జరిగిన రోజు కూడా బాలుడు పోలీసుల ముందుకు వచ్చి కథలు చెప్పాడు.'సహస్ర ఇంట్లోంచి నానా..నాన్నా అని అరుపులు వినిపించాయి' అని చెప్పిన బాలుడు, మరొకరు హత్య చేసినట్లుగా అనుమానాలు కలిగించాడు.దీని ఆధారంగా మొదట విచారణను ఇతర కోణాల్లో కొనసాగించిన పోలీసులు, తర్వాత మలుపు తిప్పారు. శుక్రవారం ఉదయం మరోసారి ఆధారాలు సేకరించడానికి ఎస్ఓటీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పక్క భవనం నుంచి సులభంగా సహస్ర ఇంట్లోకి దూకవచ్చని గుర్తించారు. దీంతో పక్క భవన నివాసులందరినీ ప్రశ్నించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కీలక సాక్ష్యాలు ఇచ్చాడు. హత్య రోజు తన గది పక్కనే బాలుడు 15 నిమిషాలు దాక్కొని ఉన్నాడని, ముఖం గుర్తుపడుతానని చెప్పడంతో పోలీసులు అనుమానాలు బలపడ్డాయి.

**రక్తం దుస్తులు, కత్తి, 'మిషన్ డాన్' రాసుకున్న చీటీ స్వాధీనం..**

అనుమానాలపై స్కూల్‌కు వెళ్లిన ఎస్వోటీ పోలీసులు బాలుడిని పక్కకు పిలిచి ప్రశ్నించారు. మొదట తనకు సంబంధం లేదని, హత్య చేయలేదని తప్పుదారి పట్టించాడు. అనంతరం బాలుడు ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ఇంట్లో తనిఖీలు జరిపారు. ఆ సమయంలో రక్తంతో తడిసిన దుస్తులు, కత్తి, అలాగే 'మిషన్ డాన్' పేరుతో రాసుకున్న చీటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఓటిటిలో చూసిన సిరీస్ ప్రభావంతో హత్య, దొంగతనం, ఎస్కేప్ ప్లాన్ తయారు చేసినట్లు తెలిసింది. హత్యకు రెండు రోజుల ముందే కాగితం మీద పూర్తి 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' రాసుకున్న బాలుడు, గ్యాస్ లీక్ చేసి తప్పించుకోవాలన్న ఆలోచన కూడా చేసినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు ఛేదనలో ఎస్వోటీ,కూకట్‌పల్లి పోలీసులు కలిసి 300 మందిని విచారించారు. దీంతో సహస్ర హత్యకు బాలుడే బాధ్యుడని పోలీసులు తేల్చారు. దొంగతనం కోసం ప్రణాళికవేసి, సహస్రను అడ్డం వచ్చినందుకు హత్య చేసినట్లు నిర్ధారించారు.

# ప్రాణాలతో చెలగాటమా?

>> బర్త్‌డే రోజే తన తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడి ఘటనపై ఉద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన 9 ఏళ్ల బాలుడు తలకొరివి పెట్టడం కలిచివేసిందని జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపేసుకుంటే ఎలా అని సూటిగా ప్రశ్నించారు. అందరం బాధ్యులమేనని న్యాయమూర్తి అన్నారు. సమాజం సిగ్గుతో తలదించుకోవాలని, చలన రహిత చట్టాలతో ప్రజల ప్రాణాలు ఎలా కాపాడగలమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైర్ల బరువుతో స్తంభాలు ఒరిగిపోతున్నాయన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మామూళ్లతో కొందరు విద్యుత్ ఉద్యోగుల జేబులు బరువెక్కుతున్నాయని అన్నారు. ఒకరినొకరు నిందించుకోకుండా ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని సూచించారు. చట్టాలు కఠినంగా ఉంటే అమలు చేయలేం, సులభంగా ఉంటే ప్రజలు ఆచరించరని వ్యాఖ్యనించారు. స్తంభాలపై అన్ని వైర్లు నల్లగా ఉన్నందున గుర్తుపట్టలేకపోయామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కరెన్సీ నోట్లపై ఉన్న గాంధీని మాత్రం బాగానే గుర్తుపడతారని జస్టిస్ నగేష్ భీమపాక అధికారులకు చురకలంటించారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. కాగా, రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఈనెల 17న అర్ధరాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలిలోనే నలుగురు, ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరొకరు ప్రాణాలు విడిచారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం నాడు రాత్రి ఊరేగింపు ఉత్సవాలు చేపట్టిన క్రమంలో రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేసిన యువకులు, రథాన్ని చేతులతో లాగుతూ అలా ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి పైన ఉన్న కరెంటు తీగలు తగిలాయి. దీంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి విద్యుత్ షాక్ కొట్టడంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లు దూరంగా ఎక్కడికక్కడ పడిపోయారు. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే ప్రాథమిక చికిత్స చేపట్టి దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నలుగురు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), రాజేంద్రరెడ్డి(45), శ్రీకాంత్ రెడ్డి(35), రుద్రవికాస్(39) ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనతో విద్యుత్ శాఖ మొత్తం ఉలిక్కిపడింది. ఉన్నతాధికారులు భట్టి విక్రమార్కకు విషయం చెప్పగా ఆయన ఈ కేబుళ్లను తొలగించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కేబుళ్లను తొలగించిన కొన్ని చోట్ల ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా పోయింది. ఇంటి నుంచి పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సోషల్ మీడియాలో అసహనం వ్యక్తం చేశారు.

# కాళేశ్వరం నివేదికపై 'స్టే'కు తిరస్కృతి

>> మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పిసి ఘోష్ నివేదిక.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది. కాగా, పిసి ఘోష్ కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు అడ్వకేట్ జనరల్ (ఎజి) శుక్రవారం తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అందిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతామని కోర్టుకు స్పష్టం చేశారు.అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంటే, ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కోర్టుకు ఎజి వివరించారు. అంతలో హరీష్ రావు తరపు న్యాయవాది సుందరం తన వాదనలు వినిపిస్తూ.. మొత్తం కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని తమ పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతున్నామని కోర్టు దృష్టికి న్యాయవాది సుందరం తీసుకు వెళ్లారు. అంతేకాకుండా.. జస్టిస్ పిసి ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. తమకు 8బి, 8సి కింద నోటీసు ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తులు జోక్యం చేసుకుని.. 8బి నోటీస్ కాకుండా సెక్షన్ 5(1) ఎందుకు ఇచ్చారంటూ ప్రభుత్వ తరపు నాయ్యవాది ఎజిని సూటిగా ప్రశ్నించారు. తాము ఇచ్చిన నోటీస్ 8బి లాంటి నోటీసని కోర్టుకు ఎజి తెలిపారు. హరీష్ రావు, కెసిఆర్ అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఈ సందర్భంగా కోర్టుకు గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ఈ నివేదిక పెట్టిన తర్వాతే చర్యలు తీసుకుంటామని ఏజీ వెల్లడించారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటుందని కోర్టుకు ఎజి వివరించారు.బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పగుళ్లు ఏర్పాడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 16 నెలల పాటు వందలాది మందిని విచారించింది. అలాగే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌లను సైతం విచారించి, కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్మ, కర్త, క్రియా అంతా కెసిఆర్ అంటూ ఈ విచారణలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ బిఆర్ఎస్ అగ్రనేతలు కెసిఆర్, హరీష్ రావులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం విచారణ జరిపింది. ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం బిఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలు ఉంటాయా? లేకుంటే ముందే ఉంటాయా అంటూ ఎజిని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై తమకు ఒకరోజు వరకు గడువు ఇవ్వాలని ఎజి కోరారు. దీంతో శుక్రవారం ఈ కేసును హైకోర్టు విచారించి పిసి ఘోష్ నివేదికపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.

# కన్నుమూత

>> వారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) తుదిశ్వాస విడిచారు. స్వరాజ్‌పాల్ 1931, ఫిబ్రవరి 18న పంజాబ్‌లోని జలంధర్‌లో జన్మించాడు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పట్టా పొందారు. అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. అనంతరం తన తండ్రి స్థాపించిన కుటుంబ వ్యాపార సంస్థ అపీజే గ్రూప్‌లో పనిచేసేందుకు భారత్‌కు తిరిగి వచ్చారు. అయితే1966లో క్యాన్సర్‌తో బాధపడుతున్న తన చిన్న కూతురు అంబికా పాల్ చికిత్స కోసం లండన్‌కు మకాం మార్చారు.

# జాతికి అంకితం

>> ఇవ్వగా దాదాపు రెండు సంవత్సరాల పాటు యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేలకోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఈ యూనిట్ ఒక్కరోజు ఆలస్యమైన నేపథ్యంలో ఆర్థిక భారం తీవ్రంగా రాష్ట్ర ప్రజలపై పడిందని చెప్పారు. గత ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిపించి పర్యావరణ అనుమతులను వెంటనే తీసుకువచ్చామని వివరించారు. అప్పటి నుండి ఈ పవర్ ప్లాంట్ పనులను పర్యవేక్షణ చేస్తూ, ప్రతి వారం ప్రాజెక్టులో పూర్తి చేయాల్సిన పనులకు క్యాలెండర్ నిర్దేశించి ఆ మేరకు ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

## వారం - వర్జ్యం

23-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు,
అమావాస్య, ఉ.11.39
మఖ రా.12.57
వర్జ్యం : ఉ.9.20-11.01
దు.తె.5.54-7.32
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. నూతన వస్తులాభం.

**వృషభం :** నూతన విద్య ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కర్కాటకం :** దూరప్రాంతాలనుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివాదాలు కొంతవరకు పరిష్కారమవుతాయి.

**తుల :** ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. ఆరోగ్యం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:** పరిశోధనలు, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు. ఆర్థిక పరిస్తితి అనుకూలం.

**ధనుస్సు:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తను పటించండి.

**మకరం:** సంతాన విద్యా విషయాలపట్ల శ్రద్ధ కనబరుస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కుంభం:** మిత్రుల సహాయంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తిచేస్తారు.

**మీనం :** ఇంటాబయటా అనుకూల స్థితి ఉంటుంది. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం కోల్‌కతాలో పర్యటన సందర్భంగా విద్యార్థులతో కలిసి మెట్రో రైల్‌లో ప్రయాణించిన ప్రధాని మోడీ

# డిమాండ్ ఉన్న జిల్లాలకు యూరియా ఇబ్బందులు లేకుండా సరఫరా

## వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని డిమాండ్ తక్కువగా ఉన్న జిల్లాల నుండి డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాలకు యూరియాను తరలించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పాసుబుక్‌లను అనుసంధానం చేసి యూరియాను పంపిణీ చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. ఇంపోర్ట్ యూరియా సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో పాటు, రామగుండం ఫ్యాక్టరీ నుండి యూరియా ఉత్పత్తి అనుకున్న స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. యూరియా కేటాయింపులు, సరఫరా కేంద్రం పరిధిలో ఉంటాయని చెప్పారు. రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ స్వార్థంతో విమర్శలు చేయడం, క్యూ లైన్‌లో చెప్పులు పెట్టించి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో రామగుండం కర్మాగారం పనిచేయని కారణంగా ఉత్పత్తి ఆగిపోయి, దాదాపు 63 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయలేకపోయారన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో తెలంగాణకు కేటాయించిన యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ లైన్‌లు లేకుండా చూడాలని, టోకెన్ పద్ధతిలో రైతులకు యూరియా బస్తాలు అందించాలని వెల్లడించారు. ప్రైవేట్ డీలర్ల దగ్గర ఉన్న యూరియాపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, కో ఆపరేటివ్ కమీషనర్ సురేంద్ర మోహన్, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

>> చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటిని తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

# సురవరం సుధాకర్ రెడ్డి ఇక లేరు

>> కాలంగా సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారని సమాచారం. శుక్రవారం రాత్రి పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. పాలమూరు జిల్లాకు చెందిన సుధాకర్‌రెడ్డి 1998,2004లో రెండుసార్లు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎంపికగా ఎన్నికయ్యారు. సిపిఐ అగ్ర నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేత గా ఎదిగారని, వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు.రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప నాయకుడని కొనియాడారు.దేశ రాజకీయాల్లో తన దైన ముద్ర వేసిన గొప్ప నాయకున్ని కోల్పోయామని ముఖ్యమంత్రి తన బాధను వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసే కమ్యూనిస్టు నేతగా తన జీవితకాలం కృషి చేసిన తెలంగాణ మట్టి బిడ్డ సురవరం అని పేర్కొన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దేశ రాజకీయాలలో ఆయనది చెరగని ముద్ర వేశారని, నిబద్ధత, క్రమశిక్షణ,నిజాయతీలు ఆయనకు సొంతం అనిచెప్పారు. కమ్యూనిస్టు రాజకీయాలలో ఆయన అజాత శత్రువు అని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. 2సార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నిబద్ధత గల నాయకుడని కొనియాడారు.దేశ రాజకీయాల్లో తన దైన ముద్ర వేసుకున్న గొప్ప నాయకున్ని కోల్పోయామని మంత్రి పేర్కొన్నారు.. వారి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని తన సంతాపాన్ని తెలియజేశారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సురవరం సుధాకర్ రెడ్డి కొండ్రవుపల్లి అనే మారుమూల పల్లెలో జన్మించి సీపీఐ పార్టీలో జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, వారు ఎన్నో ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేశారని ఈ సందర్భంగా మంత్రి వారిని స్మరించుకున్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం ఎంతో బాధాకరం.వారి ప్రజాసేవా, ఉద్యమ పంథా చిరస్మరణీయమని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు.

# రిజర్వేషన్లకు కాంగ్రెస్ సిద్ధం!

>> అభిప్రాయం మేరకు నిర్ణయించబోతున్నారు.పిఎసి సమావేశం ముగిశాక ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగబోతున్నది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు, రిజర్వేషన్ల విషయంలో అధికార పక్షం తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 25వ తేదీన సచివాలయంలో కేబినెట్ జరుగనుంది. ఈ భేటీలో భాగంగా స్థానిక ఎన్నికలపై చర్చించడం, బిసి రిజర్వేషన్‌ల గురించి నిర్ణయం తీసుకోవడంతో పాటు నేడు జరిగే పిఎసి సమావేశంలో తీసుకునే నిర్ణయాలపై కేబినెట్‌లో చర్చించనున్నట్టుగా తెలిసింది. దీంతోపాటు అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రవేశపెట్టే తేదీలను ఖరారు చేయనున్నట్టుగా సమాచారం. కాళేశ్వరం నివేదికపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఇటీవల హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని న్యాయస్థానానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ఈ భేటీలో తేదీలను ఖరారు చేయనున్నట్టుగా తెలుస్తోంది. కాగా పదవుల కేటాయింపుల్లో కాంగ్రెస్ పై యాదవ సామాజిక వర్గ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమకు పదవుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, 5 కార్పొరేషన్ చైర్మన్లు, 5 డిసిసి అధ్యక్ష పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో 1623 పోస్టులు భర్తీ

>> టల్‌లో 7 పోస్టులను భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. దరఖాస్తులకు సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనుంది. దరఖాస్తులను ఎడిట్ చేసుకోవడానికి సెప్టెంబర్ 23, 24 తేదీల్లో అవకాశం కల్పించారు. దరఖాస్తులను కేవలం ఆన్‌లైన్‌లోనే స్వీకరించనున్నారు. ఎవరైనా ఒకటి కంటే ఎక్కువ పోస్టులకి దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఆయా పోస్టులకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మల్టీజోన్-1లో 858 పోస్టులు, మల్టీజోన్-2లో 765 పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని పోస్టులకి వేతనం రూ. 58,850 నుంచి రూ. 1,37,050 వరకు ఉండగా.. ఆర్‌టిసి హాస్పిటల్‌లోని పోస్టులకి వేతనం రూ. 56,500 నుంచి రూ. 1,31,000 వరకు ఉంటుందని ప్రకటించింది. పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటల్స్‌లో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనుంది. జిల్లా, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం.. మరో 7 వేల పోస్టులను భర్తీ చేయనున్నారు.



మహిళా పోలీసుల ముగింపు సదస్సులో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

# మహిళా పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

## ముగింపు సదస్సులో డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు ప్రభుత్వం ఎల్లవేళలా అ ండగా వుంటుందని ఆయన హామీ ఇచ్చారు. శివార్లలోని హిమాయత్‌సాగర్‌లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో శుక్రవారం నాడు జరిగిన మహిళా పోలీసుల మూడు రోజుల ముగింపు సదస్సుకు బట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీసులు సదస్సులో చేసిన సిఫార్సులను సర్కారు అమలు చేస్తుందని తెలిపారు. పోలీసు నియామకాల సమయంలో ఎలాంటి లింగ వివక్ష లేదని, విధుల్లో దానిని సాకుగా చూపడం సరికాదని ఆయన అన్నారు. మహిళా పోలీసు సిబ్బంది వ్యక్తిగత అవసరాలు, యూనిఫాం సహా ఇతర న్యాయమైన నివి అమలు చేయతగినవేనని ఆయన వెల్లడించారు. మహిళా పోలీసు సిబ్బంది సమస్యలపై త్వరితగగిన ఓ కమిటీ వేసి శాస్త్రీయంగా ఒక నివేదిక ను ప్రభుత్వానికి అందజేస్తే అమలు చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆయన అన్నారు. ప్రజల అవసరాలను తీర్చడం తమ ప్రభుత్వ కర్తవ్యంగా భావిస్తున్నట్లు బట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తున్న సిబ్బంది అవసరాల గురించి ఆలోచించాల్సిన అవసరం కూడా తమపై వుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది అవసరాలు తీర్చి ప్రజల జీవన స్థితిగతులను ఏ రకంగా మార్చగలం అన్న భావంతో మానవీయ కోణంలో పరిపాలించే తమ సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ కెబినెట్ తెలంగాణలో వుందని బట్టి విక్రమార్క తెలిపారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే పెట్టుబడులు రావాలని, పెట్టుబడులు రావాలంటే శాంతి భద్రతలు సుస్థిరంగా వుండాలని ఆయన అన్నారు. ఇదంతా జరగాలంటే అంకిత భావంతో పనిచేసే పోలీసులు వుండాలని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే తమ ప్రభుత్వం పోలీసు శాఖ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తుందని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో వుందని ఆయన తెలిపారు. ఇం దుకు రాష్ట్ర పోలీసు విభాగంలోని అన్ని కేటగిరిల సిబ్బంది కృషి కారణమని డిప్యూటి సిఎం తెలిపారు. పోలీసుల సమస్యలను ఉన్నతాధికారులు తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న 104 యంగ్ ఇండి యా స్కూల్స్ నిర్మాణం రాష్ట్రంలో ఒక మైలురాయిగా ఆయన అ భివర్ణించారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా మాట్లాడుతూ మారిన పరిస్థితులకు అనుగుణంగా మహిళా పోలీసులు తమ విధి నిర్వహణలో మరంత సమర్థవంతంగా రాణిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖలోని అన్ని విభాగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఆయన కితాబునిచ్చారు. సమావేశంలో డిజిపి జితేందర్, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, అదనపు డిజి స్వాతిలక్రా తదితరులు పాల్గొన్నారు.

# పబ్జీ గేమ్ వద్దన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

## నిర్మల్ జిల్లాలో విషాదం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమ్ ఓ విద్యార్థిని బలి తీసుకుంది. నిర్మల్ జిల్లా భైంస్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. భైంసాకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి కుమారుడు బేతి రిషేంద్ర స్థానికంగా తొమ్మిదవ తరగతి చదువుతూ కొన్ని నెలలుగా ఎప్పుడూ సెల్‌ఫోన్‌లో పబ్జీగేమ్ ఆడుతూ చదువును నిర్లక్ష్యం చేశాడు. దీనిపై తల్లిదండ్రులు అతన్ని పలుమార్లు మందలించినా ప్రయోజనం లేకుండా పోయింది. రోజుకు పది గంటలకు పైగా పబ్జి గేమ్ ఆడుతూ స్కూల్‌కు వెళ్లడం మానేశాడు. దీనిపై అతని తల్లిదండ్రులు వైద్యులకు చూపించి కౌన్సిలింగ్ ఇప్పించినా ఉపయోగం లేకుండా పోయింది. ఒక దశలో వైద్యుడిని కూడా ఆ విద్యార్థి బెదిరించాడు. దీంతో తండ్రికి కోపం వచ్చి మూడు రోజు ల క్రితం రిషేంద్ర వద్ద నుంచి ఫోన్‌ను బలవంతంగా లాక్కుని అతన్ని గదిలో బంధించి బుద్ధిగా మసలుకోవాలని హెచ్చరించారు. దీంతో మానసికంగా కృంగిపోయిన ఆ బాలుడు ఇంట్లో ఎవరులేని సమయంలో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు రంగంలో దిగి బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. భైంసా పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

# లక్నోలో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై యువకుడు ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** యుపి రాజధాని లక్నోలో 18 ఏళ్ల యువకుడు ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్ లైన్ గేమింగ్‌పై పార్లమెంట్‌లో చట్టం చేసిన తరువాత ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం. లక్నోలోని గోమతినగర్ ఎక్స్‌టెన్షన్ ప్రా ంతానికి చెందిన 12వ తరగతి విద్యార్థి గురువారం నాడు తన ఇంట్లోనే ఆంగ్ల భాషలో సూసైడ్ లెటర్ రాసి మరీ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమింగ్ మానేయాలని తాను చాలా కాలంగా ప్రయత్నిస్తున్నా తన వల్ల సాధ్యం కావడం లేదని. దీనివల్ల చదువుపై దృష్టి సారించ లేక పోతున్నానని ఆ లేఖలో వివరించాడు. దీనివల్ల భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం వుందని తాను భావిస్తున్నట్లు ఆ లేఖలో తెలిపాడు. తన చావుకు ఎవరు కారణం కాదని, తల్లిదండ్రులు మంచిగా వుండాలని అతను కోరారు. మొదట్లో డబ్బులు కట్టి గేమ్ ఆడిన ఆ యువకుడు ఆ తరువాత ఉచిత గేమ్స్‌కు అలవాటు పడ్డాడని ఈ కేసును విచారిస్తున్న పోలీసులు తెలిపారు.

# పోడు రైతుల విషయంలో కెసిఆర్ ప్రభుత్వాన్ని అనుసరిస్తోన్న రేవంత్‌రెడ్డి సర్కారు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పోడు రైతుల విషయంలో కెసిఆర్ ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫాలో అవుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో గత ఐదు రోజులుగా నిరాహార దీక్ష నిర్వహిస్తున్న సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు రెండు ప్రధాన అంశాలను లేవనెత్తారని అన్నారు. కొముర౦ భీం ఆసిఫాబాద్ జిల్లాను టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించడంతో 339 గ్రామాలలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతాయన్నారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్ శాంక్షన్ చేసిన ఇందిరమ్మ ఇళ్లను కూడా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారంటే ఒక శాఖకు ఇంకో శాఖకు మధ్య సమన్వయం లేదని తెలుస్తుందన్నారు.

ఇప్పటికే కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు 100 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదని, ఈ జిఓ రాష్ట్ర ప్రభుత్వం మే 30వ తేదీ జారీ చేసిందన్నారు. ఆదివాసీ సంఘాలు, ప్రతిపక్షాలు దశల వారీ ఆందోళనలు చేపట్టాయి. కలక్టరేట్‌ని ముట్టడించాయి. జిఓ.49ను రద్దు చేయాలని తమ శాసనసభ్యులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుండి స్పందన కరువైందన్నారు. పోడు భూముల సాగు కోసం సహకరిస్తాము అని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బిసిలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో రైతులెవరిని ఇబ్బంది పెట్టమని హామీ ఇచ్చింది. ఇప్పుడేమో కెసిఆర్ సాగించిన నిర్బంధకాండను కొనసాగిస్తుందని మండిపడ్డారు. ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో పోడు భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకొని రైతులకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారు. ఐదో రోజుకు చేరిన నిరాహార దీక్ష వలన సిర్పూర్ శాసనసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆరోగ్యం క్షీ ణించి షుగర్ లెవెల్స్ 69కి పడిపోయాయి. ప్రభుత్వం దిగివచ్చి ఈ జిఓ నెంబర్ 49 రద్దు చేయాలని, ఉత్తర తెలంగాణలో ఉన్న పోడు రైతులను ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

# కామారెడ్డిలో స్వలింగ సంపర్కులను టార్గెట్ చేస్తున్న ముఠా అరెస్టు

## బాధితుల సంఖ్య 60కిపైగా ఉంటుందని పోలీసుల అనుమానం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** నేరగాళ్లు ఏ చిన్న అవకాశాన్ని వదలడం లేదన డానికి ఇదో ఉదాహరణ. సమాజంలో స్వలింగ సంపర్కం అ లవాటున్న వారిని ఒక పద్దతి ప్రకారం ట్రాప్ చేసి ఆనక ఇద్దరు పురుషులు కలుసుకునే సమయంలో వారి నగ్న ఫోటోలు, వీడియోలను రహస్యం గా చిత్రీకరించి వాటి ద్వారా వారిని బెదిరించి డబ్బులు దోచుకుంటున్న ముఠాను కామారెడ్డి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాలో కొంద రు పట్టుబడగా మరికొందరు పరారీలో వున్నారు. ఈ ముఠా బారినపడ్డ వారిలో 60 మంది వరకు బాధితులు వున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ముఠా వ్యవహారాలను ఒకసారి పరిశీలిస్తే మొదట సోషల్ మీడియా ద్వారా స్వలింగ సంపర్కులకు వల వేస్తున్నారు. దీనికి స్పందించిన వా రిని కామారెడ్డి పట్టణానికి రప్పిస్తున్నారు. అనంతరం స్వలింగ సంపర్కం అలవాటున్న వారిని జనవాసానికి దూరంగా వున్న ప్రాంతంలో రహస్యంగా కలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ముఠా సభ్యులు ముందుగానే కొంత ఫీజు వసూలు చేస్తున్నారు.

ఆనక స్వలింగ సంపర్కులు ఏకా ంతంగా వుండే సమయంలో ముఠా సభ్యులు వారి ఫోటోలు, వీడియోలు రహస్యంగా తీస్తున్నారు. దీని తరువాత స్వలింగ సంపర్కులకు ఫోన్‌లు చేసి ఫోటోలు, వీడియోలు పంపుతూ దండిగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కుటుంబంలో పరువు పోతుందని చాలా మంది స్వలింగ సంపర్కులు ముఠా సభ్యులు కోరినంత ఇచ్చి మిన్నకుంటున్నారు. అయినా ముఠా సభ్యుల వేధింపులు ఎక్కువవడంతో కొందరు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించి తమ గోడును చెప్పుకోవడంతో ఈ ముఠా గోల్‌మాల్ వ్యవహారాలు వెలుగు చూశాయి. రెండు నెలల వ్యవధిలో తొమ్మిది మంది బాధితులు పో లీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠా వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఐదుగురు నేరగాళ్లను అరెస్టు చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా బారినపడ్డ వారిలో తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్రకు చెందిన వారు కూడా వున్నారు.

రెండు నెలల క్రితం ఈ ముఠా బారిన పడి అడిగినంత డబ్బులు ఇచ్చు కోలేక నిజామాబాద్‌లో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపైనా పోలీసులు విచారణ చేబట్టారు. ఈ ముఠా బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాది దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీ సులు చెబుతున్నారు.

# ఆదిలాబాద్‌లో ఎసిబికి పట్టుబడిన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో మరో అవినీతి అధికారి ఎసిబికి పట్టుబడ్డాడు. ఎసిబి డిజి విజయ్ కుమార్ తెలిపిన వి వరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిరిసిన్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం మధ్యవర్తి ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అక్కడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి ఐదు వేల రూపాయలు లం చంగా ఇస్తేనే పని జరుగుతుందని చెప్పడంతో బాధితుడు షాక్‌కు గురయ్యాడు. తన ఆస్తి విలువ చాలా చిన్నదని అంతమొత్తం తాను ఇవ్వ లేనని అతను చెప్పగా లంచం ఇవ్వకుంటే తమ కార్యాల యంలో పని జరగదని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ స్పష్టం చేయడంతో చేసేది లేక బాధితుడు దీనిపై ఎసిబిని ఆశ్రయించాడు. దీనిపై పక్కాగా వ్యవహరించిన ఎసిబి అధికారులు శుక్రవారం ఉదయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కాపు కాయగా మధ్యవర్తి ద్వారా లంచం డబ్బులు తీసుకున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని లంచం సొమ్ము ఐదు వేల రూపాయలను జప్తు చేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డితో పాటు బాధితుడి నుంచి లంచం తీసుకునేందుకు మధ్యవర్తిగా వున్న ప్రైవేటు వ్యక్తిని కూడా ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటన తరువాత సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంతోపాటు శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించి పలు పత్రాలు జప్తుచేశారు. కాగా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడగా ఆ కేసులో అరెస్టయి బెయిలుపై వచ్చి తిరిగి ఎలాగోలా ఉద్యోగం సంపాదించి మరోమారు లంచం కేసులో దొరికిపోయాడు.

## ఎసిబి వలలో వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్

### 70 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

**హైదరాబాద్ (వనస్థలిపురం) ఆగస్టు 22, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా, వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కా ర్యాలయంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ లక్ష రూపాయలు డిమాండ్ చేస్తున్నాడని, ప్లాట్ యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించడం తో రంగారెడ్డి జిల్లా ఎసిబి డి.ఎస్.పి. ఆనంద్ కుమార్ నేతృత్వంలో శుక్రవారం వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించి, ప్లాట్ యజమాని నుండి 70 వేలు లంచం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ సహాయకుడు ,డాకుమెంట్ రైటర్ కె.రమేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఏ.సి.బి. డి.ఎస్.పి. ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా, తుర్కయాంజల్ మున్సిపల్ పరిధిలో 200 గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ కు సంబంధించి ప్లాట్ యజమాని ఇటీవల వనస్థలి పురం సబ్ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ ను కలిసాడు. ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు లక్ష రూపాయలు ఇవ్వాలని ప్లాట్ యజమానికి సూచించాడు. అంత మొత్తం ఇవ్వలేనని, 70 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం ప్లాట్ యజమాని డబ్బులు తీసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కు వచ్చి, సబ్ రిజిస్ట్రార్ సహాయకుడు నాగోల్ కు చెందిన డాక్యుమెంట్ రైటర్ కె.రమేష్ కు ఇస్తుండగా, ఏ.సి.బి.అధికారులు వచ్చి పట్టుకున్నారు. రమేష్ ను అదుపులోకి తీసుకుని విచారించగా, సబ్‌రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ సూచన మేరకే డబ్బులు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఎసిబి అధికారులు రాజేష్ కుమార్, రమేష్‌లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, రమేశ్.

# ఐఆర్‌సిటిసి టూర్ ప్యాకేజీ




**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు టూర్ ప్యాకేజీ ఇండియన్ రైల్వే టూరిజం కార్పొరేషన్ ప్రకటించింది. హైదరాబాద్ నుంచి నేపాల్ పర్యటన సెప్టెంబరులో ఉండగా.. నవంబరులో థాయ్‌లాండ్ పర్యటించేందుకు రెండు ప్యాకేజిలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. సెప్టెంబరు టూర్ 12వ తేదీన ప్రారంభమవుతుందని ఆరు రాత్రులు, ఏడు రోజులు పాటు సాగే యాత్రలో లుంబిని, పొఖరా, కాఠ్‌మాండూ, జనక్‌పుర్ ప్రాంతాలను తిరగవచ్చు. టూర్ గ్రూప్‌లో 30మందికే అవకాశం కల్పిస్తు న్నారు. టిక్కెటు ధర రూ.43,330 నుంచి ప్రారంభ మవుతుందని తెలిపింది. అదేవిధంగా థాయ్‌లాండ్ పర్యటనలో నాలుగు రాత్రులు, ఐదు రోజులు పాటు ఉంటుందని, నవంబరు 6నుంచి మొదల వుతుందని వివరించింది. 14మందికే అవకాశం కల్పించింది. విహారయాత్ర టిక్కెట్ ధర రూ.65,600నుంచి ప్రారంభ మవుతుంది. పట్టాయ, బ్యాంకాక్ కీలకప్రదేశాలు ఉన్నాయి.

# మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేల జరిమానా

## మూడు నెలలు, అంతకుపైగా జైలుశిక్ష

### రోడ్డు ప్రమాదాల నివారణకు సర్కారు కొత్త నిబంధనల అమలు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతీయేట పెరుగుతున్న రోడ్డు ప్రమా దాలను నివారించేందుకు సర్కారు మరిన్ని కఠిన చర్యలకు రంగం సిద్ధం చేసింది. ఇందులో మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకుండా చూడడం, ఒకవేళ వారు వాహనాలను నడుపుతూ పట్టుబడితే సదరు వాహనదారుడికి 25 వేల రూపాయల జరిమానాతో పాటు మూడు నెలలు అంతకు పైగా జైలు శిక్ష విధించేలా కొత్త చట్టం తెచ్చేందుకు సరా ్కరు పరిశీలన చేస్తోంది. పోలీసు, రవాణా శాఖ నుంచి అందిన సిఫార్సులను అమలు చేయాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండడం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోవడం తెలిసిందే. కొన్నిసార్లు ఈ ప్రమాదాలలో వాహనాలను నడిపిన మైనర్లే దుర్మరణం చెందుతుండగా మరికొన్ని ఘటనల్లో ఎదుటి వారు మరణించడం లేదా తీవ్రంగా గాయపడడం జ రుగుతోంది. ఈ తరహా ఘటనలపై పోలీసు శాఖ ఇప్పటికే కొన్ని తీవ్రమైన చర్యలు తీసుకుంటుండడం విదితమే. ఇందులో మైనర్లు వాహనాలు న డిపితే వారికి వాహనం ఇచ్చిన వాహనదారుడిపై కేసు నమోదు చేయడం, ఒకవేళ ప్రమాదాలు సంభవించి మరణాలు వుంటే మైనర్లతోపాటు వాహనదారుడిని అరెస్టు చేసి జైలుకు పంపు తున్నారు. దీంతోపాటు మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం చేస్తున్నారు. ఇదే సమయంలో జరిమానా విధిస్తు న్నారు. ప్రమాదాలకు కారణమైన మైనర్లు మేజర్లయిన తరు వాత కూడా 25 యేళ్ల వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ రాకుండా చేస్తున్నారు. ప్రమాదాలకు కారణమైన వాహనాలను జప్తు చేస్తున్నారు. ఈ తరహా ఘటనల్లో బాధితులకు బీమా కంపెనీలు ఎలాంటి చెల్లింపులు చేయడం లేదు. దీంతో ప్రమాదాలకు కారణమైన వాహనదారుడే బాధితులకు నష్ట పరిహారం అందించాల్సి వుంటుంది. ఒకవేళ మైనర్లు తమకు తాముగా రోడ్డు ప్రమాదాలకుగురై చనిపోతే వారికి బీమా కంపెనీలు నష్ట పరిహారం ఇవ్వడం లేదు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు లోనై చనిపో యిన వారికి కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఇన్ని చర్యలు తీసుకుంటున్నా మైనర్లు వాహనాలు నడపడం ఆగడం లేదు. దీంతో ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహా రించేందుకు పోలీసు, రవాణా శాఖ సర్కారుకు కొన్ని సిఫా ర్సులు చేసింది. ఇందులో మొదటిది మైనర్లు వాహనాలు నడి పితే వాహనదారుడికి 25 వేల రూపాయల జరిమానా విధించ డం. ఒకవేళ వారివల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాద తీవ్ర తను బట్టి వాహనదారుడికి మూడు నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష విధించడం. ఇలాంటి ఘటనలో మరణాలు ఒకటికి మించి వుంటే ఈ జైలు శిక్షను పదేళ్ల వరకు పెంచడం. దీనికి సర్కారు ఆమోదం లభిస్తే కొత్త చట్టం తీసుకువచ్చి మైనర్ల డ్రైవింగ్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని పోలీసు, రవాణా శాఖ సన్నాహాలు చేస్తోంది.

**పాఠశాలల్లో మైనర్ల డ్రైవింగ్‌పై బోధనలు**

కాగా మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాల వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలల్లో బోధనలు చేయాలని పోలీసు, రవాణా శాఖలు విద్యా శాఖను కోరాయి. వారంలో కనీసం రెండుసార్లు దీనిపై విద్యార్థులకు వివరించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని పో లీసు, రవాణా శాఖ కోరింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోనూ మైనర్ల డ్రైవింగ్‌పై పాఠాలు బోధించాలని,దీనివల్ల విద్యార్థులకు మంచి ఏదో? చెడు ఏదో? తెలుసుకునే అవకాశం వుంటుందని పోలీసు,రవాణా శాఖ అధికారులు అంటున్నారు.


BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II,
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
OA No. 474 OF 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
And
M/s. TRMR Infra Projects Pvt. Ltd.,& Ors ....Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
1. M/s. TRMR Infra Projects Pvt. Ltd., Rep. by its Director Mr. Thota Rohit Reddy, Office at : 2-131/132, Jeedimetla Village, Medchal District -500067.
2. Mr. Thota Rohith Reddy S/o. Raja Malla Reddy, Aged about : 38 years, Occ : Business, R/o. Villa No. 138, Ashok A-La Maisom, Dulapally Road, Kompally, Medchal District-500014. Also at : Mr. Thota Rohith Reddy, C/o. H. No. 2-131, Pet Basheerabad, Jeedimetla, Quthubullapur, Hyderabad - 500055.
Please take the summons in the above O.A. No. 474/2025 filed by the applicant for recovery of money of Rs.36,17,376.11 against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 26/09/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 26/09/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 21st of August, 2025.
(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II,
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
OA No. 478 OF 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ...Applicant
And
Mrs. Charanjit Kaur Bagga & Anr ....Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
(1) Mrs. Charanjit Kaur Bagga W/o Gurupreet Singh, Aged about 49 years, Occ : Self Employee, R/o. F-5, Plot No. 92, Nandagiri Hills, Banjara Hills Hyderabad-500034. Also at : Mrs. Charanjit Kaur Bagga, R/o. H.No. 3-1-249-250, S D Road Secunderabad-500003. Also at : Mrs. Charanjit Kaur Bagga, R/o. Plot No. 400, Road No.14, Banjara Hills, Hyderabad-500034.
(2) Mr. Gurupreet Singh Bagga, S/o. Harmahender Singh, Aged about 49 years, Occ : Business R/o. F-5, Plot No. 92, Nandagiri Hills, Banjara Hills, Hyderabad-500034. Also at : Mr. Gurupreet Singh Bagga, R/o. H No. 3-1-249-250, S D Road, Secunderabad-500003. Also at : Mr. Gurupreet Singh Bagga, R/o. Plot No. 400, Road No.14, Banjara Hills, Hyderabad- 500034. ....Defendant/s
Please take the summons in the above O.A. No. 478/2025 filed by the applicant for recovery of money of Rs.56,40,479.45 against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 26/09/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 26/09/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 21st of August, 2025.
(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038.
బహిరంగ ప్రకటన, ప్రణాళికా విభాగం
నం. 000907/HMDA/00191/SWBP/MDLI/2025
ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా శ్రీ నీలం సురేందర్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్, బాచుపల్లి గ్రామం వద్ద సర్వే నం. 29 మరియు 30లోని ప్లాట్ నం. 150 కొరకు స్టిల్ట్+4 అప్పర్ ఫ్లోర్స్ కలిగివున్న హాస్టల్ బిల్డింగ్, 250.62 చ.మీ॥ యొక్క విస్తీర్ణం గల దానికి రివిజన్ పర్మిషన్ కొరకు ఒక దరఖాస్తు దాఖలు చేసారు.
అందువలన 250.62 చ.మీ. యొక్క విస్తీర్ణంకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్, బాచుపల్లి గ్రామం వద్ద వున్న సర్వే నం. 29 మరియు 30లోని ప్లాట్ నం. 150 కొరకు స్టిల్ట్+4 అప్పర్ ఫ్లోర్‌లు కలిగివున్న హాస్టల్ బిల్డింగ్ కొరకు రివిజన్ పర్మిషన్ యొక్క ప్లాట్/ప్లాట్ల యజమానులు/కొనుగోలుదారులు/అగ్రిమెంట్ హోల్డర్‌లు ఈ ప్రకటన ప్రచురింపబడిన 15 రోజులలో దాని చేసిన మార్పులకు సంబంధించి అనగా దరఖాస్తుదారుడు 250.62 చ.మీ. యొక్క ఏరియా నెట్ బిల్ట్ అప్ తో 1 స్టిల్ట్ +4 అప్పర్ ఫ్లోర్‌లు యొక్క కలిగివున్న ఒక హాస్టల్ బిల్డింగ్ కొరకు రివిజన్ ప్రతిపాదన దాఖలు చేసినందున (అంతకుముందు నివాసిత భవన అనుమతి ఉన్నది) వారి అభ్యంతరాలు/సూచనలను రాతపూర్వకంగా ఈ కార్యాలయానికి దాఖలు చేవచ్చును.
నిర్దేశిత కాలంలో ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు అందకపోతే, 250.62 చ.మీ యొక్క విస్తీర్ణానికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్, బాచుపల్లి గ్రామం వద్ద వున్న సర్వే నం. 29 మరియు 30లోని ప్లాట్ నం. 150 కొరకు స్టిల్ట్ +4 అప్పర్ ఫ్లోర్‌లు కలిగివున్న హాస్టల్ బిల్డింగ్ కొరకు రివిజన్ పర్మిషన్ కొరకు దరఖాస్తుదారుని అభ్యర్థన, ఈ కార్యాలయంతో అందుబాటులో వున్న పేపర్‌ల మెటీరియల్‌పై ఆధారపడి పరిగణింపబడుతుందని ఇందుమూలముగా ప్రకటించడమైనది.
సం/-. మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున, HMDA.
DIPR.NO. 6885-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 22.08.2025

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT-I)
3rd FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001
O.A. NO. 279 OF 2025
BANK OF MAHARASHTRA ...Applicant
AND
SRI VENKATESHWARA CREAMERIES AND OTHERS ...Defendant(s)
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
1. M/s. Sri Venkateshwara Creameries Rep by its Partners, Mr.Chollangi Vijay Kumar and Sri Purushotham Venkat Rao, O/o. Sy.no. 692/13, Nagaram Village, Hasanparthy, Hanmakonda- 506371, TG. Borrower
2. Mr.Chollangi Vijay Kumar S/o. C.Pullaya Setty, Age: 42, Occ: Business, R/o. 3-4-60/5, Sir Silk Colony, Kagaznagar- 504296, TG. Partner/Guarantor/Mortgagor
3. Mr. Sri Purushotham Venkat Rao S/o. SP Simhachalam, Age: 43, Occ: Business, R/o. 8-3-231/A/314, Sri Krishna Nagar, Yousufguda, Hyderabad-500045, TG. Partner/Guarantor/Mortgagor
Please take the summons in the above O.A.No. 279/2025 filed by the applicant for Recovery of money of Rs.3,12,49,216.00 Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu daily newspaper and posted the matter to 23.09.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under.
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 23.09.2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 18 th day August, 2025.
(By order of the Court)
Asst Registrar, Debts Recovery Tribunal-1, Hyderabad

పాండిచ్చేరి యూనివర్సిటీ
(కేంద్రీయ విశ్వవిద్యాలయం - NAAC చే "A+" గ్రేడ్ గుర్తింపుతో)
డైరెక్టరేట్ ఆఫ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్
(AICTE & DEB, UGC చే ఆమోదింపబడిన ప్రోగ్రామ్‌లు)
R.V. నగర్, కాలాపేట్, పుదుచ్చేరి - 605014
DDE ప్రవేశాలు 2025-26 (విద్యా సంవత్సరం)
UG ప్రోగ్రామ్‌లు: BCom, BBA, BA (హిస్టరీ), BA (ఇంగ్లీష్), BA (ఎకనామిక్స్), BA (సోషియాలజీ), BA (పొలిటికల్ సైన్స్), BA (జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్) — వార్షిక ఫీజు రూ.4,975/-**
MBA ప్రోగ్రామ్‌లు: MBA (ఫైనాన్స్), MBA (జనరల్), MBA (టూరిజం), MBA (మార్కెటింగ్), MBA (ఇంటర్నేషనల్ బిజినెస్), MBA (హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంట్), MBA (ఆపరేషన్స్ & సప్లై చైన్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ.17,500/-**; MBA (హాస్పిటల్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ. 26,750/-**
PG ప్రోగ్రామ్‌లు: MA ఇంగ్లీష్, MA సోషియాలజీ, MA హిందీ, MCom (ఫైనాన్స్) — వార్షిక ఫీజు రూ.7,425/-**
ప్రోగ్రామ్‌లు AICTE & DEB-UGC చే ఆమోదింపబడినవి
ప్రవేశాలు "ఫస్ట్‌కమ్, ఫస్ట్ సర్వ్‌డు" బేసిస్‌పై ఇవ్వబడును
మరిన్ని ఫీజు వివరాలకు అడ్మిషన్ ఫీజుతో సహా వెబ్‌సైట్‌ను చూడండి
ఫీజు రాయితీలు:
దివ్యాంగ వ్యక్తులకు 100% ట్యూషన్ ఫీజు కన్సెషన్
50% ట్యూషన్ ఫీజు కన్సెషన్ వీరికి:
• భారతీయ సేనా దళం మరియు పారామిలటరీ ఫోర్సెస్‌లో సేవలందించే రక్షణ శాఖా సిబ్బందికి
• ఖైదీలు • తృణించబడిన మహిళలు • వితంతువులు • నపుంసకులు
• పాండిచ్చేరి యూనివర్సిటీ యొక్క ఉపాధ్యాయేతర ఉద్యోగులు మరియు వారి బిడ్డలు (గ్రూప్ B, C & D మాత్రమే)
ఉపకార వేతనం
DDE ప్రోగ్రాంలలో ప్రవేశం పొందిన SC/ST విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్ర/UT ప్రభుత్వాల నుండి వివిధ ఉపకార వేతనాలు పొందవచ్చును.
డిస్టన్స్ సమూనా క్రింద ప్రత్యేక ముఖ్యాంశాలు
• ఒక కేంద్రీయ యూనివర్సిటీ నుండి డిగ్రీ
• క్వాలిటీ ప్రింటెడ్ కోర్స్ మెటీరియల్స్
• అతి తక్కువ సౌలభ్యంతో ట్యూషన్ ఫీజు
• విశిష్టమైన సాంకేతికపరమైన ప్లాట్ ఫాం/వనరులు
• ఎంపికైన కేంద్రాలలో PCP తరగతులు
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి
చివరి తేదీ : 15-09-2025*
*UGC ప్రకటనకు సంబంధించి
తదుపరి వివరాల కొరకు
వెబ్ సైట్: https://dde.pondiuni.edu.in
ఇ మెయిల్: ddehelpdesk@pondiuni.ac.in
ఫోన్: 0413-2654439/441
CBC 21232/12/0001/2526
డైరెక్టర్

వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పనీ చేయొద్దు,
అప్పుడు అన్నీ పొరపాట్లే చేస్తావు.

-బల్తజాన్

# రైతు బతుకుతో ఆటలొద్దు!

ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రైతు ఎడాపెడా సమస్యలతో నిరాశానిస్పృహలతో బతుకుతున్నాడు. ఒకపక్క రుతుపవనాల కారణంగా ఎడతెరిపి లేని భారీవర్షాలతో పంట సంరక్షణకు ఆస్కారం లేక రైతాంగాన్ని కృంగదీస్తుంటే, మరోపక్క 'యూరియా' కొరత రైతు భవిష్యత్‌నే ప్రశ్నిస్తోంది. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉన్నట్లు వార్తలు వస్తున్నా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నంత కొరత మరెక్కడా లేదు. ఈ కొరత వాస్తవమైనదా! కృత్రిమ కొరతో అర్థంకాని పరిస్థితుల్లో రైతు వ్యవసాయశాఖ దయ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఏటా వ్యవసాయ సీజనుకు ముందుగానే ఫలానా సీజన్‌లో యూరియా తదితర ఎరువులు ఎంత మేరకు కావాలి? ఈసారి ఎంత విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుంది. ఆ మేరకు ఎంత యూరియా, ఎరువులు అవసరమౌతాయో నిర్ణయించి కేంద్రాన్ని కేటాయింపులు కోరడం అనాదిగా వస్తోంది. ప్రకృతి ప్రకోపాల బారిన పడిన కర్షకుడు భారమంతా దేవుడి మీదవేస్తాడు. కానీ యూరియా కొరత భారం ఎవరి మీద వేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏకధాటిగా కురుస్తున్న వానలు, మునిగిపోయి చేలు, ఒకపక్క విచారిస్తుండడం ఒకటైతే, యూరియా కోసం అంగళ్ల చుట్టూ తిరుగుతూ, మార్కెఫెడ్ దుకాణాల దయాదాక్షిణ్యాల కోసం పొద్దస్తమానం ఎదురుచూసే రైతాంగం ఒకవైపు. పైగా తమకు కావాల్సిన మొత్తం యూరియా కన్నా ఎంతో కొంత దొరికే ఎరువుకోసం ఆయా మార్కెటింగ్ దుకాణాల వద్దకు తెల్లవారుజామునే సీరియల్ కోసం తమ చెప్పులు పెట్టివస్తున్నారని ప్రత్యక్షంగా కనబడే దృశ్యాలు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటికోసం తిప్పలుపడే మహిళలుఇలాగే వారి వంతు కోసం బిందెలు పెట్టి వచ్చే ఆనవాయితీ తెలిసిందే. ఇప్పుడు పురుషుల వంతొచ్చింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఎరువులు, సాగునీటివసతులు, అందుబాటులోకి వచ్చినప్రస్తుత సమయంలో యూరియా కోసం 'చెప్పుల' వరుసలు చూడటం మనం పురోగమనంలో ఉన్నామా! తిరోగమనంలో ఉన్నామా అనే అభిప్రాయం! కలుగకమానదు. కారణమేదైనా యూరియా కొరతకు వాస్తవ కారణం కేంద్రం రాష్ట్రానికి అవసరమైనంత యూరియా ఎరువులు కేటాయించకపోవడమేనని సుస్పష్టం. రాష్ట్ర ప్రభుత్వం లోపాన్ని ఎత్తిచూపే వారెవరైనా కేంద్రం కేటాయింపుల మీద నోరెత్తరు. పదేపదే రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువుల శాఖమంత్రి జెపి నడ్డాకు తమ అవసరాలు చెప్పి వినతులు పంపుకున్నా ఎరువుల సరఫరాలో లోటు కనపడుతూనే ఉంది. అందుకే రైతుకు తగినంత యూరియా, ఎరువులు అందించలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం మిస్ మేనేజ్‌మెంట్ చేసిందనో కృత్రిమ కొరత సృష్టించిందనో ఆరోపణలు చేసి రైతు నుంచి సానుభూతి పొందాలని కొన్ని రాజకీయ పార్టీలు ఆదిలోనే రంగప్రవేశం చేసినా అవన్నీ వదులుతున్న రైతాంగానికి 'యూరియా' లోటు కేటాయింపుల సంగతి గుర్తించలేనిది కాదు. ఈ ఆగస్టు నాటికే 8.3 లక్షలమెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు అవసరమౌతుంది. ప్రభుత్వం నుండి ఎన్నో అభ్యర్థనలు, ఆఖరికి నాలుగు రోజుల క్రితం పార్లమెంటు ముందు ఎంపిల నిరసన ప్రదర్శన తర్వాతనే కేంద్రం దిగివచ్చింది. 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ఎరువులశాఖ సన్నాహాలు చేస్తోంది. రైతులకు తగినంత యూరియా సర్దలేక ప్రభుత్వం తంటాలు పడుతోంది. ఈ రేషన్ ప్రక్రియలో ఎకరాకు ఒక బస్తా యూరియా కూడా ఇవ్వర్రు. ఆంధ్రప్రదేశ్‌లో నైతే రైతుకు రెండు, మూడు బస్తాలే. విచిత్రమేమిటంటే యూరియా కొరతను దృష్టిలో ఉంచుకుని ఓ రైతు తన స్నేహితుని ఇంట్లో వేడుకకు కానుకగా ఒక బస్తా యూరియా తీసుకెళ్లి సమర్పించుకున్నాడు. ఇలాంటి ఎన్నిసందర్భాలైనా యూరియా కొరతను చాటిచెప్పేవే. మరికొన్ని చోట్లఎరువుల దుకాణాల వాళ్లు రైతుఅవసరాన్ని ఆసరా చేసుకొని తమ వద్దనున్న మ్యురేట్ ఆఫ్ పొటాష్, ఎన్‌పికె ఎరువుల వలెనే ప్రతి రెండు బస్తాలకు ఒక బస్తా యూరియా తమ కొనుగోలు రేటుపై తీసుకోవాలని లింకు పెడుతున్నారు. సరిగ్గా యూరియా వేయాల్సిన ఈ సమయంలో వేయకపోతే పంటకు సాగుపోషకాలందక దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అందుకే రైతు యూరియాను అధికధరకు బ్లాక్ మార్కెట్లో కొనేందుకైనా సిద్ధపడుతున్నారు. సాధారణంగా ఇతర ఎరువులతో లింకు పెట్టి యూరియా విక్రయించడం నాలుగు దశాబ్దాల నాటి బ్లాక్ మార్కెటింగ్ విధానం ఇదని అనడంలో ఎంతో ఏదిరీని పూర్వకాలు నాటివిధానాల్లో రైతు దోపిడీని కొనసాగించడం విచారకరం. కేంద్రం ఆయా రాష్ట్రప్రభుత్వాలకు వారి అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు,సరఫరా చేయలేకపోవడమే నేటి రైతు దుస్థితికి కారణం. దేశీయ అవసరాలకు తగిన ఉత్పత్తి లేదు. పైగా ముందుచూపు నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత సీజన్‌లో తెలంగాణలో 1.15 కోట్ల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసినందున యూరియా డిమాండ్ ఎక్కువ ఉంది. వారికి కావాల్సిన యూరియా అందించలేని ప్రభుత్వాలు రైతులు సాగులో అవసరమైన మోతాదు యూరియా కన్నా అధికంగా వేస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నాయి. 'ఆడలేక మద్దెల' ఓడ అన్న చందాన యూరియా కొరత వ్యవహారం నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడాయూరియా కొరత వ్యవహారం బయటకొచ్చింది. వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందించలేని పరిస్థితికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. ఏదిఏమైనా యూరియా కొరతకు ఎవరు బాధ్యులైనా రైతుల బతుకుతో ఆటలాడుకోవడం ఏమాత్రం సమంజసం కాదు.



చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.

వి.జాన్సన్



ధైర్యం ఒక ఆయుధం. దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.

జార్జి. ఎలియట్

## ప్రజావాక్కు



### మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత డిఎస్సీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల కోసం డిఎస్సీ 2025 నిర్వహించింది. రేపో మాపో ఫలితాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. అయితే నేరుగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపికజాబితా విడుదల చేయాలని ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. కానీ డీఎస్సీ 2025 అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత సెలక్షన్ లిస్ట్ ప్రకటించి నియామకాలు జరపాలి. డిఎస్సీ 2025 నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్ట్ ముందు ప్రకటించి తర్వాత సెలెక్షన్ జాబితా విడుదల చేయాలి. కానీ నేరుగా సెలెక్షన్ జాబితా ప్రకటించి సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ చేయడం సరికాదు. నేరుగా సెలెక్షన్ జాబితా విడుదల చేయడం జరిగితే రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులకుఅనగాఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులకు నష్టం జరిగే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మెరిట్ లిస్ట్ ప్రకటించి అన్ని రిజర్వ్ కేటగిరీలకు కటాఫ్ మార్కులుతెలియజేసిన అనంతరం నియామకాలు చేపట్టేవారు. కాబట్టి ప్రస్తుతప్రభుత్వం గతంలోలాగా మెరిట్‌లిస్ట్ ప్రకటించిన తరువాతే నియామకాలు చేపట్టాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఉద్యోగం నుండి తొలగించే బిల్లు

ప్రభుత్వ ఉద్యోగులు ఐపిఎస్, ఐఎఎస్ నుండి అటెండర్ వరకూ అన్ని శాఖల అధికారులు లంచం తీసుకొని దొరికితే, ప్రభుత్వ ఉద్యోగులకు సస్పెండ్ కాకుండా ఉద్యోగం నుండి తొలగించే బిల్లునుతేవాలి. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలనుపేదప్రజలకు అందుతాయి. అప్పుడు ప్రభుత్వానికి ప్రజలకు నమ్మకం, గౌరవం ఉంటుంది. ప్రభుత్వానికి జవాబుదారీతనం నిలుస్తుంది. ఈ బిల్లు వాళ్ల ఎందరికో దక్కాల్సిన ప్రభుత్వ ఫలాలు, అన్యాక్రాంతం కాకుండా ఉంటుంది.

- సరాఫ్ ప్రభాకర్ చారి, మేడ్చల్

### ఢిల్లీ సిఎం మీద దాడి హేయం

ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకునేందుకు ప్రతీవారం నిర్వహిస్తున్న జన్ సున్‌వాయి కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి అమానుషం. ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే మామూలు వారి పరిస్థితి ఏమిటి అనే సందేహం కలుగుతుంది. మరో మారు ఇలాంటి ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### కుక్కల బెడద నుంచి రక్షణ కావాలి

మనుషుల్లో మానవత్వం కరవవుతున్నట్లే కుక్కల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. వీటి సంతానం దినాభివృద్ధి చెందుతోంది. ఏ వీధిలో చూసినా ఈ కుక్కలు వీరవిహారం చేస్తూ పాదచారులనుకరుస్తున్నాయి. రోజూ వందమందిని గాయపరుస్తున్నాయని ఓ దినపత్రికలో వచ్చిన వార్త. స్కూటర్లు మీదవెడుతున్న వారిని వెంబడించి మరీ కాటేస్తున్నాయి. కొందరు మహిళలు భయపడి కింద పడిపోతున్నారు. కాళ్ళు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈకుక్కలు పొరబాటున చిన్న కారుల కిందో, స్కూటర్ల కింద పడి కాలు విరిగో, చనిపోతేనో జంతు ప్రేమికుల సంఘాలు వెంటనే పోగయి విపరీతంగా గొడవలు సృష్టించి నానాయాగీ చేస్తూ వాటి వైద్యానికి డబ్బు ఇవ్వాలంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారు వచ్చివీధులలో సంచరించే కుక్కలను పట్టి ఎక్కడైనా వదలాలి. ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం

ప్రస్తుతం మొబైల్ వినియోగం అందరికీ తప్పనిసరి అయింది. ఈ స్థితిలో ఆన్లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా వివిధ మధ్యవర్తులను ఉపయోగించి జూదం ద్వారా సొమ్ము ఆర్జిస్తున్నారు. పోయినవాడు వాడి గతికి వ్యాపారం చేయించిన వాడు లాభాన్నే చూస్తాడు. కావున పార్లమెంట్‌లో దీనిపై చట్టం తేవడం అవసరమే. అమలు చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతతో అధికార యంత్రాగం కూడా పనిచేస్తే చాలా మంచిది. ముఖ్యంగా నిరుద్యోగులు, చెడు అలవాట్లకు బానిసైన వ్యక్తులు విముక్తి చెందుతారు. ఇప్పటికే విద్యార్థులను పరోక్షంగా వారి చదువులను భంగపరచి అనూహ్య పరిణామాలు వస్తున్నాయి. విజ్ఞులు ఈ విషయాన్ని వారి స్థాయిలో సహకరించి చట్టాన్ని అమలు చేయడం, సమాజ శ్రేయస్సు కోరడం తమ బాధ్యత.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రతీసోమవారం కలెక్టర్‌లు, ఎస్పీలు నిర్వహించే స్పందనకు వచ్చే సమస్యలను తక్షణం తక్కువ సమయంలో పరిష్కరించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలు వారివారి ఎన్నో సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందనకు వస్తూ ఉంటారు. స్పందనకు వచ్చే సమస్యలను పరిష్కరించేలా చర్య తీసుకోవాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమలు చేయలేని చట్టాలెందుకు?

**ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పరాయివాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరు విప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులను వదలి, ఇటు తమకు ఇష్టం లేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం, పూర్తి చేయడమే సామర్థ్యం. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల మీద చట్టాలు తెస్తున్నా, కఠిన శిక్షలు తప్పవని ప్రకటనలు, హెచ్చరికలు చేస్తున్నా అవి అమలు చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యం, అలక్ష్యం వంటి వాటితో ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఆట పాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన కోట్లాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర పాలకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి పకడ్బందీగా సరికొత్త చట్టాలు తీసుకువచ్చామని నేతలు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక మార్గంద్వారా ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా ఏళ్లతరబడి మగ్గుతున్న బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చినా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యల వైపు అడుగులు వేయలేకపోతున్నాయి. ఇది అధికారులకు అందరికి తెలిసిన సత్యమే అయినా ప్రభుత్వాన్ని నమ్మించేందుకు కాగితాల మీద ఏవేవో రాసుకొని కాలం గడుపుతున్నారు. అందుకే చట్టాలు, శిక్షలు కాగితాలకే పరిమితం కావడంతో ఈవ్యవస్థ నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. స్వాతంత్ర్యం వచ్చిన పుటి నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ వరకు అటు రాష్ట్రపతులందరితోపాటు ఎందరో దేశాధినేతలు బాలలపట్ల అత్యంత ప్రేమాదరణలు చూపిన వారే. ఈ బాలలే భావిభారత పౌరులని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశించిన వారే. ఆ దిశలో ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. రాజ్యాంగంలోని 24వ అధికరణం బాల కార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. వయసుకు మించిన పనుల్లో పిల్లలను వ్యక్తులు కానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంలోని 39(ఇ) అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టుకోకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించిన భారం అప్పగించకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. మరొకపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమలు, గనుల వంటి ప్రదేశాల్లో బాలలను నియమించరాదని మరో చట్టాన్ని తీసుకువచ్చారు. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాల వల్ల అంతగా ఫలితం లేకపోవడంతో బాల కార్మిక వ్యవస్థలో మార్పులు లేకపోగా మరింత పెరుగుతుండడంతో 1979లో గురుపాద స్వామి కమిటీని కేంద్రప్రభుత్వం నియమించింది. ఆ కమిటీ అధ్యయనం అనంతరం చేసిన సిఫార్సుల ఆధారంగా 1986లో బాలకార్మిక వ్యవస్థ నిషేధ నియంత్రణ చట్టం తీసుకువచ్చారు. ప్రమాదకర వృత్తుల్లో పనిచేసేవారికి పునరావాసంపై దృష్టిసారించేందుకు 1947లో జాతీయ విధానాన్ని రూపొందించారు. 1988 నుంచి కార్మిక ఉపాధికల్పన మంత్రిత్వశాఖ బాల కార్మికుల పునరావాసానికి పెద్ద సంఖ్యలో పథకాలను అమలు చేసింది. అయినా ఆశించిన ఫలితాలు చేకూరలేదు. 1994లో ఈ విషయంలో ఆందోళన చెందిన కేంద్ర ప్రభుత్వం అప్పటి ప్రధాని పి.వి

## ఒక్క మాట

నర్సింహారావు పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. 2000 సంవత్సరం నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ప్రకటించారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మికుల సంఖ్యను చూసి ఆందోళన చెందిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉన్న చట్టాలతో బాలకార్మిక నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడం సాధ్యంకాదని భావించి మరో కొత్తచట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఇళ్లల్లో పనిచేస్తున్న లక్షలాది మంది బాలకార్మికుల భవిష్యత్‌కు భరోసా కల్పించి వారికి అక్షరాలు నేర్పించి చైతన్యవంతులను చేయాలని నడుం బిగించింది. ఆ చట్టప్రకారమే ఇళ్లల్లోనూ, హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, తదితర చోట్ల పనిచేసే బాల కార్మికులకు విముక్తి కల్పించి ప్రత్యామ్నాయం చూపాలని నిర్దేశించారు. ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బాలలను పనిలో నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జరిమానాలతోపాటు జైలుశిక్షలు కూడా విధించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఈ హడావుడి హంగామా చూసి కొంతలో కొంత మార్పు వస్తుందని ఆశించారు. క్షేత్రస్థాయి విషయాలపై ఎయిర్‌కండిషన్ గదుల్లో ఉంటే అధికారులకు తెలియకపోవడం, అవసరమైన సిబ్బంది లేకపోవడంతో ఆశించిన ఫలితాలు చేకూరలేదు. ఇళ్లల్లో, హోటళ్లలో, రెస్టారెంట్లలో ఇటుక బట్టీల్లో తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను కొందరిని బయటకు తీసుకువచ్చారు. వారికి విముక్తి కల్పిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. అంతవరకు బాగానేఉంది. కానీ వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా లక్షలసంఖ్యలో బాలకార్మికులు ఉంటే వేల మందిని బయటకు తీసుకువచ్చారు. వందల సంఖ్యలో మాత్రమే పునరావాసం కల్పించారు. ఆ వందల సంఖ్యలో ఉన్న పిల్లలు కూడా పునరావాసం సంతృప్తికరంగా లేకపోవడంతో తిరిగి పాత బాటే మేలని భావించి అందులోకే వెళ్లిపోయారు. పిల్లల పునరావాసం కోసం రెసిడెన్షియల్, బ్రిడ్జ్ సెంటర్లు ఎంతో విజయవంతంగా పనిచేశాయని రికార్డుల్లో రాసుకున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వం కల్పించే పునరావాసం కార్యక్రమాల మీద నమ్మకం లేకుండాపోయింది. ఇటు చదువు రాక, అటు పనిరాక రెంటికిచెడ్డ రేవడిలా తయారై మరోమార్గంలో పయనిస్తారన్న భయంలో పాత బాటే పట్టించారు. ఇక ప్రభుత్వపాఠశాలల్లో చేర్చే ఈ బాలల పరిస్థితి మరోరకంగా మారింది. పన్నెండు, పదమూడేళ్ల వయసున్న పిల్లలను ఒకటో, రెండో తరగతిలోనో నాలుగైదేళ్ల వయసు ఉన్న పిల్లలతో కలిపి కూర్చోబెడితే ఏమవుతుందో పెద్దలు ఆలోచించకపోవడం దురదృష్టకరం. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా తొమ్మిది, పదేళ్ల తేడా ఉన్న పిల్లలతో కలిసి చదువుకోడానికి వారు నమూషిగా భావించారు. ఫలితంగా ఏదో కొన్ని రోజులుపాటు పాఠశాలలకు వెళ్లినా ఆ తర్వాత స్వస్తి చెప్పి పాతబాటే పట్టారు. వారికి భవిష్యత్ గురించి వివరించి, కౌన్సిలింగ్ సమర్థవంతంగా, సక్రమంగా చేయలేకపోవడం కూడా పెద్ద లోపంగా చెప్పొచ్చు. అందుకే బాలకార్మికులను కూపం నుంచి బయటకు తెచ్చి పునరావాసం కల్పించామని చేసినప్రకటనలు ప్రచారార్భాటాలుగానే మిగిలిపోయాయి. బ్రిడ్జ్ సెంటర్లు, పాఠశాలల్లో చేర్పించామని చెప్పుకున్నపిల్లల్లో అధికశాతం పాతపనుల్లోకే వెళ్లిపోయారు. ఇప్పటికైనానేతలు వాస్తవాలు గ్రహించాలి. చట్టాలు తెస్తే సరిపోదు. చట్టాలు ఎన్ని తెచ్చినా ఒరిగే ప్రయోజనం ఉండదు. వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసే సిబ్బంది కావాలి. దీనికితోడు లేత వయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్ల ముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతారో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టినకన్నబిడ్డలను పరాయివాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయంకూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరువిప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులను వదిలి, ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే.

# చందమామ అందిన పండుగ రోజు..

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆగస్టు 23, 2025 రోజున భారతదేశవ్యాప్తంగా 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవం, లేదా 'నేషనల్ స్పేస్ డే' వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న శుభ సందర్భంగా భారతీయులు అందరూ, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు, యువతరం భావించాలి. 23 ఆగస్టు 2023 రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో చేపట్టిన చంద్రయాన్3 ప్రయోగం విజయవంతమైన రోజుగా భారత అంతరిక్ష చరిత్రలో లిఖించబడింది. ఆ రోజున విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా, సాఫ్ట్ ల్యాండింగ్ కావడం జరిగింది. అంతేకాకుండా ప్రపంచంలోనే తొలిసారి చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ కావడం ఒక విశేషంగా చెప్పబడింది. చంద్రమండల దక్షిణ ధ్రువం ప్రాంతంలో ల్యాండ్ అయిన ప్రదేశాన్ని 'శివశక్తి పాయింట్'గా కూడా నామకరణం చేయడం జరిగింది. ఈ విధంగా విజయవంతంగా చంద్రమండలంపైల్యాండ్ అయిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా 23 ఆగస్టున దేశ వ్యాప్తంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముదావహం. జాతీయ అంతరిక్ష దినోత్సవ వేదికగా ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం, భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధునిక మార్పులను ఎక్కుపెట్టడం, నేటి యువతరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్షరంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను స్టెమ్ కోర్సుల వైపు ఆకర్షించడానికి 'స్పేస్ ఆన్ వీల్స్' 'స్పేస్ ట్యూటర్స్'లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చి తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి. 'పురాతన పరిజ్ఞానం నుంచి అనంత అవకాశాలు' అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రంపట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవసరంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్లానిటోరియం సందర్శనం, శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటి వన్నీ ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి. భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్, వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్‌ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు, దేశ ఆర్థికాభివృద్ధి, స్మార్ట్‌ఫోన్, ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలు మరిచిపోలేనివి.

# ఆదివాసుల్లోకి అన్య సంస్కృతుల ప్రమాదం!



గుమ్మడి లక్ష్మీనారాయణ

'ఆదివాసీలు హిందువులే' అంటూ ఇటీవల కొందరు వ్యాసకర్తలు రాస్తున్నారు. ఆదివాసులు హిందువులే అనే కంటే హిందు మతాన్ని 'అనుసరించే వాళ్లు' మాత్రమే అంటే బాగుంటుంది. సాధారణంగా హిందూ మత పండుగలను, ఆచార వ్యవహారాలను నవీన కాలంలో కొన్ని తెగల ఆదివాసీలు పాటిస్తున్నారు. కానీ హిందూ ఆచారాలు, అనేక దేవుళ్ల పుట్టుక చరిత్ర వెనుక ఆదివాసీల చారిత్రక నేపథ్యం దాగున్నదని మరచిపోతున్నారు మేధావులు. పురానేతిహాసాల్లో, వేదాలలో భక్త కన్నప్ప, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, శబరి తదితరులు గిరిజన ఆదివాసీలు కాదా? ఆదివాసులను మతపర ఉచ్చులోకి లాగడానికి ఒక అసంబద్ధ ప్రయత్నం జరుగుతోంది! ఆదిమానవులైన ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయ, ఆచారాలే క్రమంగా హిందూ మతాచారాలుగా మారాయి. కాబట్టి ఈ మూలవాసులది పురాతన 'ఆదివాసీ మతం' అనటం సమంజసంగా ఉంటుంది. విలక్షణమైన జీవితం ఆదివాసులది. వీరు ఆదిమ కాలం నుంచి ఆచార సంస్కృతులకు చిరునామాదారులు. మూలవాసీ సంస్కృతి ఆచారాలను తప్పక పాటిస్తారు. నేడు కాలానుగుణంగా వస్తున్న ఆధునిక మార్పుల్లో భాగస్వాములు అవుతున్నారు. ఆధ్యాత్మికత, భక్తి భావానికి గల భేదాలు తెలియని ఈ గిరిజనులకు తెలిసిందల్లా నమ్మకంతో ముడిపడ్డ భక్తి మాత్రమే. దానినే ఆచరిస్తారు. వారికి ఉన్నది సాధారణ పరిజ్ఞానం మాత్రమే. మౌఖిక సాహిత్యం వల్ల, ఆధ్యాత్మిక చింతనలు, పునర్జన్మలు, ముక్తి మార్గాలు వారికి తెలియవు. బ్రతికినన్ని రోజులుఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా జీవించటం మాత్రమే వారికి అవసరం. వారికి గల నిండైన కృతజ్ఞత, విశ్వాసాల సాక్షిగా నిరాకారులైన వారివారి కుల, గ్రామ దేవర్లనే పూజిస్తారు. వారి ఇలవేల్పులైన నాగోబా, జంగుబాయి, పెర్స పేన్, మేడారం సమ్మక్క, సారక్క, గుంజేడు ముసలమ్మ, కొమ్మలమ్మ, సడలమ్మ, గట్టమ్మ, దూలరాజు, మారయ్య వంటి దైవాలను గౌరవించుకుంటారు. మొక్కులు చెల్లించుకుని జీవిస్తుంటారు. వారికి వ్రతాలు, నోములు, పూజలు, మంత్రాలు, హోమాలు తదితర వాటితో సంబంధం లేదు. వాటిని ఆచరించి అంతులేని పుణ్యం, సంపదలు రావాలని వారు కోరుకోరు. వాటి అవసరం కూడా వారికి లేదు. కేవలం వారి పూర్వాచారాలే వారసత్వంగా అమలవుతున్నవి. అనారోగ్యం పాలైతే తెలిసిన మూలికా వైద్యం చేసుకుంటారు. మనోధైర్యం కోసం వారాంతపు దేవర్ల దగ్గరకు వెళ్లి పూనకం దేవర్లు చెప్పే ధైర్యపు మాటలు వింటారు. దీనితో మనోధైర్యం పెంచుకొని జబ్బుల బారి నుండి బయటపడుతుంటారు. పంటలు బాగా పండాలని కోరుకుంటారు. పంటలు బాగా పండాలని దేవర్లకు మొక్కుకుంటారు.



కృతజ్ఞతతో వారికి ధాన్యం, ఇప్పసారా, మాంసాహారం వంటి వాటిని ప్రసాదంగా సమర్పించుకుంటారు. ఒకరకంగా గిరిజనుల భక్తి భావనలో కేవలం నమ్మకం, కృతజ్ఞతలు తప్ప ప్రతిఫలాపేక్ష ఏ మాత్రం ఉండదు. ఇది ఒకనాటి గిరిజనుల భక్తి భావనల తీరు. అయితే, నేటి ఆధునికకాలంలోవస్తున్న మార్పుల్లో భాగంగా వీరి భక్తి విధానాలలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయులు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. మాల ధారణలు, దీక్షలు మొదలు పెట్టారు. మొదట జంగుబాయి, సమ్మక్క సారక్క మాలధారణ దీక్షలకే పరిమితమయ్యేవారు. వీరు, గిరిజనేతరులతో కూడా కలిసి విడివిడిగా భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే, ఇటీవల గిరిజన గ్రామాల్లో విరివిగా గణేష్ మండపాలు వెలిశాయి. గ్రామస్తులంతా చందాలు వేసుకుని పూర్తి ఆధునిక పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రులు మొత్తం పూజలు చేసే ఆర్థిక స్తోమత లేక మూడు లేదా ఐదు రాత్రులతో ముగించి నిమజ్జనం చేస్తున్నారు. అనంతరం సామూహిక అన్నదానంలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, నిమజ్జనం, శోభాయాత్రల్లో మాత్రం తమదైన డోలు వాయిద్యం, గిరిజన నృత్యాలతో సాంప్రదాయపు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. దీనితో తమ గిరిజన సంస్కృతిని చాటుకోవడం విశేషం. ఇదే క్రమంలో సంక్రాంతి నాడు శ్రీరామభజన చేస్తూ గిరిజనగ్రామాల్లో పల్లకి సేవలు నిర్వహిస్తు న్నారు. సమీప ప్రాంతాల్లో జరిగే శివరాత్రి నాటి శివకళ్యాణం, హోలీకి, శ్రీరామ నవమి నాటి సీతారామ కళ్యాణం జరుపుకుంటున్నారు. నృసింహ జయంతికి జరిపే నరసింహ కళ్యాణం జరుపుకుంటున్నారు. భద్రాచలంలోని రామాలయంలో శబరి స్మృతియాత్ర వంటివివిధ తీర్థాలకు గిరిజనులు అధిక సంఖ్యలో వెళుతున్నారు. ఈ మధ్యన భగవద్గీత త్రైత కమిటీ ద్వారా కృష్ణుని పల్లకి సేవ, జయంతి పూజలు చేశారు. కాని వీటి వెనుక మనువాదం మిళితం అయిందని ఆలోచించడం లేదు. కానీ, తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని గ్రహించాలి. గిరిజనుల్లో అధికంగా సామూహిక కార్యక్రమాలు, ప్రయాణాలు ఉంటాయి. మద్యపాన వ్యసనం నుండి దూరం కావడం కోసం ఈకార్యక్రమాలు చేస్తుంటారు. సాధారణ ఆరోగ్యం కోసం, గిరిజన యువత అధికంగా మాలధారణ దీక్షలు చేపడుతున్నారు. వారిదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన కొత్తలపండుగ, విత్తనాల పండుగ, వివిధ తెగల, గోత్రాలకు నిర్దేశించిన ఇలవేల్పు పండుగలను మర్చిపోతున్నారు. గ్రామపండుగలైన ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తదితర పండుగలకు, జాతర్లకు కూడా దూరమవుతున్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో అక్షరాస్యులు, ఉద్యోగులైన గిరిజనయువత ఏర్పాటు చేసుకున్న తుడుందెబ్బ, సంక్షేమ పరిషత్, ఆదివాసీ సేన తదితర గిరిజన సంఘాలు ఆధునిక భక్తి భావాలపట్ల వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. తమదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన దేవర్లను, ఇలవేల్పులను, ఆదివాసీ వీరులను మాత్రమే పూజించుకునే ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చైతన్యం దిశగా గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు పునుకోవాలి. అక్షరాస్యతద్వారా గిరిజనుల్లో వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పుల వల్ల, జీవన విధానంలో చక్కటి మార్పువచ్చింది. అది ఆనందదాయకమే. నేటి గిరిజన యువతలోని అక్షరాస్యత కేవలం ఉద్యోగాల కోసం, ఆర్థికవృద్ధి కోసం మాత్రమే కాదు. తమ దైన సంస్కృతులను, సాంప్రదాయాలను, తమ అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలి.



# శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు

## ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఆరోపణలు

### సిఐడి అదుపులో మాజీ అధ్యక్షుడు

**కొలంబో, ఆగస్టు 22:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు ధ్రువీకరించినట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ పేర్కొంది. ప్రస్తుతం విక్రమసింఘే కొలంబో సిఐడి ఆధీనంలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయనకు సమన్లు అందజేసి విచారణ కూడా చేపట్టారు. 2023 సెప్టెంబరులో విక్రమసింఘే లండన్‌లో పర్యటించారు. తన భార్యతో కలిసి ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆ విస్తృత విదేశీ పర్యటన అధికారంగా చేపట్టింది కాదని తర్వాత ప్రకటించారు. కానీ, దానికి ప్రభుత్వ నిధులను వినియోగించారు.

హవానాలో జి-77 సద స్సులో హాజరై తిరిగి వస్తూ లండన్‌కు వెళ్లిన ప్పుడు తన భార్య ఖర్చులను ఆమే పెట్టు కుందని ప్రభుత్వ నిధులను వినియోగించలేదని విక్రమసింఘే వాదిస్తున్నారు. కానీ, సిఐడి మాత్రం ఆ పర్యటనలో ప్రభుత్వ సొమ్మునే వాడారని.. దీంతోపాటు ఆయన అంగరక్షకులకు కూడా చెల్లింపులు చేశారని చెబుతోంది. ఇక ఆయనను ఫైనాన్షియల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ విచారించి కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చింది.

రణిల్ విక్రమసింఘే 2022లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు పదవిలో ఉన్న గొటబయ రాజపక్సె వైదొలగడంతో ఈ బాధ్యతలను స్వీకరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించారన్న పేరును ఆయన సంపాదించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.



# దారికి రాకుంటే.. నరకమే..

## హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

**టెల్‌అవీవ్, ఆగస్టు 22:** హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. హమాస్ మా దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరకదారులు తెరుచుకుంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వ్యాఖ్యానించారు. వెంటనే తమ బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'హమాస్ ఆయుధాలు వదిలిపెట్టి, బందీలందర్నీ విడుదల చేసి,యుద్ధం ముగించేందుకు షరతులు అంగీకరించాలి. లేదంటే త్వరలోనే వారికి నరకానికి ద్వారాలు తెరుచుకుంటాయి' అని ఇజ్రాయెల్ మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అంగీరించకుంటే గాజా నగరం మరో రఫా, బీట్ హనౌన్‌గా మారిపోతుందని హెచ్చరించారు. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం తెలిపిన ప్రధాని నెతన్యాహు ఇందుకోసం మరో ఆపరేషన్ చేపడతామన్నారు. హమాస్‌ను అంతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన యుద్ధం ముగించి, బందీలవిడుదల కోసం చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రక్షణమంత్రి మరోసారి స్పందించారు. మరోవైపు గాజాపై మరో దశ దాడులు చేస్తామని చెబుతోన్న ఇజ్రాయెల్.. రానున్న రోజుల్లో 60 వేలమంది రిజర్విస్టులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2లక్షలకు చేరుకుంటుందని అంచనా.

# పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం

## గోడదూకి లోపలికి ఆగంతకుడు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ ప్రాంతంలో ఒక చొరబాటుదారుడు చెట్టు ఎక్కి గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనానికి చెందిన గరుడ గేట్ వద్దకు చేరుకున్నాడని అధికారులు తెలిపారు. ఆ చొరబాటుదారుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 2023లో



పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన 22 ఏళ్లు అయిన డిసెంబర్ 13న ఆ ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదే రకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులో కూడా ఈ తరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు ఆ నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. తాజా ఘటనలో పేర్కొన్న నిందితుడిది ఉత్తరప్రదేశ్. అతడి పేరు రామా అని అధికారులు వెల్లడించారు. 20 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అతడు ఏ ఉద్దేశంతో ఇలాంటి చర్యకు పాల్పడ్డాడో తెలుసుకునేందుకు ఐబి, ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అతడిని ప్రశ్నిస్తోంది.




## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా

# ఎథెల్ కాటర్‌హామ్ రికార్డు

**లండన్, ఆగస్టు 22 :** ఎథెల్ కాటర్‌హామ్.. ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఖ్యాతి గాంచారు. ఆమె తన 116వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. గురువారం అంటే ఈ నెల 21వ తేదీ సర్రేలో లైట్‌వాటర్‌లోని సంరక్షణ కేంద్రంలో ఆమె ఈ వేడుకలు చేసుకున్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి ఆమె చాలా సాదాసీదాగా ఈ జన్మదినాన్ని జరుపుకున్నాని హాల్‌మార్క్ కేర్ హోమ్స్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎథెల్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దీంతో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఎథెల్ కుటుంబసభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే ఏ యేడాది జన్మదినం సందర్భంగా ఎథెల్ కేటర్ హామ్ ఎవరికి ఎటువంటి ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. అయితే కింగ్ చార్లెస్-3 ఆమెతో మాట్లాడటానికి సిద్ధంగా ఉంటే అంగీకరిస్తామని సంరక్షణ కేంద్రం వివరించింది. ఇక దేశంలో 100వ జన్మదిన వేడుకలు జరుపుకొనే పౌరులను అభినందిస్తూ.. వ్యక్తిగతంగా బ్రిటన్ చక్రవర్తి లేఖ రాసారు. ఆ క్రమంలో ఎథెల్ కాటర్‌హామ్‌కు గతేడాది 115వ పుట్టినరోజు సమయంలో కింగ్ చార్లెస్-3 లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

1909, ఆగస్టు 21వ తేదీన ఎథెల్ కాటర్‌హామ్ జన్మించారు. అంటే టైటానిక్ విపత్తుకు సరిగ్గా మూడేళ్ల ముందు ఆమె జన్మించారు. ఆమె.. తన 18వ ఏటా భారత్‌కు వచ్చారు. భారత్‌లో ఒక సైనిక కుటుంబానికి సహాయకురాలిగా విధులు నిర్వహించేందుకు ఆమె ఈ దేశానికి వచ్చారు. కొద్దిరోజుల తర్వాత ఆమె స్వదేశానికి పయనమయ్యారు. ఆ కొద్దిరోజులకే ఆమె ఒక పార్టీకి వెళ్లారు. ఆ పార్టీలో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు పరిచయం అయింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో 1933లో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు వివాహం జరిగింది. తర్వాత ఆ జంట హాంకాంగ్‌కు తరలివెళ్లింది. ఆ తర్వాత జిబ్రాల్టర్‌కు మకాం మార్చింది. చివరకు దక్షిణ ఇంగ్లాండ్‌లో స్థిరపడింది. అయితే 1976లో భర్త నార్మన్ కాటర్‌హామ్ మరణించారు. ఇక ఎథెల్ కాటర్‌హామ్‌కు ముగ్గురు మనవళ్లతోపాటు ఐదుగురు మునిమనవళ్లు ఉన్నారు.

ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు ఇనా కాన్‌బారో లూకాస్. ఆమె వయసు 116 సంవత్సరాలు. నన్‌గా పనిచేసే ఆమె 116వ యేట మరణించింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఎథెల్ కాటర్‌హామ్ ఖ్యాతి పొందారు.



# దేశీయ విమాన ప్రయాణం ఫ్రీ

## విదేశీ పర్యాటకులకు థాయ్ బంపర్ ఆఫర్

**బ్యాంకాక్, ఆగస్టు 22:** భారతీయులతో సహా విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలోని పర్యాటక ప్రదేశాలు ఆదరణ పొందేందుకు కొత్త ట్రావెల్ స్కీమ్ ప్రవేశపెట్టనుంది. దీని కింద దేశీయ విమాన ప్రయాణాన్ని ఫ్రీగా కల్పించనుంది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్, బ్యాంకాక్ వంటి ప్రదేశాలకు మాత్రమే విదేశీ పర్యాటకులు ఎక్కువగా వెళ్తున్నారని గ్రహించిన ప్రభుత్వం.. వారు మిగిలిన ప్రదేశాలను కూడా చూసేలా తమ దేశంలో విమాన ప్రయాణం ఉచితం చేయాలని చూస్తోంది. 'బై ఇంటర్నేషనల్, ఫ్రీ థాయ్‌లాండ్ డొమెస్టిక్ ఫ్లైట్స్' పేరిట ఆ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ప్లాన్ కింద దేశీయ విమానాల్లో ప్రయాణించే వారికి వన్‌వే టికెట్ ధర 1,750 బాత్, రౌండ్ ట్రిప్స్ అయితే 3,500 బాత్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని యోచిస్తోంది. ఈ యేడాది ఆగస్టు నుంచి డిసెంబరు మధ్యలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉండొచ్చని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

థాయ్‌లాండ్‌కు స్టాండర్డ్ ఇంటర్నేషనల్ టికెట్స్ తీసుకున్న ప్రయాణికులు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్స్, మల్టీసిటీ ఆప్షన్స్, ఫ్లైత్రూ సర్వీసెస్, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్స్ వద్ద ఈ ఆఫర్‌ను పొందొచ్చు. ప్రతి ప్రయాణికుడు రెండు దేశీయ విమాన టికెట్లు పొందడానికి వీలుంటుంది. 20 కిలోల బ్యాగేజీని అనుమతిస్తారు. ఈ ప్రాజెక్టు కింద రెండు లక్షల మంది అంతర్జాతీయ పర్యాటకులను రప్పించాలన్నదే థాయ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల అన్ని రకాలుగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు 21.80 బిలియన్ బాత్ మేర ప్రయోజనం కలగనుందని అంచనా. అందుకోసం ఆ దేశ టూరిజం అథారిటీ.. ఆరు దేశీయ విమానయాన సంస్థలతో పనిచేయనుంది.

# కర్ణాటక డి.సిఎం ఆరెస్సెస్ గీతాలాపన



## చర్చనీయాంశంగా మారిన డికె తీరు

### అసెంబ్లీలోనే ఆలపించడంపై రాజయకీయ వర్గాల్లో ఊహాగానాలు

**బెంగళూరు, ఆగస్టు 22:** కర్ణాటకలో సిఎం మార్పు అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. అయిదేళ్లు తానే ముఖ్యమంత్రినని ఓ వైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నా అటు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తన చేతుల్లో ఏమీలేదంటూనే ఆశ పడటంలో తప్పు లేదు కదా అనే సంకేతాలిస్తున్నారు. ఈ పరి ణామాల నేపథ్యంలో తాజాగా డికె వ్యవహ రించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ ఆరెస్సెస్‌తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన నమస్తే సదా వత్సలేను ఆయన పాడడంతో బిజెపి నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ బల్లలపై చప్పట్లు చరుస్తూ నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట చర్చ మొదలైంది. తనకు సిఎం పీఠం ఇవ్వకపోతే బిజెపిలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈ విధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో మోడీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డికె శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలు వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సిఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. అయితే సిఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తానని పలుమార్పు బహిరంగంగానే చెప్పిన డికె, తన వ్యాఖ్యల వల్ల ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు.



## బెంగాల్ జైళ్లలో ఎఐ

# కరడుగట్టిన ఖైదీలపై నిఘా

**కోల్‌కతా, ఆగస్టు 22:** జైళ్లలో నేరుగా కదలికలను ఎప్పటికప్పుడు గమనించడానికి బెంగాల్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంది. నేరగాళ్లపై నిఘా కోసం ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి ప్రణాళికలు వేయడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్లాన్ చేస్తుండటంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు. అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించి, అడ్డుకునేందుకు వీలుగా ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 60 పరివర్తన కేంద్రాల్లో ఇప్పటికే అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకుంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. అందువల్లే వాటిని ఎఐతో అనుసంధానిస్తున్నామన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటి వాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ఇందులో ఉన్న ముఖ గుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. ముఖ్యమైన కేసుల్లో అరెస్టయిన కరడుగట్టిన నేరగాళ్ల ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ఎఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, పదునైన ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు.

ఈ ఎ1- ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను కూడా అంచనా వేయగలవన్నారు. దీనివల్ల అధికారులు ముందుగానే జోక్యం చేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు.

## సంక్షిప్తంగా..



### గాజా సిటీలో తీవ్ర క్షామం

#### ధ్రువీకరించిన ఐరాస నివేదిక

**జెరూసలేం, ఆగస్టు 22:** ఇజ్రాయిల్, హమాస్ మధ్య సాగుతున్న పోరుతో గాజా సిటీలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సిటీలో ఆర్తనాదాలు వినిపిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితికి చెందిన శాఖ ధ్రువీకరించింది. ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూర్టీ ఫేస్ క్లారిఫికేషన్(ఐపిసి) తొలిసారి తన వార్నింగ్‌ను అయిదో దశకు చేర్చింది. ఆ వార్నింగ్ స్థాయి బట్టి గాజాలో తీవ్ర దుర్భిక్షం ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. గాజాలోని గాజా సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ఆ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఈనెలాఖరులోగా డెయిర్ అల్ బాలాహ్, ఖాన్ యూనిస్‌కు కూడా చేరనున్నట్లు తెలుస్తోంది. గాజా స్ట్రిప్‌లో ఉన్న సుమారు అయిదు లక్షల మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. ఆకలి చావులను అడ్డుకోవాలంటే నిరవధిక సాయం అందాలన్నాయి.

### కొలంబియాలో పోలీసు హెడ్‌క్వార్టర్‌పై దాడి: 17 మంది మృతి


**బొగోటా, ఆగస్టు 22:** కొలంబియా దేశంలో ఒకేరోజు రెండు భయానక ఘటనలు చోటు చేసుకున్నాయి. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) రెండు వేర్వేరు ఉగ్రదాడులు జరగడంతో 17 మంది మరణించారు. అంతియోక్వియా ప్రాంతంలో కొకైన్ ఉత్పత్తికి ఉపయోగించే కోకా మొక్కల సాగును తొలగించే కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఈ హెలికాప్టర్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌తో మొదటి దాడికి పాల్పడ్డారు. ఈ దాడి కారణంగా హెలికాప్టర్‌లో భారీగా మంటలు చెలరేగేలా చేసింది. ఇక ఘటనలో 12 మంది పోలీసు అధికారులు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని





అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ దాడి ఇటీవల జరిగిన కొకైన్ పట్టి వేతకు ప్రతీకార చర్యగా జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో దాడి కాలి నగరంలో మిలిటరీ ఏవియేషన్ స్కూల్ సమీపంలో జరిగింది. కారుబాంబు పేలడంతో ఐదుగురు మరణించగా, 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ రెండుఘటనలకు కారణంగా దేశవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### సుదర్శన్ నక్సల్స్ మద్దతుదారుడు: అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకోసం ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తున్నది. అధికార, విపక్ష పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి, నామినేషన్ కూడా వేయించాయి. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు హీటెక్కుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిగురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతుగా తీర్పులు ఇచ్చారనిఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. సుదర్శన్ రెడ్డి సల్వా జుడుం తీర్పు వెలువరించకపోతే, దేశంలో తీవ్రవాద వామపక్ష ఉద్యమం 2020కి ముందే ముగిసి ఉండేదని అన్నారు.

### ప్యాసింజర్ రైళ్ల నంబర్ల మార్పు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్యాసింజర్ రైళ్ల విషయంలో అధికారులు కీలక మార్పులు చేశారు. ప్రయాణికులు ఈ కొత్త మార్పులను గమనించాలని రైల్వే శాఖ సూచించింది. కాచిగూడ స్టేషన్ నుంచి వెళ్లే ప్యాసింజర్ రైలు (57601/57602) నంబర్లను 67785/ 67786గా మార్చినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

అదేవిధంగా, కాచిగూడరాయచూర్ మధ్య సేవలందించే ప్యాసింజర్ రైలు (77647/77648) నంబర్‌ను 67787/67788గా మార్చారు. ఈ మార్పు ఆగస్టు 26 నుంచి వర్తిస్తుంది.

నంబర్ల మార్పుతో పాటు, కోచ్‌లలో కూడా కీలక మార్పులు చేస్తున్నారు. కాచిగూడ రైలులో ప్రస్తుతం ఉన్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక మెమూ రేక్‌ను, అలాగే కాచిగూడ -రాయచూర్ మార్గంలో డెమో స్థానంలో కూడా మెమూ రేక్‌ను వినియోగిం చనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

# మీరు చోద్యం చూస్తున్నారా?

## ఆధార్‌కార్డును గుర్తింపుగా అంగీకరించాల్సిందే..

### 'బీహార్ ఓట్ల తొలగింపు'లో పార్టీల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓటర్ల జాబితా సవరణ తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. బీహార్ ఎన్నికలకు ముందు సుమారు 65 లక్షల మంది ఓట్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారంటూ వస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా రాజకీయంగా తీవ్ర సంచలనంగా మారాయి. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఓట్ల తొలగింపుపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చేందుకు.. అవసరమైన ధ్రువపత్రాల జాబితాలో ఆధార్ కార్డు ను కూడా చేర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ కోసం సమర్పించాల్సిన 11 ధ్రువపత్రాల్లో ఆధార్ కార్డు కూడా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఈసీకి సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ ఓట్లను జాబితా నుంచి తొలగించారని లక్షలాది ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికోసం ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. జాబితా నుంచి పేర్లు తొలగించిన వారు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కూడా సమర్పించవచ్చని సూచించింది. వారు సమర్పించిన ఆధార్ కార్డులను ఎన్నికల సంఘం తప్పకుండా ఆమోదించాలని తేల్చి చెప్పింది.

**రాజకీయ పార్టీలపై సుప్రీంకోర్టు అసంతృప్తి:** బీహార్‌లో ఓటర్ల జాబితాలో లక్షల మంది ఓట్లు తొలగించారంటూ దేశంలోని చాలా రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఓట్ల తొలగింపులపై ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలుపుతున్నప్పటికీ.. తొలగించబడిన ఓటర్లకు సహాయం చేయడంలో మాత్రం రాజకీయ పార్టీలు సరైన రీతిలో పని చేయడం లేదని సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మీకు ఓటు హక్కు లేదా.. 15 రోజుల్లోనే ఓటర్ ఐడీ కార్డులు, అప్లికేషన్ స్టేటస్ ఇలా తెలుసుకోండి!

రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజకీయ పార్టీలు తమ పనిని తాము సరిగా నిర్వహించడం లేదని మండిపడింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడిన వారికి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా సహాయం చేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమ ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నారని పార్టీలు ఆరోపిస్తున్నప్పటికీ.. తమ ఏజెంట్ల ద్వారా అభ్యంతరాలను సమర్పించడం లేదని.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రమే ముందుకు వచ్చినట్లు కోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మరింత పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అర్హులైన వారు తమ పేర్లను మళ్లీ ఓట్ల కోసం నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

# స్థానిక ఎన్నికలకు ముందే పదవులు పంచాలి

### నేడు పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశం



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో బిసి రిజర్వేషన్, పదవులు పంపిణీ వంటి అంశాలు ఉత్కంఠ రేపుతోంది. హైదరా బాద్ గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం ఎఐసిసి వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రు లు, కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తదుపరి కార్యాచరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్ళాలి అని ప్రభుత్వం చూస్తుండగా అది రాష్ట్రపతి వద్ద పెండిం గ్‌లో ఉంది. మరోవైపు గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ కూడా న్యాయ సలహా కోసం పంపడంతో అది కూడా పెండింగ్‌లోనే ఉంది. కాగా స్థానిక ఎన్ని కలపై హైకోర్టు ఇచ్చిన గడువు సెప్టెంబరు 30 సమీపి స్తుండగా.. ఎన్నికలపై ఏం చేయాలా అని ప్రభుత్వం ఆలోచనలో పడింది. రిజర్వేషన్ల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేపట్టాలా వద్దా? ఒక వేళ ఎన్నికలకు వెళ్లాలనే భావి స్తే రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వాలా లేదా మరేదైనా మార్గం చూడాలా అనే విషయంలో పార్టీలోని మెజార్టీ నేతల అభిప్రాయం మేరకు నిర్ణయించ బోతున్నారు. దీంతో శుక్రవారం సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

అయితే పిఎసి సమావేశం ముగిశాక ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగబోతు న్నది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు, రిజర్వేషన్ల విషయంలో అధికార పక్షం తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌పై యాదవ సామాజికవర్గ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమకు పదవుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, 5 కార్పొరేషన్ చైర్మన్లు, 5 డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వా లని డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైన్ షాపులలో ఎస్సీ, ఎస్టీ, గౌడ్స్‌తోపాటు బీసీలకు 30 శాతం రిజర్వే షన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పాత పెన్షన్ సాధించే దాకా పోరాడుదాం

### ఉపాధ్యాయులతో టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పాతపెన్షన్ విధానం సాధించే వరకు పోరాడుదామని నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులతో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి.. పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు జరిగే పోరాటంలో ప్రతీ ఉపాధ్యాయుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూటీఎస్ నేతృత్వంలో పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాల్లోని టీచర్లకు ఫోన్ చేసి ఆయన నేరుగా మహాధర్నా ఆవశ్యకతను వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడిని పాత పెన్షన్ కోసం చేపట్టే ఆందోళన వైపు నడిపించాలని సూచించారు. సిపిఎస్ రద్దు కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, ఈసారి తమ గళాన్ని గట్టిగా విన్పించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. జిల్లా బాధ్యుల నుంచి ఫోన్లు అందుకున్న టీచర్లు ఇతర ఉపాధ్యాయులతో మహాధర్నా అవసరాన్ని ఫోన్ ద్వారా వివరిస్తారని శ్రీపాల్ తెలిపారు. గ్రామ స్థాయి ఉపాధ్యాయుల వరకూ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తీసుకెళ్తున్నట్టు ఎమ్మెల్సీ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ నేతలు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమభవన్ ముందు ధర్నాకు దిగిన ఆర్.కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.

## ఫీజు బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

### ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

### మహాధర్నాలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ విధానాన్ని నీరుగారిచే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముందు మహాధర్నా కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నినాదాలతో సంక్షేమ భవన్ దద్ద రిల్లింది. మహా ధర్నాలో ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువు కోసం ఎంతగానో ఉప యోగపడే స్కాలర్షిప్ పథకానికి ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నామని గొప్పలు చెప్ప డం తప్ప అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపిం చారు. గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. కార్య్ర కమంలో గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, నందగోపాల్, ప్రీతం, సుధాకర్, చంద్రశేఖర్, రాజేందర్, లింగయ్య, రాఘవేందర్, మణికంత, నరసింహా గౌడ్, ఉమేష్‌రాకేష్, అరవింద్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఇచ్చిన పార్టీని చులకన చేయడం తగదు

### కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ నేడు కెటిఆర్‌కు చిల్లర పార్టీ అయిందా, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన నేతలు ఉన్న పార్టీని చులకన చేయడం తగదని అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడతూ అసలు ఇన్నాళ్లు కల్వకుంట్ల కుంటుంబం రాజకీ యాల్లో కొనసాగుతున్నారంటే తమ పార్టీ పెట్టిన భిక్షేనని అన్నారు. నాడు సోనియాగాంధీ ఇంటికి వెళ్లి కలిసినప్పుడు ఏం అనిపించ లేదా సెటైర్లు వేశారు. కెసిఆర్, కెటిఆర్ వెలిగిపోవడానికి కారణం కాంగ్రెస్ అన్న విషయం గుర్తు పెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కెటిఆర్ వ్యక్తిత్వం లేని వాడని అన్నారు. ఇంకా ఆయనకు రాజకీయ పరి పక్వత రావాల్సి ఉందని తెలిపారు. నిండు అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియాగాంధీ అని చెప్పిన విషయం మరిచారా అని గుర్తు చేశారు. కాంగ్రెస్‌పార్టీ థర్డ్ క్లాస్ పార్టీ అయితే.. కెటిఆర్ అయ్య కూడా అదే థర్డ్‌క్లాస్ వ్యక్తి అంటూ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 33 బాటిళ్ల డిఫెన్స్ మద్యం పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో బేకర్ దుకాణం. మరో పక్క బ్యాంకుల్లో రుణాలు కావాల్సిన వారికి రుణాలు ఇప్పిం చడం చేస్తున్న జి.సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా డిఫెన్స్ మద్యం బాటిళ్లను అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సమా చారం అందుకున్న మహబూబ్‌నగర్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కవిత, ఎస్సై రాజేందర్, సిబ్బంది కలిసి సుదర్శన్‌రెడ్డి ఇంట్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 33 డిఫెన్స్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టు కున్న మద్యం విలువ రూ. 1.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. డిఫెన్స్ క్యాంటిన్‌లో నెలవారి కోటా కింద తీసు కునే మద్యం బాటిళ్లను తక్కువ ధరలకు సేకరిస్తూ ఉంటాడు. డిఫెన్స్ బాటిళ్ల అంటూ ఎక్కువ ధరలకు అమ్మ కాలు జరుపుతూ సొమ్ము చేసు కుంటున్న సుదర్శన్‌రెడ్డిని అరెస్టు చేశారు. మద్యం బాటిళ్లను పట్టుకున్న డిటిఎఫ్ టీమును డిప్యూటీ కమిషనర్ ఎ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్ రెడ్డి అభినందించారు,

## వివిధ సెట్స్ ప్రవేశాల్లో బేషరతుగా అడ్మిషన్స్ కల్పించాలి

### ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఎబివిపి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సెట్స్‌కి సంబంధించిన అడ్మిషన్స్‌లో ఎలాంటి షరతులు లేకుండా చూడాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అంద చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గసభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు దృహన్, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐ సెట్, ఎడ్ సెట్, లా సెట్‌కి సంబంధించిన ప్రవేశాలు జరుగు తున్న తరుణంలో కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపి సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని రాంబాబు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సర్టిఫికెట్స్ ఇవ్వాలంటే మొత్తం ఫీజు విద్యార్థులే కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యకనతం చేశారు. విద్యార్థులు వారు గతంలో చదివిన కళాశాలల నుండి కస్టోడియన్ సర్టిఫికెట్ తీసుకొచ్చినప్పటికి కూడా అడ్మిషన్ పొందిన ప్రస్తుత కళాశాలలు వాటిని అంగీకరిం చట్లేదన్నారు. ఈ కారణాల వల్ల అడ్మిషన్ వచ్చిన విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ర్యాంక్ సాధించినప్పటికీ ఇలాంటి కారణాల వల్ల విద్యార్థులు ఉన్నత కోర్సుల్లో అడ్మిషన్ పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజురీయిం బర్స్‌మెంట్ చెల్లించకపోవడమేనని రాంబాబు విమర్శించారు. ప్రభుత్వ తప్పులకు విద్యార్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దని.. కాబట్టి ఎలాంటి షరతులు లేకుండా అడ్మి షన్స్ చేసుకోవాలని కాలేజీలు, యూనివర్సిటీలను ఆదేశించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఐసెట్ కౌన్సెలింగ్‌కు 13,056 మంది దరఖాస్తు

### మొదటి రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 2992 మంది హాజరు

### 25 నుంచి వరకు వెబ్ ఆప్షన్లు.. సెప్టెంబరు 2న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 13,056 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కాగా.. మొదటి రోజు 2992 మంది హాజరయ్యారు.

ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

## ఉన్నతాధికారులకు బదలీలు.. మాకు సస్పెన్షన్‌లా?

### ఆందోళనకు సిద్ధమవుతున్న అర్చకులు, పూజారులు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేవాల యాల్లో పనిచేసే అర్చకులు, పూజారులు బయట ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే దేవాదాయ శాఖ ఉత్తర్వులను వ్యతిరేక్తి ఆందోళనలు చేసేం దుకు సిద్ధం అవుతున్నారు. ఎవరో ఒకరు ఇద్దరు చేస్తున్న పనిని దృష్టిలో ఉంచుకుని ఈ విధంగా పూజారులు, అర్చకులను కించపరిచే విధంగా ఉత్త ర్వులు జారీ చేయడం సరికాదంటు న్నారు. తాము ఆహర్నిషలు కృషించి దేవాల యాల అభి వృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి తమను అవమా నిస్తోందని మండి పడుతున్నారు.

తమ పూజాపునస్కారాలతో ఉదయం లేచి ఆ భగవంతుని సేవలో తరిస్తూ అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుని ప్రార్థి స్తున్నామన్నారు. ఎటువంటి సెలవులు, వారాంత రపు సెలవులు లేకుండా పని చేస్తున్న తమపై ఇటువంటి బలవంతపు ఉత్తర్వులు సరికాదం టున్నారు. పుణ్యదినాలు, పండగ రోజుల్లో తాము ఎటువంటి విరామం విసుగు లేకుండా పని చేస్తున్నామని, పండగ రోజుల్లో ఉదయం 3.30 గంట లకు లేచి దేవాలయాన్ని శుభ్రం చేసుకొని పూజా కార్యక్రమాలు అనంతరం మరోసారి దేవాలయాన్ని పరిశుభ్రం చేసుకుని కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్న తమ శ్రమను గుర్తించకుండా ఇటువంటి అర్థంపర్థం లేని ఉత్తర్వులతో తము ఇబ్బంది పెట్టడమే అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్త లోకోసుఖినో భవంతు: అని భావించి తాము భక్తులను దీవిస్తామని, దీని వెనుక ఎటువంటి ఉద్దేశ్యాలు ఉండవని లేనిపోనివి అభాండాలు, మాకు ఆపాదించి భగవంతునికి భక్తునికి అనుసంధా నంగా ఉండే మమ్మల్ని అవమానించడం కాక మరేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేపడుతుండటంతో ఆయా ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుండటంతో ఆలయాలకు కూడా పెద్ద మొత్తంలో కానుకలు, ఇతర రూపాల్లో ఆదాయం కూడా భారీగా పెరుగుతోందం టున్నారు. ఒక వైపు ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతూ మరో వైపు ఆ దేవుళ్ళన్న నమ్ముకుని వారినే ఆరాధిస్తున్న జీవితాలను గడుపుతన్న మమ్మల్ని ఈ నూతన ఉత్తర్వులు ఎంతో కృంగదీయడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోగులాం గద్వాల్ దేవాలయంలో నూతన ఉత్తర్వులు ప్రకారం ఇద్దరి అర్చకులను సస్పెండ్ చేసి, ఇఒను మాత్రం బదిలీ చేయడం ఎంతవరకు సబబుని వారి ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు అధికారులకు ఒకలా అర్చకులు, పూజారులకు మరోలా ఉండవని కానీ ప్రభుత్వం ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులను ఒకలా అర్చకులను, పూజారులను మరోలా చూస్తూ పక్షపాత ధోరణి అవలంబిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి నిబంధనల పెట్టి వేద మంత్రోచ్చరణ చేసే తమ నోర్లు మూయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేసేందుకు కూడా వెను కాడమని ఆయా సంఘాల నేతలు హెచ్చరి స్తున్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సిపిఐ సిద్ధం కావాలి

### పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




గాజులరామారంలో జరిగిన రాష్ట్ర సిపిఐ నాలుగో మహాసభ మూడోరోజు సమావేశంలో ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి.

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఆగస్టు 22, ప్రభాత వార్త:** ప్రజాసమస్యల పరిష్కారంకోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శ్రేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో ప్రాతినిత్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయా లన్నారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లా పూర్ నియోజకవర్గం గాజుల రామారం పొట్లూ రి నాగేశ్వరరావు నగర్ లోని కామ్రేడ్ ఎన్.బాల మల్లేశ్ హాలు (మహారాజా గార్డెన్స్)లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాలుగవ మహాసభల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

భూమి కోసం, భుక్తికోసం వెట్టిచాకిరీ విముక్తికోసం పోరాడిన కమ్యూనిస్టుపార్టీ వద్దకు వెళితేనే తమకు ఇంటిస్థలం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో నిలిచిఉంటడం తమపార్టీ గొప్పదనమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ఉధ్యమాలే ఊపిరి అని ఉధ్యమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించి ప్రజాప్రతినిధులుగా గుర్తింపుకోసం నినంతరం శ్రమించాలన్నారు. మతోన్మాద ఆర్.ఎస్.ఎస్ మద్దతుతో బిజెపి గత 11ఏళ్లుగా డిల్లిలో ఎర్రకోటపై జాతీయజెండాను ఎంతో దురష్టకరమన్నారు.

బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విదానాలకు వ్యతిరేకంగా బిజెపి హఠావో దేశ్‌కు బచావో నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేశ్ ప్రసంగించారు. మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్, సమావేశానికి జిల్లా నలుమూడల నుండి భారీగా మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ పరిశ్రమల ట్రేడ్‌యూనియన్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ప్రాంగాణమంతా ఎర్రరంగు పులుకున్నతీరుగా మారింది.

## ఎఫ్‌సెట్ ఇంటర్నల్ స్లైడింగ్‌లో 3,590 సీట్ల కేటాయింపు

### నేడు కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలి.. 9,419 మంది వెబ్‌ఆప్షన్లు

### ఇంటర్నల్ స్లైడింగ్ అనంతరం 85 శాతం సీట్ల భర్తీ.. 13,453 సీట్లు ఖాళీ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలే జీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంట ర్నల్ స్లైడింగ్ వెబ్ ఆప్షన్లు ముగియగా శుక్రవారం సీట్ల కేటాయింపు చేపట్టారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో భాగంగా 9419 మంది తమ బ్రాంచ్‌లను మార్చుకోవడం కోసం 9419 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 3590 మందికి సీట్లను కేటాయించారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు నేడు(శనివారం) కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలని సాం కేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 97,369 మంది సర్టిఫికెట్ వెరిఫి కేషన్‌ను నిర్వహించారు.

రాష్ట్రంలో 180 కాలే జీల్లో 90,246 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నా యి. వాటిలో ఇంటర్నల్ స్లైడింగ్ పూర్తయ్యే నాటికి 76,793 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ తెలిపారు. మొత్తం కన్వీనర్ సీట్లలో 85.1 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కోస్గిలోని గవర్నమెంట్ కాలేజీలో 198 సీట్లకి 49 సీట్లు భర్తీ కాగా మరో 149 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీ కాలేజీలు 21 ఉండగా వాటిలో 6440 సీట్లకిగాను 4482 సీట్లు భర్తీకాగా.. మరో 1958 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లు ఉంటే.. వాటిలో 1340 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 82,222 సీట్లు ఉండగా.. వాటిలో 70,922 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా కన్వీనర్ కోటాలో 90,246 సీట్లు అందుబాటులో ఉంటే 76,793 సీట్లు భర్తీకాగా.. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 85.1 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో స్పాట్ అడ్మిషన్లకి సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేసే అవకాశం ఉంది.

## మట్టి గణనాథుల పంపిణీకి 34 కేంద్రాలు ఏర్పాటు చేసిన హెచ్ఎండిఏ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో మొదలు కానున్నాయి. అయితేపర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులను వాడొద్దని, మట్టి గణపతులనే పూజించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండిఏ) పిలుపు నిచ్చింది. పర్యావరణహిత వినాయకులను పూజించాలని పిలుపునివ్వడమే కాదు, ప్రతియేడాదిలాగే ఈ యేడాది కూడా వేలాది మట్టి గణపతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం అయింది. నగరంలో పలు కేంద్రాల్లో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దాదాపు 34 కేంద్రాల్లో ఈ మట్టి గణపతులను పంపిణీ పూర్తిగా ఉచితం అని పేర్కొంది. నగరవ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో ఈనెల 24, 25, 26 తేదీల్లో లక్ష వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది.

## యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 సర్వీస్ రోడ్ల పనులు పూర్తి చేయాలి

### కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వరంగల్ ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 22:** కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఢిల్లీలో శుక్రవారం వరంగల్ పార్లమెంట్ సభ్యు రాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి- వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవేను నాలుగు లైన్లుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ కేంద్ర మంత్రికి వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘనపూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా, జనగాం నుంచి ఈ గ్రామాల మధ్యలో లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దీంతో గ్రామాల వాహనాలు నేరుగా ప్రధాన హైవేపైకి రావడం వల్ల రద్దీ పెరుగుతోందని, ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని ఎంపీ కడియం కావ్య తెలిపారు. నాలుగు లైన్ల సమయంలోనే అవసరమైన భూమి సేకరించారని, ఇప్పుడు కేవలం నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎంపీ డా.కడియం కావ్య కేంద్ర మంత్రిని కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని పరిశీలిస్తానని, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారని ఎంపీ కావ్య తెలిపారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

## రేషన్ డీలర్ల హామీలను అమలు చేయాలి

### డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ఇచ్చిన అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సం క్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కనీస గౌరవవేతనం ఐదు వేల రూపాయలు, 300 రూపాయల కమీషన్ పెంపును తక్షణమే ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ నుండి ఆగస్ట్ వరకు రావల్సిన ఐదు నెలల కమీషన్‌ను వెంటనే ఇప్పించి, రేషన్ డీలర్ల కుటుంబాలను ఆర్థికంగా ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ షాపులను మిని సూపర్‌మార్కెట్‌లుగా గుర్తించి, మరిన్ని నిత్యావసర సరుకులను పేదప్రజలకు అందుబాటులోకి తేవాలని, రేషన్‌డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే భరించాలని, పాత బకాయిలను చెల్లించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మండ్లు మా ట్లాడుతూ గోదాం ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, పోర్టబిలిటీ సిస్టం వచ్చినందున రేషన్‌కార్డుల బైఫర్గేషన్ విధా నాన్ని నిలుపుదల చేసి, కొత్తషాపుల ఏర్పాటు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 324

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 324 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 74దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 57దరఖాస్తులు, హోంశాఖకు సంబంధించి 26 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తివేయాలి

### కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు చిన్నారెడ్డి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:**చేనేత రంగంపై గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ) ఎత్తివేయాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి... కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అధిక సంఖ్యలో చేనేత రంగంలోనే ఉపాధి పొందుతున్నారని చిన్నారెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు. చేనేత రంగంపై జీఎస్టీ విధించడం వల్ల చేనేతపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని చిన్నారెడ్డి వివరించారు.చేనేత రంగంపై జీఎస్టీ ని మినహాయింపు ఇవ్వాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని, గ్రామీణ చేనేత చేతివృత్తుల కుటుంబాలను ఆదుకోవాలని చిన్నారెడ్డి ఆ లేఖలో కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు సెంటర్ ఫర్ మానిటరింగ్ రూరల్ ఇండియన్ ఎకానమీ అధ్యక్షులు జై ప్రకాష్ రాపోలు తనను కోరుతూ రాసిన లేఖను జత చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.రానున్న జీఎస్టీ సమావేశంలో చేనేత రంగానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఖజానాకు ఆంక్షలు.. రాష్ట్రంలో ఆర్థిక నియంత్రణ

### ఫలితమిస్తున్న సర్కార్ కీలక ఆర్థిక చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని సమర్థవంతంగా నియంత్రించేందుకు రాష్ట్ర సర్కార్ చేపట్టిన కీలక ఆర్థిక చర్యలు సత్ ఫలితాలనిస్తున్నాయి. దీంతో ఖర్చు తగ్గంతో పాటు, ఆదాయంలో పెరుగుదల చోటుచేసుకోవడం విశేషం. ఆరు గ్యారంటీ పథకాల అమలుతో పాటు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు వంటి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో, ఖజానాపై భారం తగ్గించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇదేసమయంలో పన్నుల ఆధారిత వసూళ్లను పెంచడమే కాకుండా, పన్నేతర ఆదాయాన్ని పెంచే వ్యూహాన్ని కూడా అమలు చేస్తోంది. విభిన్న ప్రభుత్వ శాఖల్లో నిధుల వినియోగంపై కఠిన ఆంక్షలు విధిస్తూ, అవసరమైన పనులకే నిధులు ఖర్చు చేయాలంటూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. వివిధ శాఖల ద్వారా ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని పెంచడంతో పాటు భూముల అమ్మకం ద్వారా అదనంగా దాదాపు రూ.25 వేల కోట్ల రూపాయలను సమీకరించే లక్ష్యంతో చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మైనింగ్ రాయల్టీలు, ఇసుక అమ్మకాలు, నిరుపయోగ భూముల విక్రయాలు, రాజీవ్ స్వగృహ హౌసింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన ఆదాయ వనరులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

అలాగే రెవెన్యూ ప్రధానంగా భూముల విలువలను మళ్లీ సవరించడం, రవాణా, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, వాణిజ్య తదితర వాటి ద్వారా ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపడుతోంది. మరోపక్క ఆర్థిక శాఖ ఇప్పటికే పన్ను లీకేజీల నియంత్రణ, వ్యర్థ వ్యయాల అరికట్టడానికి చర్యలు ప్రారంభించింది. పన్ను రహిత ఆదాయ వనరులను గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలపై అధిక భారం పడకుండా అదనపు ఆదాయం సమీకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వ్యయం తగ్గి, ఆదాయం క్రమేపీ పెరుగుతోంది. అన్ని రకాల రాబడుల ద్వారా రాష్ట్ర ఖజానాకు తొలి క్వార్టర్‌లో రూ.57,499 కోట్లు సమకూరగా, రూ.52,559 కోట్లను ఖర్చు చేసింది. ఇందులో మూలధన వ్యయం కింద అంచనా వేసిన రూ.36,504 కోట్లలో రూ.4,755 కోట్లను ఖర్చు చేసింది. వస్తు సేవల పన్ను, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు, సుంకాల ద్వారా ఏప్రిల్‌లో రూ.10,916 కోట్ల ఆదాయం రాగా, మేలో అది రూ.11,692 కోట్లు, జూన్‌లో రూ.13,112 కోట్లకు పెరిగింది. ఈ లెక్కన మే నెల కంటే జూన్ నెలలో రాష్ట్ర ఖజానాకు రూ.1,420 కోట్లు అదనంగా వచ్చాయి. ఇక మార్కెట్లో రుణాల కింద రూ.54,009 కోట్లు లక్ష్యానికి గాను ఏప్రిల్ నుండి గత నెల ఐదో తేదీ నాటికి ఒక్క రిజర్వ్ బ్యాంకు నుంచే రూ.30,900 కోట్లు రుణ సమీకరణ చేసింది. ఈ విధంగా సర్కార్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సత్ ఫలితాలను ఇస్తూ, ఖర్చు తగ్గడంతో పాటు, ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంటోందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి.

# సమస్యలతో విలవిలలాడుతున్న హైదరాబాద్

### మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు

### బిజెపి నేతల అరెస్టు దారుణం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరం అనేక సమస్యలతో విలవిలలాడుతుంది, నగరం అనాథగా మారిపోయిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ అనేది కేవలం హైటెక్ సిటి, మాదాపూర్, కొండాపూర్ మాత్రమే కాదని, మల్టీస్టోర్ బిల్డింగులు, పెద్దపెద్ద కాంప్లెక్సులు ఉన్న ప్రాంతాల్లోనే ఆదాయాన్ని ఖర్చుపెట్టడం సరికాదన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని మధ్యతరగతి, పేద ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కనీస రహదారి సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ, డ్రైనేజీ లేని ప్రాంతాలకు మంచినీటి సరఫరా, పార్కులను రక్షిచడం, వరదనీటి పైపులైన్లను క్లీన్ చేయడం వంటి పనులు చేయకుండా, సమస్యలను పరిష్కరించలేకపోవడం దౌర్భాగ్యమైన పరిస్థితి హైదరాబాద్ నగరంలో ఏర్పడిందన్నారు. అనేక రోజులుగా వీటి పరిష్కారం కోసం బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసి సమావేశాలు తూతూమంత్రంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడేందుకు బిజెపి కార్పొరేటర్లకు మైకు ఇవ్వడం లేదన్నారు. ప్రజల ఇబ్బందుల గురించి ప్రభుత్వం ఖచ్చితమైన పరిష్కారం చూపడం లేదన్నారు. గతంలో కేసీఆర్ విశ్వనగరం చేస్తానని చెప్పాడు. దానికంటే ఎక్కువ చేస్తామని రేవంత్ రెడ్డి వాగ్దానం చేశారు.హైదరాబాద్ నగర ఇమేజ్‌ను నిలుపుకోవాలి. కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.జీహెచ్‌ఎంసీ, మెట్రో వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లు ప్రధాన విభాగాలు. ఈ విభాగాలకు కనీస నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ధర్నాలు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు జీహెచ్‌ఎంసీ టెండర్లు వేయడం కూడా ముందుకు రాలేదు. టెండర్ల పాల్గొని పని చేస్తే డబ్బులు ఎప్పుడొస్తాయో కూడా తెలియదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలో దుస్థితి. డెవలప్‌మెంట్ సిటీ అని చెప్పుకుంటారు. జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో వర్షం పడితే మోకాళ్ల లోతు నీరు రోడ్లపై నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ వ్యవహారాల మంత్రిగా ఉన్నారని,మేం ప్రజా సమస్యలపై మేం మాట్లాడితే కాంగ్రెస్ మంత్రులు మమ్మల్ని విమర్శిస్తున్నారన్నారు.

విమర్శలు మాత్రమే చేస్తూ.. తమ పని అయిపోయిందని భావిస్తున్నారు. తెలంగాణ ప్రజలకు, హైదరాబాద్‌కు పౌర సరఫరాలను మెరుగుపరిచే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వహించాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, నగర అభివృద్ధి అంశాలపై బిజెపి ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడితే, రాష్ట్ర ప్రభుత్వానికి ఉలిక్కిపాటు, భయం ఎందుకు? బిజెపి నాయకులను అరెస్టులు, హౌస్ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నాం. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుని, మాజీ శాసనసభ్యులను, బిజెపి కార్పొరేటర్లను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి అణచివేసే ప్రయత్నం చేయడం దుర్మార్గం అన్నారు.2023లో అమలు కావాల్సిన కొత్త పిఆర్‌సి ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

అసలు వేతన సవరణ సంఘం ఉందా లేదా అనేది కూడా తెలియదు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్ అమల్లో ఉండేది. గత కెసిఆర్ ప్రభుత్వం క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్ ప్రవేశపెట్టింది. కానీ అది కూడా క్యాష్ లెస్‌గానే మిగిలిపోయిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిపోయిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.ఉద్యోగులు దాచుకున్న డబ్బును కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం తరఫున తెలంగాణ లిబరేషన్ డే (సెప్టెంబర్ 17)ను ప్రతి సంవత్సరం హైదరాబాద్ నగరంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఈ సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహిస్తామన్నారు.

## సిపిఎస్ రద్దు కోసం దశలవారీ పోరాటం

### నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన..


### 24న ఇందిరాపార్క్ దగ్గర దీక్ష

### ఆర్‌యుపిపి టిఎస్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:**కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) రద్దుకోసం దశల వారీగా పోరాడాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యుపిపి) తెలంగాణ స్టేట్ నిర్ణయించింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు. శానమోని నర్సిములు అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో గౌరవ సలహాదారు గోపాల్ జీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేసినట్టు నర్సిములు తెలిపారు. జీవో నెం.28 ద్వారా తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ అంశాన్ని అమలు పర్చడం దారుణమని.. ఆ జీవోను వెంటనే రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు నర్సిములు. దశాబ్దాలుగా కొనసాగిన భాషా పండితుల అప్‌గ్రేడ్ చిక్కుముడిని తొలగింపజేసి 12 వేల మంది భాషాపండితులను అప్‌గ్రేడ్ చేయించినట్లుగానే సిపిఎస్ రద్దుకోసం సంఘం పక్షాన దశలవారి పోరాటం చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులకి కూడా త్వరలో అప్‌గ్రేడ్ చేయాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తీర్మానం చేసినట్టుగా నేడు (శనివారం) నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరై భోజన విరామ సమయంలో జీవో 28 రద్దు చేసి సిపిఎస్‌ను అంతం చేయాలని నినదించనున్నట్టు తెలిపారు. నెల 24న ఇందిరాపార్క్ దగ్గర వివరణ దీక్షను నిర్వహించాలని.. సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మగౌరవసభను విజయవంతం చేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు.

## పాక్ మాజీప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మేనల్లుడి కిడ్నాప్

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పాకిస్తాన్ రాజకీయాల్లో కలకలం రేగిన ఘటన ఇది. ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మేనలుడు షహ్రీజ్ ఖాన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. లాహోర్‌లోని తన నివాసం నుంచి అతన్ని దుండగులు కిడ్నాప్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. షహ్రీజ్ ఖాణ ఇమ్రాన్ సోదరి కుమారుడు. ఆయనకు ఎలాంటి రాజకీయ సంబం ధాలు లేకున్నా కిడ్నాప్ అవడం రాజకీయంగా కలకలం రేపింది. ఆయన ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ కంపెనీ లిఇవెన్‌కు ప్రాంతీయ అధిపతిగా వుంటున్నాడు. కాగా షహ్రీజ్ కిడ్నాప్‌కు ఒక్క రోజు ము oదు భార్యతో విదేశాలకు వెళుతుండగా విమానాశ్రయంలో అధికారులు అడ్డుకున్నారని అతని కుటుంబీకులు తెలిపారు. షహ్రీజ్ కిడ్నాప్ గురువారం జరగగా ఇప్పటి వరకు అతని ఆచూకీ లభించలేదని లాహోర్ పోలీసులు తెలిపారు. షహ్రీజ్ కోసం గాలిస్తున్నామని వారు తెలిపారు.




## స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రోజు రోజుకు బ్యాకింగ్ రంగంలో సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు అధికంగా రావడంతో ఇందుకు సంబంధించి నివారణ చర్యలను ఎస్‌బిఐ చేపట్టింది.ఇందులో భాగంగా సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలో భాగంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్యాలయాలు, మాల్స్, మెట్రో స్టేషన్లు, పార్కులు వంటి వివిధ ప్రదేశాలలో వివిధ డిజిటల్ మోసాలపై అవగాహన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. శుక్రవారం కోటీలోని వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం (కోటీ ఉమెన్స్‌కాలేజ్)లోవిద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న సైబర్ మోసాలపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సన్ ఇంటర్నేషనల్,గులామ్ అహ్మద్ నర్సింగ్ కళాశాలల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా తోటి వారిని కూడా అప్రమత్తం చేయాలని అధికారులు సూచించారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌క్ కాల్ చేయాలని సూచించింది. అంతే కాకుండా బ్యాకింగ్ రంగంలో జరిగి మోసాలకు సంబంధించి అంబుడ్స్‌మెన్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌బిఐ జిఎం రవికుమార్ వర్మా, అంబుడ్స్‌మెన్ సిజిఎం (ఆర్‌బిఐ) సుబ్బయ్య,అంబుడ్స్‌మెన్ డిజిఎం(ఆర్‌బిఐ) కళ్యాన్ చక్రవర్తి, లోకపావని, బిపిన్‌కుమార్ సింగ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మెన్ నిర్వహించే కార్యకలాపాలను అధికారులు విద్యార్థులకు వివరించారు.

## జోగులాంబ ఆలయ పునరుద్ధరణకు రూ.345 కోట్లతో మాస్టర్ ప్లాన్

### అధికారులతో సమీక్షించిన ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:**జోగులాంబ ఆలయానికి త్వరలోనే పూర్వ వైభవం కల్పించాలని, అందుకు రూ. 345 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తూ ఐదవ శక్తి పీఠం జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ధార్మిక సలహాదారు, స్థపతి గోవింద హరి, మూర్తి, రోడ్లు, భవనాలు, ఆర్కియాలాజీ, ఎండోమెంట్స్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కోసం రూ. 4.9 కోట్లతో తక్షణమే పనులు ప్రారంభించాలని, ఆలయ పునరుద్ధరణ పనులు మూడు దశలలో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.

## అవినీతి వ్యతిరేక చర్యలపై ఇంత వ్యతిరేకతా?

### ఆర్జేడి, కాంగ్రెస్ నేతలు ఉంటే జైలు, లేకుంటే బెయిలు: ప్రధాని మోడీ విమర్శ



**పాట్నా, ఆగస్టు 22:** తప్పు చేస్తే సిఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జెడీ, కాంగ్రెస్ నేతలతు ఉంటే జైల్లో, లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రవేశ పెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోడీ ప్రశ్నించారు. బీహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుతాం? అని మోడీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్రమంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవి కోల్పోతారు.

## చేతగాని పాలకుల వల్ల యూరియా సంక్షోభం: మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:** రైతులను అరిగోస పెడుతున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల పతనం ప్రారంభమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. రైతులకు యూరియా సరఫరాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరిపాలన అంటే ఏమిటో తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ నాయకత్వం, ముందుచూపు, పకడ్బందీ పాలన అంటే ఏమిటో ఇప్పుడు తెలంగాణ సమాజానికి అర్థమైందని కెటిఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా సంక్షోభం పైన ఆయన స్పందిస్తూ, చిల్లర రాజకీయాలు తప్ప పరిపాలన తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని ధ్వజమెత్తారు.ఒకవైపు బూతులు మాట్లాడడం తప్ప చేతలు రాని ఢిల్లీ పార్టీల నాయకులకు, మరోవైపు వందేళ్ల విజన్‌కు నిలువెత్తు రూపమైన కెసిఆర్‌కు ఉన్న స్పష్టమైన తేడా నాలుగు కోట్ల తెలంగాణ సమాజానికి ఇప్పుడు అర్థమైపోయిందని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో యూరియాను సకాలంలో తెప్పించడానికి ఎన్నెన్ని ప్రణాళికలు, కసరత్తులు జరిగాయో ఆయన వివరించారు. వ్యవసాయ అధికారులతో కెసిఆర్ వరుస సమీక్షలు నిర్వహించేవారని, కేంద్రానికి ప్రతి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు సమర్పించేవారని గుర్తు చేశారు. అంతేకాకుండా, ఎసిలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, సరఫరాను పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేసేవారని తెలిపారు. యూరియా సరఫరా కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు స్వయంగా కెసిఆర్ ఫోన్ చేసి, 25 స్పెషల్ గూడ్స్ ట్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారని పేర్కొన్నారు. అవసరమైతే పక్క రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో నేరుగా సంప్రదింపులు జరిపి, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారని తెలిపారు. పోర్టుల నుంచి నేరుగా మండలాలకు యూరియాను తరలించే వ్యూహాలను రచించి, ప్రతి రైతుకు సమయానికి అందేలా చర్యలు తీసుకునేవారని చెప్పారు.

## బిజెపి సచివాలయం ముట్టడి ఉద్రిక్తం

### రాష్ట్ర అధ్యక్షుడితోపాటు పార్టీ నేతల అరెస్టులు

### ఖండించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి పరిధిలో సమస్యలను పరిష్కరించాలని సేవ్‌హైదరాబాద్ పేరుతో గ్రేటర్ హైదరాబాద్ బిజెపి శ్రేణులు తెలంగాణ సచివాలయం ముట్టడికి ఉద్రిక్తతకు దారి తీసింది. అప్రమత్తమైన పోలీసులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే నగరంలోని బిజెపి ముఖ్యనాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లను గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలోనే మరికొందరు నాయకులు, కార్పొరేటర్లు పోలీసుల కళ్లుగప్పి తెలంగాణ సచివాలయం వద్దకు చేరకున్నారు. కరెంట్ తీగలతో మరణాలు, జిహెచ్‌ఎంసి సమస్యలపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేవారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందిన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సచివాలయం మెయిన్ గేటు నుంచి వారు లోనికి వెళ్లేందుకు యత్నించగా.. అక్కడే భద్రతా సిబ్బంది బిజెపి నేతలను అడ్డుకున్నారు. దీంతో కమలం శ్రేణులు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకంది. ఈ మేరకు బిజెపి కార్పొరేటర్లను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి సమీప పోలీసు స్టేషన్‌లకు తరలించారు. హైదరాబాద్ సమస్యలపై సచివాలయం వద్ద నిరసనకు పిలుపునిస్తే మా నాయకులను అక్రమం గా అరెస్ట్ చేశారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్లో భూముల అక్రమ వ్యాపారం హెల్సేల్గా సాగుతోందని ఆరోపించారు.



కాంగ్రెస్ ప్రభుత్వానికి బిజెపి అంటే భయమెందుకని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమా ల్లో పాల్గొనేందుకు చేవెళ్ల వెళ్తున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేయడాన్ని సంజయ్ ఖండించారు. అరుణాచల్ ప్రదేశ్ పర్యటనలో ఉన్న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని ఆరోపించారు. జిహెచ్ ఎంసి పరిధిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తే బిజెపి కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేసి తమ వైఫల్యాలను కాంగ్రెస్ కప్పిపుచ్చుకోవాలనుకుంటుందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేస్తున్న బిజెపి కార్యకర్తలు కార్పొరేటర్లను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని అన్నారు.

## ప్రభుత్వ జూ. కాలేజీల్లోని అతిథి అధ్యాపకులను కొనసాగించాలి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను అందరినీ యధావిధిగా కొనసాగించాలని గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు శుక్రవారం ఇంటర్ విద్య కమిషనర్‌కి విజ్ఞప్తి చేశారు.

గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న 1654 గెస్ట్ లెక్చరర్లను యధావిధిగా కంటిన్యూ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు వెంకటేష్, నాగరాజులు ఇంటర్ విద్య కమిషనర్ కృష్ణ ఆదిత్యకి విజ్ఞప్తి చేశారు.

### ఇంటర్ విద్య కమిషనర్‌కు గెస్ట్‌లెక్చరర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

గత విద్యా సంవత్సరంలో టిజిపిఎస్‌సి ద్వారా రెగ్యూలర్ లెక్చరర్ల నియామకం ద్వారా డిస్టర్బ్ కావడంతో మంత్రులను, ప్రభుత్వ పెద్దల దృష్టికి గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమస్యను తీసుకుపోగా.. అసెంబ్లీలోనే మంత్రి దామోదర రాజనర్సింహ రెగ్యూలర్ లెక్చరర్ల నియామకం అయినా గతంలో పనిచేస్తున్న వారెవరికీ ఇబ్బంది కలగనీయమని అందరినీ కొనసాగిస్తామని అవసరమైతే అదనపు పోస్టులను మంజూరు చేస్తామని ప్రకటించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో హామీ ప్రకారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో గత 12 సంవత్సరాలు గా పనిచేస్తున్న 1654 మంది గెస్ట్ లెక్చరర్ల రెన్యూవల్ చేయడంతోపాటు రెగ్యూలర్ లెక్చరర్ల నియామకం వల్ల డిస్టర్బ్ ఐన వారిని అడ్జస్ట్‌మెంట్ చేయడం కోసం సీఎం కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం ఇంటర్ విద్య కమిషనర్ ఈ ఏడాది జూన్ 13న ప్రభుత్వ ఆమోదం కోసం పంపిన 1654 గెస్ట్ ఫ్యాకల్టీ కంటిన్యూయేషన్ ఫైల్ లో ఫైనాన్స్ అధికారులు వివిధ కారణాలు చూపి పోస్టుల సంఖ్య తగ్గింపు చేసి కేవలం 398 పోస్టులకు మాత్రమే పర్మిషన్ ఇస్తున్నారని తెలిపారు.

ఇదే జరిగితే దాదాపు 1300 మంది కుటుంబాలు రోడ్డున పడనున్నాయని.. కాబట్టి అలా కాకుండా ప్రస్తుతం కొనసాగుతున్న 1654 మందిని కొనసాగించాలని కోరారు.

# పంట చేలు ఆగమాగం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు రైతులకు కడగండ్లు మిగుల్చాయి. భారీ వర్షాలతో సాగు కోసం రైతన్న పడిన కష్టాలు నీటి పాలయ్యాయి. భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని మెజారిటీ జిల్లాల్లో సాగు చేస్తున్న పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, జహీరాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో కాపుకు వచ్చిన పంట నీటి మునిగి రైతులకు తీవ్ర నష్టాలను మిగుల్చాయి. మొత్తంగా ఎక్కువగా కురిసిన వర్షాలతో రైతన్నలకు నీళ్ల వచ్చాయనే ఆనందం కన్నా.. చేతికి వచ్చిన పట పోయిందనే బాధ ఎక్కువైంది. భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట

### భారీ వర్షాలతో నిండా మునిగిన రైతన్నలు

### పంట వివరాలను సమర్పించాలన్న సర్కార్

వివరాలను సేకరించి తమకు పంపాలని సర్కార్ ఆదేశించింది. ఈ వర్షాలకు వివిధ జిల్లాల్లోని దాదాపు 4.50 లక్షల ఎకరాల్లోని వరి, పత్తి, మిర్చి, సోయాబీన్, కంది, కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 2 లక్షల ఎకరాల్లో పత్తి, 1.50 లక్షల ఎకరాల్లో వరి, మిగిలిన వాటిల్లో కంది, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, కూరగాయల తోటలు వరద ముంపునకు గురయ్యాయి. వరదలకు అధిక శాతం పైరు కొట్టుకుపోగా, మిగిలిన చోట్ల ఇసుక, బురద మేటలు వేశాయి. మరోపక్క పంట నీట మునిగిన ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇప్పించాలని రైతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా లక్షలాది ఎకరాలలో వ్యవసాయ పంటలన్నీ నీట మునిగి అపార నష్టం వాటిల్లింది. ప్రధానంగా లక్షలాది ఎకరాల మినుము,పెసర, కంది, సోయా, పత్తి పంటలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. నీరు నిల్వ ఉన్న మినుము,పెసర పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం పై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి తమకు ప్రభుత్వం ద్వార నష్టపరిహారం అందించాలని రైతాంగం కోరుతోంది.

# చిరంజీవిని ఎలా చూడాలనుకుంటున్నారో 'మన శంకరవరప్రసాద్ గారు'లో రెండింతలు చూస్తారు

## టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ అనిల్ రావిపూడి



**మెగాస్టార్ చిరంజీవి** పుట్టినరోజు సందర్భంగా హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. Mega157, ChiruAnil వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన గర్వంగా సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి 'మన శంకరవరప్రసాద్ గారు' అనే టైటిల్ పెట్టారు. 'పండగకి వస్తున్నారు' అనేది ట్యాగ్‌లైన్. టైటిల్ రివీల్ గ్లింప్స్ స్టైలిష్ మాస్ ఎంటర్‌టైనర్‌కు టోన్ సెట్ చేసింది. చిరంజీవి కారులో పవర్ ఫుల్ ఎంట్రీ ఇస్తూ, సిగరెట్ వెలిగిస్తూ, తన ట్రేడ్ మార్క్ స్వాగ్‌లో కమాండోల పక్కన నడుస్తుండగా గ్లింప్స్ ప్రారంభమవుతుంది. సిగరెట్ విసిరేస్తున్నప్పుడు టైటిల్ రివిల్ అవుతుంది. విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్ ఫ్యాన్స్‌ని మరింత సర్ ప్రైజ్ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' మెగాస్టార్‌కే కాదు, అనిల్ రావిపూడి సిగ్నేచర్‌స్టైల్‌లో చిరంజీవిని చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులందరికీ పర్ఫెక్ట్ బర్త్ డే ట్రీట్ అందించారు.

డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిరంజీవి ఎవర్ గ్రీన్ చరిస్మాని, స్టయిల్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. చివర్లో వచ్చే గుర్రం సీన్ అయితే మైండ్‌బ్లోయింగ్. ఆ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే 'బాస్.. బాస్' చాంట్స్ క్యారెక్టర్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లేశాయి. సినిమాటోగ్రాఫర్ సమీర్ రెడ్డి కెమెరా వర్క్ అదిరిపోయింది. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌ని హీరోయిజంతో ఎలివేట్ చేస్తూ టాప్ నాచ్ లుక్ ఇచ్చారు. ప్రొడక్షన్ వాల్యూస్ చాలారిచ్‌గా ఉన్నాయి. సినిమా బిగ్ విజువల్ ట్రీట్ ఇవ్వబోతోంది. మెగాస్టార్ ఇంత యంగ్, చార్మింగ్‌లుక్‌లో కనిపించడం సెలబ్రేషన్‌లా మారిపోయింది. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. మాస్, స్టయిల్, నాస్టాల్జియాని పర్ఫెక్ట్‌గా మిక్స్ చేసిన మన శంకరవరప్రసాద్ గారు ఈ సంక్రాంతికి థియేటర్స్‌లో అదరగొట్టబోతోంది. మెగాస్టార్ బ్లాక్‌బస్టర్ ఫెస్టివల్ ట్రెడిషన్‌ని కంటిన్యూ చేయనుంది.

టైటిల్ గ్లిమ్స్ లాంచ్ ఈవెంట్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "మెగాస్టార్ చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు. చిరంజీవి గారి బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా గ్లిమ్స్, ఆయన లుక్ పరిచయం చేయాలనుకున్నాం. గ్లింప్స్‌కి రెస్పాన్స్ అదిరిపోయింది. చిరంజీవి గారిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, ఎంటర్టైన్మెంట్ అన్ని అద్భుతంగా కుదిరాయి. చిరంజీవి గారి అసలు పేరు శివశంకర వరప్రసాద్‌లో నుంచి మేము శంకరవరప్రసాద్ తీసుకుని ఈ సినిమాలో క్యారెక్టర్‌కి పెట్టడంజరిగింది. దాన్నే.. 'మన శంకర వరప్రసాద్ గారు'గా చేసి సినిమాకి టైటిల్‌గా పెట్టాం. క్యాప్షను పండగకి వస్తున్నారు. గింప్స్‌కి విక్టరీ వెంకటేష్ వాయిస్ ఇచ్చారు. ఈ ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. వెరీ సూన్ ఎంట్రీ కూడా ఇవ్వబోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి గారు విక్టరీ వెంకటేష్‌గారి కాంబో ఎలా ఉంటుందో ఈసారి పండక్కి చూస్తారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన చిరంజీవి గారికి చాలా థ్యాంక్స్.. ఈ గ్లింప్స్ జస్ట్ శాంపిలే. సినిమాలో ఇంకా చాలా వున్నాయి. ఈ లుక్ కోసం మేము చేసింది ఏమీ లేదు. ఇందులో చిరంజీవి గారు 95% ఒరిజినల్. ఆయన సినిమా కోసం వెయిట్ లాస్ అయ్యారు. చాలా కేర్ తీసుకున్నారు. నా అదృష్టం కొద్దీ అంతా అద్భుతమైన లుక్ దొరికింది. ఈ క్రెడిట్ అంతా చిరంజీవి గారికి దక్కుతుంది. బీమ్స్‌కి ఐడియా చెప్పగానే చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. అలాగే విజువల్స్ సమీర్ రెడ్డి గారు అదరగొట్టారు. 'మన శంకర వరప్రసాద్ గారు' మీ అంచనాలకు తగ్గట్టే సంక్రాంతికి వస్తున్నారు అన్నారు. ప్రొడ్యూసర్ సుస్మిత కొణిదెల మాట్లాడుతూ.. 'నాన్నగారి పుట్టినరోజున ఆయనతో లేకుండా మీ అందరి ముందు ఇలా ఉండడం బహుశా ఇదే ఫస్ట్ టైం. ఇది వెరీ స్పెషల్ మూమెంట్. అనిల్ గారికి సాహు గారికి థాంక్యూ. ఇది నాకు లైఫ్ టైం ఎక్స్పీరియన్స్. ఇదే స్టైల్‌తో ఇంకా ఎనర్జీతో సంక్రాంతికి వస్తున్నాం. మీ ప్రేమ అభిమానాలు ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను. మన మెగాస్టార్‌కి వెరీ హ్యాపీ బర్త్‌డే అన్నారు. ప్రొడ్యూసర్ సాహు గారపాటి మాట్లాడుతూ... అందరికి నమస్కారం. ఈ గ్లిమ్స్ చూసి మేము ఎంత హ్యాపీగా ఫీల్ అయ్యామో ఫాన్స్ అంతకంటే రెట్టింపైన ఉత్సాహంతో ఉన్నారు. నేను, అనిల్‌గారు చిరంజీవి గారి సినిమాలు ఎలా చూసామో ఎలా చూడాలనుకుంటున్నామో అలానే ఇందులో చిరంజీవి గారిని చూపించాం. యూత్ ఫ్యామిలీ ఫ్యాన్స్.. అన్ని జనరేషన్స్‌కి ఈ సినిమా నచ్చుతుంది అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ మాట్లాడుతూ.. 'మెగాస్టార్ చిరంజీవిగారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను ఇక్కడికి వచ్చినందుకుచాలా గర్వపడుతున్నాను. అనిల్ గారికి జీవితాంతం కృతజ్ఞతతో ఉంటాను. లవ్ యు ఆల్ అన్నారు.



# 'భద్రకాళి' నుంచి బ్యూటిఫుల్ లవ్ సాంగ్ మారెనా రిలీజ్

**తెలుగు ప్రేక్షకులను** అలరించిన 'మార్గన్' విజయం తర్వాత విజయ్ ఆంటోనీ మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ మారెనా ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. విజయ్ ఆంటోని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన లిరిక్స్ హత్తుకునేలా వున్నాయి. అభిజిత్ అనిల్ కుమార్ వోకల్స్ మరింత ఎమోషన్ ని యాడ్ చేశాయి. ఈ లవ్ సాంగ్ ఆడియన్స్‌కి ఇన్స్టంట్‌గా కనెక్ట్ అవుతోంది.తెలుగులో మార్గన్ సినిమాను విజయం దిశగా నడిపించిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఉంది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. షెల్లీ కాలిస్ట్ డీవోపీ, విజయ్ ఆంటోనీ స్వయంగా మ్యూజిక్ అందిస్తున్నారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది.

# 'త్రిశెంకినీ' టైటిల్ విడుదల



ఎన్.బి.జె. ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎన్ బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్న సినిమా 'త్రిశెంకినీ'. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు రంజిత్ కుమార్. పలువురు నూతన నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ రోజు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్ లాంఛ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్య నటుడు బాబు మోహన్ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు బాబుమోహన్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి అన్నగారి బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. మెగాస్టార్ గారు మరిన్ని గొప్ప విజయాలు సాధించాలి, తన నటన, డ్యాన్సులతో మనల్ని అలరించాలని కోరుకుంటున్నా. అలాగే మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా 'త్రిశెంకినీ' సినిమా టైటిల్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి అన్నగారి మీద దేవుడు ఎంత ఆశీర్వాదం చూపించాడో, అంతే ఈ సినిమా మీద, మీ మీద చూపించాలని కోరుతున్నా. ఈ సినిమా మంచి విజయం సాధించాలి, మీరంతా సపోర్ట్ చేయాలి అన్నారు.

నిర్మాత ఎన్. బిక్కునాథ్ నాయక్ మాట్లాడుతూ ఈ రోజు మెగాస్టార్ చిరంజీవి గారి 70వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. నాకు సినిమాలంటే ప్యాషన్. కృష్ణ గారి అభిమానిని. గతంలో పాటలు కూడా రాశాను. ఓ చిత్ర రూపకల్పనకు ప్లాన్ చేశాం. రంజిత్ గారితో పరిచయం ఏర్పడింది. త్రిశెంకినీ సినిమా గురించి చెప్పినప్పుడు తప్పకుండా మనం ట్రావెల్ చేద్దామని చెప్పాను. అలా ఈ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వచ్చింది. సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ లో ఓ సరికొత్త మూవీ చేశాం. మా మూవీకి మీరంతా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.

నటుడు, దర్శకుడు రంజిత్ కుమార్ మాట్లాడుతూ నేను చిరంజీవి గారి అభిమానిని. మాది తిరుపతి. చదువుకునే రోజుల నుంచి ఆయన సినిమాలు క్రమం తప్పకుండా చూస్తుంటేవాళ్లం. నేను ఏ ఊరిలో ఉన్నా అక్కడ తప్పకుండా మెగాస్టార్ గారి బర్త్ డే సెలబ్రేట్ చేస్తుంటాను. ఈ రోజు ఆయన బర్త్ డే సందర్భంగా మా 'త్రిశెంకినీ' సినిమా టైటిల్ లాంఛ్ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ చిత్రంలో జై జై మెగాస్టార్ అనే పాట రూపొందించాం. ఆ పాట మెగాభిమానులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. కాపీ రైట్ లేదు. మీ అందరి ఆశీర్వాదంతో మా సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు.అతిథిగా వచ్చిన డా.రాజేంద్ర మాట్లాడుతూ 'త్రిశెంకినీ' సినిమా టైటిల్ లాంఛ్‌కు వచ్చిన అందరికీ థ్యాంక్స్. ఈ సినిమా సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో సరికొత్తగా ఉంటుంది. ఇలాంటి మూవీని మీరు ఇప్పటిదాకా చూసి ఉండరు. అంత కొత్తగా డైరెక్టర్ రంజిత్ కుమార్ గారు ఈ సినిమాను రూపొందించారు. ఆయన కాలేజ్ లెక్చరర్‌గా ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శనంచేశారు. ఇప్పుడు సినిమా మాధ్యమం ద్వారా కళారంగానికి సేవ చేయాలని ముందుకొచ్చారు. ఈ సినిమా మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నా అన్నారు.




# 'కన్నప్ప' బ్లాక్ బస్టర్ తరువాత మైక్రో డ్రామాల్ని సృష్టించనున్న విష్ణు మంచు..



**డివైన్ బ్లాక్ బస్టర్** 'కన్నప్ప' తరువాత విష్ణు మంచు చేయబోయే ప్రాజెక్టులు, సినిమాలపై అందరి దృష్టి పడింది. 'కన్నప్ప'లో అద్భుతమైన నటనను కనబర్చిన విష్ణు మంచు మీద ఆడియెన్స్ ఎంతలా ప్రశంసలు కురిపించారో అందరికీ తెలిసిందే. ఇక విష్ణు ఇప్పుడు మైక్రో డ్రామాలపై వంద కోట్ల పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించుకున్నారని సమాచారం.

ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేసేందుకు విష్ణు మంచు ముందడుగు వేయబోతోన్నారు. మైక్రోడ్రామాలతో విష్ణు మిరాకిల్స్ చేయబోతోన్నారు. మూడు నుంచి ఏడు నిమిషాల వ్యవధితో సాగే ఎపిసోడ్స్‌ని మైక్రో డ్రామాలు అని చెప్పుకోవచ్చు. మొబైల్‌లో యూజర్స్‌కి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా వాటిని రూపొందించాలని విష్ణు నిర్ణయించుకున్నారు. సాధారణ రీల్స్ మాదిరిగా కాకుండా, పూర్తి స్థాయి నిర్మాణం, ప్రొఫెషనల్ దర్శకత్వం, ఎఫెక్టివ్ స్టోరీ, నెరేషన్‌తో ఈ మైక్రో డ్రామాల్ని రూపొందించనున్నారట.

ఈ కొత్త వెంచర్ భారతీయ వినోదంలో గేమ్‌ఛేంజింగ్‌గా మారుతుందని అంతా అనుకుంటున్నారు. ఈ పరిణామం గురించి తెలిసిన పరిశ్రమ వర్గాలు.. ఈ ఏడాది 'కన్నప్ప'తో అత్యంత చర్చనీయాంశంగా విష్ణు నిలిచారు. తరువాతి తరం కథలను ఎలా చెబుతుంది? అసలు ఎలాంటి కథలు తెరపైకి వస్తాయి? అని చర్చించుకునే స్థాయికి చేరుకున్నారు. యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా విష్ణు అందరిని మెస్మరైజ్ చేశారు. ఇక ఈ మైక్రో డ్రామాలతో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారు అని అనుకుంటున్నాయి. ఇవే కాకుండా మరి కొన్ని భారీ బడ్జెట్ చిత్రాల్ని కూడా విష్ణు పట్టాలెక్కిస్తున్నారని సమాచారం.

# 'మిస్టర్ రోమియో' టీజర్ లాంచ్



**శ్రీ లక్ష్మీ ఆర్ట్స్,** మీడియా 9 క్రియేషన్స్ బ్యానర్‌పై నేతి శ్యామ్ సుందర్ నిర్మాతగా మనోజ్ కుమార్ కటోకర్ దర్శకత్వం వహించిన మ్యూజికల్ ఫిలిం మిస్టర్ రోమియో. ఏ రీల్ లైఫ్ స్టోరీ అనే ట్యాగ్ లైన్‌తో రూపొందించారు. గురుచరణ్ నేతి, జుహీ భట్, అమిషి రాఘవ్ హీరో హీరోయిన్స్‌గా నటించారు. ఎస్ కే ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్ పురోహిత్ ముఖ్య పాత్రల్లో నటించారు. చైతన్య గరికిన స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. ప్రజ్వల్ క్రిష్ సంగీతం అందించారు. ఈ మూవీ టీజర్ రిలీజ్ చేసిన హీరోయిన్ శ్రియా శరణ్ టీమ్‌కు బెస్ట్ విషెస్ చెప్పారు.

ఈ సందర్భంగా నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో గురు చరణ్ నేతి మాట్లాడుతూ.. "ఇదొక క్యూట్ లవ్ స్టోరీ. మనోజ్ కుమార్ ఈ చిత్రాన్ని అద్భుతంగా రూపొందిస్తున్నారు. యువతను ఆకట్టుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ప్యాషనేట్ టీం తో చేసిన ఈ ఫిలిం అందరికీ నచ్చేలా ఉంటుంది. మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన శ్రియ గారికి, కరుణ కుమార్ గారికి ధన్యవాదాలు" అని చెప్పారు.దర్శకుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ.."ఇది చిన్న సినిమా అయినా విజువల్ గా మాత్రం పెద్ద సినిమా చూసిన అనుభవం కలుగుతుంది. సినిమా మొత్తం ఆల్మోస్ట్ పూర్తయిపోయింది. ప్రస్తుతం ఆర్ఆర్ వర్క్ జరుగుతుంది. మరో నెలలో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నాం. గురుచరణ్‌ను సినిమాల్లో లాంచ్ చేయడానికి ముందుగా ఇలాంటి మ్యూజికల్ ఫిలిద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయాలని అనుకున్నాం. వారి తండ్రి శ్యామ్ సుందర్ గారు చాలా సపోర్ట్ చేశారు. గురు చరణ్ చాలా ఎనర్జిటిక్ గా నటించాడు. తన పర్ఫార్మెన్స్ అందరూ మెచ్చేలా ఉంటుంది. తను తప్పకుండా పెద్ద హీరో అవుతాడు. తనలో టాలెంట్ చాలా ఉంది. అందరూ ఎంకరేజ్ చేయాలని కోరుకుంటున్నా. విజువల్ గా మేం ఊహించిన దానికంటే డబుల్ రిజల్ట్‌ను అందించాడు సినిమాటోగ్రాఫర్ చందు. తను భవిష్యత్తులో బెస్ట్ టెక్నీషియన్‌గా ఎదుగుతాడు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు కరుణకుమార్ మాట్లాడుతూ.. "సినిమాల్లో చిన్నది పెద్దది అని తేడా ఉండదు. అది క్రియేట్ చేసే వండర్స్‌ను బట్టి అది లెక్కలోకి వస్తుంది. మనోజ్ గారితో నాకు ఎప్పటినుంచో పరిచయం ఉంది. యంగ్ జనరేషన్‌కి నచ్చేలా ఈ ఫిలింను రూపొందించారు.ఒక ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్‌గా ఆయనకున్న అనుభవాన్ని ఈ చిత్రం ద్వారా చూపించారు. ఈ సినిమా చాలా బాగుండటమే కాదు కొత్త ఒరవడిని సృష్టించబోతుంది. గురు చరణ్‌కి మొదటి సినిమా అయినా చాలా బాగా నటించారు. తను భవిష్యత్తులో మరింత పెద్ద హీరో అవుతాడని ఆశిస్తున్నా'అని అన్నారు. శ్రియా శరణ్ మాట్లాడుతూ.."టీజర్ చాలా బాగుంది. మూవీ కూడా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గురు చరణ్ అద్భుతంగా నటించారు. తనలో మంచి నటుడు ఉన్నాడు. టీజర్‌లో కార్తీక్ గా కనిపించిన చరణ్ నటన బాగుంది. 'నాకు రియల్ లవ్ కావాలి. రీల్స్ లవ్ కాదు' అని చరణ్ చెప్పే డైలాగ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. హీరోగా తను మరిన్ని సినిమాలు తీయాలని కోరుతూ ఆల్ ది బెస్ట్. డైరెక్టర్ మనోజ్‌తో ఎప్పుడు మాట్లాడిన సినిమాలు, కథలుగురించే చెబుతారు. ఇప్పుడు ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీని తీశారు. ఈ కథ యూత్ ని మెస్మరైజ్ చేసేలా ఉంటుంది. యంగ్ టీమ్ అంతా కలిసి చేసిన ఈ మూవీ అందరికీ నచ్చుతుంది. ఇందులో పార్ట్‌అయిన ప్రతిఒక్కరికి ఈ చిత్రం విజయం సాధించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ ఆల్ ద బెస్ట్' అని చెప్పారు.

# 'ఆంధ్రా కింగ్ తాలూకా' నవంబర్ 28న వరల్డ్‌వైడ్ రిలీజ్

**ఎనర్జిటిక్ స్టార్** రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్ బాబు పి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన టైటిల్ గ్లింప్స్, బ్లాక్‌బస్టర్ ఫస్ట్ సింగిల్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్‌ను డైహార్డ్ సినిమా బఫ్‌గా ప్రజెంట్ చేసిన టైటిల్ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుని భారీ అంచనాలను సృష్టించింది. వివేక్ మెర్విన్ స్వరపరిచిన 'నువ్వుంటే చాలే' అనిరుధ్ రవిచందర్ పాడగా, రామ్ పోతినేని స్వయంగా రాసిన లిరిక్స్ వైరల్‌గా మారి అందరిని ఆకట్టుకుంది. ఇప్పుడు, మేకర్స్ ఈ సినిమా థియేటర్ రిలీజ్ డేట్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. 'ఆంధ్రా కింగ్ తాలూకా' నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఇది సినిమా విడుదలకు సరైన డేట్. రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ స్టైలిష్ ఎనర్జిటిక్ అవాతర్‌లో కనిపించి థియేటర్లలో ఫెస్టివల్ వైబ్ ని సెట్ చేశారు.

ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ప్రముఖ సినీ సూపర్ స్టార్ పాత్రను పోషించారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటించారు. ఆంధ్ర కింగ్ తాలూకా చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సిద్దార్థ నుని సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. రిలీజ్ డేట్ అనౌన్స్ కావడంతో, ఈ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు ప్రమోషన్స్‌ని ముమ్మరం చేయడానికి సిద్ధంగా ఉన్నారు.



# ప్రధానితో మాట్లాడే అవకాశం..



చాలామంది మహిళల్లానే అన్నెం లక్ష్మీభవాని కూడా పెళ్లి తరవాత కెరియర్కి బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. అయితే, ఏళ్లు గడిచినా ఆమె లక్ష్యం చెదరకుండా తిరిగి స్వయం ఉపాధిపై దృష్టి పెట్టింది. ఇప్పుడు తాను నిలదొక్కుకోవడమే కాదు... మరో 15 మందికి ఆర్థిక భరోసా ఇచ్చారు. ఈ కృషితోనే ప్రధానితో మాట్లాడే అవకాశాన్ని దక్కించుకున్నారు. సరైన అవకాశాలు లభిస్తే.. ఏ రంగంలోనైనా రాణించగలమనడానికి నేనే ఓ ఉదాహరణ.

మాది వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సీఎంఆర్ పల్లె. అమ్మానాన్నలు నన్ను డిగ్రీ వరకు చదివారు. చిన్నప్పటి నుంచి నా కాళ్లపై నేను నిలబడాలనుకునేదాన్ని. పెళ్లయ్యాక అత్తింటి వారు ప్రభుత్వ ఉద్యోగమైతే చేయొచ్చు... ప్రైవేటు కొలువు వద్దనడంతో ఆగిపోయా. తర్వాత ఇద్దరాడపిల్లలు పుట్టడం, వారి ఆలనా పాలనా చూసుకుంటూ పదకొండేళ్లు గృహిణిగానే కాలం గడిచిపోయింది. కానీ, నా మనసుకి ఏదో ఒకటి చేయాలనిపించేది. ఆఖరికి ఓ రోజు ధైర్యం చేసి నేనూ ఏదో పనిచేస్తా. కుటుంబ ఖర్చులకైనా ఉపయోగపడతాయి కదా అని మావారిని అడగడంతో ఆయన నీ ఇష్టం అన్నారు. ఇప్పటికే మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో సాయి హెచ్ఎస్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నా ఆ సమయంలోనే కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజులపాటు శిక్షణ పొందింది. రూ.2 లక్షల ముద్రా రుణం ఇచ్చింది. ఆ మొత్తంతో ఊళ్లో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశా. అయితే, కొన్నాళ్లకే కరోనా మహమ్మారి విజృంభించడంతో చేస్తున్న పని ఆగిపోయింది. వెంటనే ఆ పరిస్థితిని అర్థం చేసుకుని మాస్కులు కుట్టడం ఆరంభించాం. సుమారు రెండు లక్షలకు పైగా మాస్కులను కుట్టి అమ్మాం. వచ్చిన ఆదాయంతో రుణాన్ని తీర్చేశా. ఈసారి బ్యాంకు రూ.9.5 లక్షల లోన్ ఇచ్చింది. అప్పుడే... కడపలో ప్లాస్టిక్ నిషేధించడంతో ప్రజలు జ్యూట్‌బ్యాగుల వైపు ఆకర్షితులయ్యారు. దాంతో దీన్నే వ్యాపారంగా మార్చుకున్నా. ఉత్పత్తిని పెంచి 15 మంది మహిళలకు ఉపాధి కల్పించా. అంతేకాదు, తాజా మారే ఫ్యాషన్లు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పర్యావరణహిత బ్యాగుల్ని రూపొందించాం. దీంతో తక్కువ సమయంలోనే ఆదరణ లభించింది. దేశవిదేశాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే పెద్ద అవకాశం అందుతుంది. కడప కేంద్ర దాదాగారం సహకారంతో అక్కడి మహిళా ఖైదీకూ పని కల్పించారు. ఈ ఏడాదిఅంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మాలో ప్రేరణ సఖి కింద రూ.50 వేల నగదు అవార్డును రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ప్రధానమంత్రి ముద్ర యోజన పదో వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడే అవకాశం దక్కింది. □

# వృద్ధులకు సాంకేతిక పరిజ్ఞానం నేర్పి..



ఈ రోజుల్లో టెక్నాలజీనే ప్రతి ఒక్కరి నేస్తంగా మారిపోయింది. బ్యాంకింగ్, షాపింగ్, క్యాబ్ బుకింగ్, బిల్లు చెల్లింపులు.. ఇలా ఒకటేమిటి దానితో ముడిపడి ఉంది. అయితే సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందుతోంది.. ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉన్నా.. కొందరు దాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నారు. కారణం.. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడమే! ఇలాంటి వాళ్లలో వృద్ధులే ఎక్కువ! అందుకే ఈ గ్యాప్ పూడ్చేందుకు కంకణం కట్టుకుంది మహిమా భలోతియా. ఈ ఆలోచనతోనే ఓ సంస్థను నెలకొల్పిన ఆమె.. ఈ వేదికగా వృద్ధులకు టెక్ పాఠాలు చెబుతోంది. వాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతోంది. ముంబయికి చెందిన మహిమకు చిన్నతనం నుంచే సేవా దృక్పథం ఎక్కువ. సమాజం కోసం తన వంతుగా ఏదైనా చేయాలని ఆరాటపడేది. చదువులోనూ మెరుగ్గా రాణించిన ఆమె.. ఇటలీలోని మిలాన్‌లో లగ్జరీ గూడ్స్ అండ్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పూర్తిచేసింది. ఈ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ నైపుణ్యాలపై పట్టు పెంచుకున్న ఆమె.. ఆతిథ్య రంగంలో కెరీర్ ప్రారంభించింది. కొన్నేళ్ల పాటు ఓ ప్రముఖ హోటల్‌లో పనిచేసిన మహిమ.. అక్కడ మార్కెటింగ్ క్యాంపెయిన్స్ నిర్వహించడంలో విజయవంతమైంది. ఈ ఉద్దేశంలోనే 2019లో 'ఎంప్లాయీ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా అందుకుందామె. ఏమేం నేర్పుతామంటే..ఏ 2000లో కోవిడ్ సమయంలో ఉద్యోగం కోల్పోయిన మహిమ.. తాను ప్రారంభించిన డిజిటల్ పాఠశాల నిర్వహణపై పూర్తి దృష్టి పెట్టింది. సీనియర్ సిటిజన్‌కి సాంకేతిక పరిజ్ఞానం అందించడం ఈ సంస్థ ముఖ్యోద్దేశం. ఇందులో భాగంగా కొన్ని కోర్సులు అందిస్తూనే, ఆన్‌లైన్ ఆఫైన్‌లలో ప్రత్యేకమైన వర్క్ షాపులు/సెషన్లు కూడా కొనసాగుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌ను ఎలా ఉపయోగించాలి, కంప్యూటర్ వాడకం, సోషల్ మీడియా వినియోగం, ఇందులో ప్రైవసీ సెట్టింగ్‌లు ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులు, మెయిల్స్ పంపడం, ఆన్‌లైన్‌లో నిత్యావసరాల కొనుగోలు, బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవడం, షాపింగ్, సినిమా టికెట్లు బుకింగ్, క్యాబ్ బుకింగ్, వంటివెన్నో నేర్పుతోంది మహి 'ఈతరం వారితో మేం పోటీపడగలమా? అన్న భయం చాలామంది వృద్ధుల్లో ఉంటుంది. ఈ భయాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకే చాలా సింపుల్‌గా అర్థమయ్యేలా సెషన్స్ అవుతాం. తపన ఉంటే వయసుతో పనిలేకుండా ఎప్పుడైనా, ఏదైనా నేర్చుకోవచ్చన్న పాజిటివిటీని వారిలో నింపుతున్నాం. ఇలా మా వద్ద శిక్షణ పొందిన వారిలో చాలామంది విదేశాల్లో ఉన్న తమ పిల్లలతో వీడియో కాల్ మాట్లాడడం, హెల్త్ యాప్స్‌ను ఉపయోగిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం.. స్థిరపడుతున్నారు. ఇలా వాళ్లలో మార్పు చూస్తుంటే సంతోషంగా అనిపిస్తోంది. అంటోంది మహిమ.

**వెల మందికి పాఠాలు!** ఈ ఐదేళ్లలో వేల మంది వృద్ధులకు సాంకేతిక పరిజ్ఞానంలో పాఠాలు నేర్పి.. వారిలో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించింది మహిమ. ఇప్పటివరకు వివిధ టివి వర్క్‌షాప్స్, ఆన్‌లైన్/ఆఫ్లైన్ సెషన్స్ నిర్వహించిన ఆమె.. పలు టీవీ షోలలో పాల్గొని ఆయా సాంకేతిక అవగాహన కల్పిస్తోంది. సాంకేతికత మన జీవితాలను సులభతరం చేస్తోంది. అందుకే వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం ముఖ్యం. డిజిటల్ గ్యాప్ ఉన్న ప్రతి గ్రామీణ ప్రాంతానికీ భవిష్యత్తులో మా సంస్థ సేవల్ని విస్తరించాలనుకుంటున్నాను. ప్రతి సీనియర్ సిటిజన్ సాంకేతిక పరిజ్ఞానం పెంచుకునేలా తోడ్పడాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా.. అంటోన్న మహిమ.. సోషల్ మీడియాలోనూ డిజిటల్ పాఠాలకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ తన సేవల్ని మరింతమందికి చేరుస్తోంది. అంతేకాదు.. ఆయా రంగాల్లో రాణిస్తూ 'వయసు సంఖ్య మాత్రమే!' అని నిరూపిస్తోన్న వృద్ధ మహిళల విజయ గాథలను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ ఎంతోమందిలో స్ఫూర్తి రగిలిస్తోంది. □

# పచ్చని కాంతలమవుదాం !





వరుస వర్షాలతో మేనికి కాస్త హాయిగా తోస్తోంది. ఎటు చూసినా పచ్చదనం. చల్లగాలికి అలా అలా ఊగుతూ మొక్కలు, చెట్లు నవ్వుతూ పలకరిస్తున్నట్లే అనిపిస్తోంది కదూ. వాటిని చూసి మన మనసుకీ తెలియని హాయి. లోలోపలి నుంచి భావుకత తన్నుకొస్తోందే అనిపించిన.. సైకాలజీపరంగా చూస్తే ఆ ముందురు ఆకుపచ్చరంగు చేసే మాయే ఇదంతా. ఇది మనసుపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఒత్తిడిని దూరం చేసి, మనసుకి ఆనందాన్ని కలిగిస్తుంది. అంతేనా.. కొత్త ఆలోచనలు కలగడానికి, ఆత్మవిశ్వాసం పెరగడనాకి కూడా సాయపడుతుంది. సంప్రదాయపరంగా చూసినా దీనికి ప్రాధాన్యం ఎక్కువే. ఈ రంగును మనం శుభసూచికంగా భావిస్తాం. అందుకే వేడుకల్లో దీనిది ప్రత్యేకస్థానం. ఇంతటి ప్రాధాన్యమున్న వర్ణాన్ని డిజైనర్లు మాత్రం పక్కన పెడతారా ఏంటి? సంప్రదాయ, ఆధునిక వస్త్రాల్లో చోటిచ్చేశారు. పట్టుచీర, పరికిణీ అయినా అద్దుకున్న ఫ్యాన్సీ శారీ అయినా అదే ఆదరణ, ఇక షరారా, లాంగ్‌ఫ్రాక్, లెహెంగాలకైతే కొదవే లేదు. అంటే ఆప్షన్లు బోలెడు. సందర్భం, మనికి నప్పేదేంటి అనేది చూసుకోవడమే మన పని. అమ్మవారికీ నచ్చిన రంగుల్లో ఆకుపచ్చ ఒకటి. కాబట్టి, ప్రకృతితో మమేకమవుతూ మనమూ ఈ వర్ణానికి ఓటేద్దాం, ప్రకృతి కాంతలమవుదాం. అందానికి అందం.. మనసుకీ ఆనందం. మీరేమంటారు మరి? □





# ప్లాస్టిక్ బాటిల్‌కు దూరంగా..

నీళ్లూ, పాలూ, శీతలపానీయాలూ..ఏవైనా సరే ప్లాస్టిక్ బాటిళ్లలోనేవస్తున్నాయి. ఆ బాటిళ్లకి సూర్యరశ్మిలోని అతినీలలోహిత (యూవి) కిరణాలు ఎక్కువగా సోకినప్పుడు వాటిల్లోని 'సూక్ష్మప్లాస్టిక్' కరిగి ఆయా పానీయాల్లో కలిసిపోతోంది. అది తాగినవాళ్ల శరీరంలోకీ వెళుతోంది. ఇదివరకే చేసిన పలు అధ్యయనాల్లో ఈ సూక్ష్మ ప్లాస్టిక్ అవశేషాలు రక్తంలోనూ ఉండటం గమనించారు. అందువల్లే రక్తపోటుకీ సూక్ష్మ ప్లాస్టిక్‌కీ సంబంధం ఉందా? అన్న కోణంలో పరిశోధన చేశారు



ఆస్ట్రియాలోని దాన్యూబ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు. రక్తంలో సూక్ష్మ ప్లాస్టిక్ ఎక్కువగా ఉండి, రక్తపోటుతోనూ బాధపడుతున్న రోగుల్ని నెలరోజులపాటు ప్లాస్టిక్ బాటిళ్లని ఏ రకంగానూ వాడకుండా ఉండమన్నారట. నీళ్లు తాగడానికి స్టీలూ పేపర్‌లాంటివాటినే ఉపయోగించమన్నారట. నెల తర్వాత వాళ్లందరిలోనూ సూక్ష్మప్లాస్టిక్ అవశేషాల సంఖ్య తగ్గడమే కాదు రక్తపోటు కూడా అదుపులోకి వచ్చిందట. దీన్నిబట్టి సూక్ష్మప్లాస్టిక్‌కీ రక్తపోటుకీ ప్రత్యక్ష సంబంధం ఉందని చెబుతున్నారు. వీలున్నంత వరకూ వాటికి దూరంగా ఉండమని సూచిస్తున్నారు. □

## చెలి చిట్కా

- ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటని పాలధిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగేటప్పుడు కళ్ళుముండవు.
- .ఎండుకొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి. □

# పుదీనా ప్రయోజనం- 2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

పుదీనాలోని సాలిసిలిక్ ఆసిడ్, విటమిన్స్ వల్ల సీబయ్‌ని, జిడ్డుని తగ్గించి మొటిమల వాపు, నొప్పి, ఎరుపుని తగ్గిస్తుంది. బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్, మచ్చలు, శోభి తెల్ల, నల్లమచ్చలు, గజ్జి, తామర, దురదలు, డెర్మటైటిస్, సన్‌బర్న్‌ని, కమిలిన చర్మాన్ని కాలిన గాయాల్ని, కంటి క్రింద నల్లని వలయాల్ని తగ్గించి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. చర్మకణాల్ని ఫ్రీ రాడికల్స్ నుండి తొలగించి కాపాడుతుంది. కేశ సౌందర్యానికికూడా పుదీనా పేస్టు బాగా పనిచేస్తుంది. జుట్టు రాలడం, చుండ్రు, తలలో పేలు, కురుపులు, స్కాల్ప్ సమస్యల్ని తగ్గించి జుట్టు పెరుగుదల మెరుపుని కల్గిస్తుంది. ఆంటి మైక్రోబియల్, ఆంటిఫంగల్ లక్షణాల వల్ల ఫాలికిల్స్‌కి రక్తప్రసరణ జరిగి కొత్త జుట్టు కణాల్ని పునరుద్ధించే స్టిములెంట్‌గా పనిచేస్తుంది. ఆంటి బాక్టీరియల్, ఆంటివైరల్ లక్షణాల వల్ల శీతాకాలం, వర్షాకాలంలో వచ్చే జలుబు, గొంతునొప్పి, జ్వరాలు, ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. పుదీనాలోని ఎ,సి,డి,ఇ విటమిన్ల వల్ల విటమిన్ల లోపాల్ని నయంచేసి, ఎముకలు, లివర్ సమస్యలు, వ్యాధులకి మంచి చేస్తుంది. పుదీనాలో విటమిన్ సి వల్ల వ్యాధి నిరోధక శకినత పెరిగి ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది. శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ని తొలగించి, కణాల డామేజ్ లేకుండా, నోరు రొమ్ము కేన్సర్ కణాల్ని పెరగనీయకుండా, వ్యాధిని ఆరికడుతుంది. విటమిన్ ఎ వల్ల కంటి బత్తిడిని (కంప్యూటర్, సెల్ చూసేవారిలో, వీడియోగేమ్స్ ఆడేవారిలో), కంటిలో నీరు కారడం, మంటల్ని తగ్గిస్తుంది. పుదీనా రసం అరికాళ్ళు, అరిచేతులకి అప్లై చేసిన మంటలు తగ్గుతాయి. వేసవి తాపాన్ని తగ్గించి వడదెబ్బ తగలకుండా చేస్తుంది. ఎక్కిళ్ళు, అధిక దాహం, అప స్మారకం, తలతిరగడం, వాంతులు, వికారం వంటి వేసవి సమస్యల్ని తగ్గిస్తుంది. గాయకులు, ఉప న్యాసకుల గొంతు బొంగురు తనం, గొంతు నొప్పి, ఇరిటేషన్‌ని తగ్గించి కంఠ స్వరంను మెరుగు పరుస్తుంది. పుదీనా స్త్రీలలో వచ్చే పిఎమ్ఎస్, పాలీసిస్టిక్ ఓవరీన్‌కి, బహిష్టు సమస్యలకి, బహిష్టునొప్పికి మంచిది. గర్భిణీల్లో కలిగే వేవిళ్ళు, వికారం, చిరాకు, నీరంస, అలసటకి మంచిది. బాలింతలో పాలు పడడానికి, చనుమొనల వాపు, నొప్పికి, పగుళ్ళ నివారణకుపయోగపడుతుంది. స్త్రీలలో ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తికి, టెస్టోస్టిరాన్ హార్మోన్‌ని తగ్గించి ముఖం, శరీరంపై వచ్చే అవాంఛిత రోమాల్ని తలగిస్తుంది. హార్మోన్ల ఇంబాలెన్స్ ఉన్నవారికి పుదీనా రసం చాలా మంచిది. అంతేగాకుండా బి.పి. షుగర్ లెవల్స్‌ని కంట్రోల్‌లో ఉంచుతుంది. మూత్ర సంబంధవ్యాధులు, యూరిన్ ఇన్ఫెక్షన్‌ని తగ్గించి మూత్రం సాఫీగా వెళ్ళేట్లు చేస్తుంది. ఇవేగాకుండా కామెర్లు, స్థూలకాయం ఎముకల వ్యాధులు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి శరీరక అనారోగ్యాల్ని నయం చేస్తుంది.

**జాగ్రత్తలు :** పుదీనా ఆకుల్ని ఎకునకవగా తింటే కొన్ని దుష్ఫలితాలు ఏర్పడే అవకాశముంది. జిఇఆర్‌డి గ్యాస్ట్రో ఈసోఫేజియర్ రిఫ్లెక్స్ డిసీజ్), హీమోలైటిక్ అనేమియ హృదయ స్పందనలు ఇరెగ్యులర్‌గా వునననవారు, హయటస్ హెర్నియా, కిడ్నీ డామేజ్, కిడ్నీ స్టోన్స్, లివర్ డామేజ్‌వునననవారు, నిద్రమాత్రలు వాడేవారు, బి.పి. గుండె, మూర్ఛవ్యాధులకి మందులు వాడేవారు ఎరిథ్రామైసిన్, స్టీరాయిడ్ మందులు వాడేవారు పుదీనా వాడకాన్ని తగ్గించాలి. అవసరమైతే మానవేయాల్సి ఉంటుంది. దీన్ని గర్భిణీలు ఎక్కువగా తినరాదు. గర్భిణీలో వికారం, వాంతులు, అజీర్ణం, తలతిరగడం వుంటే ఉదయానే తినకుండా ఆకుల్ని నలిపి వాసన చూడడం మంచిది ఫ్రెష్‌గా ఉంటుంది. కొంతమంది చంటిపిల్లలకి ఆకులరసం డైరక్ట్‌గా అప్లై చేస్తే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. శ్వాసకోశాల్లో మట కల్గుతుంది. పిల్లల్లో, పెద్దల్లో జలుబు, ముక్కు కారడం, సైనసైట్, దగ్గు, ఊపరిపీల్చుడం కష్టంగా ఉంటే ఆవిరి పట్టడం మంచిది. శ్వాసనాళాల్ని, ముక్కుని శుభ్రపరుస్తుంది. సెన్సిటివ్‌గా ఉండే కొంతమందిలో నోటిచుట్టు తిమ్మిరి పోవడం, మొద్దుబారడం, కాంటాక్ట్ డెర్మటైటిస్ తలనొప్పి, వాంతులు ఎసిడిటీ విరేచనాలు , వికారం వంటి ఎలర్జిటిక్ రియాక్షన్స్ వస్తాయి. □

# శ్రీకృష్ణుడి విజయ 'శంఖం'

దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధ్యేయంగా తన భక్తులని కాపాడే భగవానుడు శ్రీకృష్ణభగవానుడు ఉపయోగించే శంఖం పేరు పాంచజన్యం. మహాభారత యుద్ధంలో ఈ శంఖం పాండువులకు విజయాన్ని తెచ్చి పెట్టంది. కౌరవులకు ఘోర పరాజయం చవి చూసాయి. పాంచజన్యం అనే శంఖం పూరిస్తేచాలు ముల్లోకాలు దద్దరిల్లుతాయి. ఈ పాంచజన్యం శంఖం శ్రీ కృష్ణుడికి ఎలా లభించిందో మనం తెలుసుకుందాం. తమ విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత బలరామకృష్ణులు తమ గురువు శాందీపని మహాముని వద్దకు వెళ్లారు. తమకి విద్యాబోధన గావించిన శాందీపని మునికి గురుదక్షిణ ఇవ్వాలనుకున్నారు. అది గ్రహించిన శాందీపని మునికి శ్రీకృష్ణుడు సాక్షాత్తు దేవ దేవుడు అని కూడా తెలుసు. అందుకే ఈ కోరిక కోరాడు. చాలకాలం క్రితం సముద్రంలో తన పుత్రుడుని తిరిగి తీసుకు రమ్మని కోరాడు గురదక్షిణగా, అప్పుడు శ్రీ కృష్ణ, బలరాములు నేరుగా సముద్రుడి వద్దకు వెళ్లి ఈ విషయం వివరాంచారు.కొంత కాలం క్రితం మా గురుపుత్రుడు ఈ సముద్రంలో పడి మరణించాడు అతన్ని వెంటనే వెనక్కి తీసుకురా! అని అడిగారు. దానికి బదులుగా సముద్రుడు మీ గురుపుత్రున్ని నేను తీసుకుపోలేదు. పంచజునుడు అనే రాక్షసుడు ఆ పిల్లవాడిని పట్టుకెళ్లాడు. వాడు శంఖం రూపంలో సముద్రం నీటి అడుగున ఉండవచ్చును. అని సమాధానం ఇచ్చాడు. శ్రీకృష్ణుడు వెంటనే సముద్రంలోకి వెళ్లి అక్కడ దాగున్న పంచజనుడు అనే రాక్షసున్ని పట్టుకున్నాడు. వాడి కడుపులో గురుపుత్రుడు కనిపించలేదు. అప్పుడు రాక్షసుడి శరీరం నుండి పుట్టిన 'పాంచజన్యం' అనే శంఖాన్ని తీసుకుని యమపురికి చేరుకున్నారు. అక్కడ ఈ శంఖం శ్రీ కృష్ణుడు పూరించగా ఆ శబ్దానికి యమలోకం తలకిందులైంది. అది విని యమధర్మరాజు వెంటనే బయటకు వచ్చి శ్రీ కృష్ణుడికి అభివాదము చేసి, 'స్వామీ ఆజ్ఞాపించండి' అని అడిగాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు యువరాజుతో నా గురుపుత్రున్ని వెంటనే తిరిగి ఇచ్చేయమని అడిగాడు వెంటనే ఆ గురుపుత్రున్ని వారికి తిరిగి సజీవునిగా అప్పజెప్పాడు యముడు. ఆ పిల్లవాన్ని సాందీపని మునికి అప్పగించి తన గురుదక్షిణ తీర్చుకున్నారు. బలరామకృష్ణులు. సకల లోక రక్షణ కోసం యుద్ధంలో విజయం కోసం శ్రీకృష్ణ భగవానుడు ఈ పాంచ జన్యం ఉపయోగించేవాడు. □

ఆధ్యాత్మికం

# మోకాలిచిప్ప సమస్యకు 'జిగురు' !

మన శరీరంలోని కీళ్లన్నింటిలో ఓ మెత్తటి ఎముక ఉంటుంది. కీలు దగ్గర కలిసే రెండు ఎముకలు ఒకదానికొకటి తగిలి రాపిడి ఏర్పడకుండా ఇది కాపాడుతుంది. దీన్నే మృదులాస్థి (కార్టిలేజ్) అంటారు. మిగతావాటికన్నా మోకాలి చిప్పదగ్గర ఉన్న ఈ మృదులాస్థి తొందరగా అరిగిపోతుంటుంది. అందువల్లే ఎక్కువమంది మోకీలు సమస్యతో బాధపడుతుంటారు. ఈ మృదులాస్థి శరీరంలోని మిగతా ఎముకల్లా తనని తాను మరమ్మతు చేసుకోలేదు. పునఃసృష్టించుకోలేదు. రక్తం దీనికి నేరుగా అందకపోవడం ఇందులో కారణం. వైద్యులు మెకాలి చిప్ప శస్త్రచికిత్స చేసినప్పుడు అరిగిపోయిన ఆ మృదులాస్థిలోని కొంతభాగాన్ని తొలగిస్తారు. దానికిందున్న పెద్ద ఎముకకి రంధ్రాలు చేసి.. వాటి నుంచి రక్తం వచ్చేలా చూస్తారు. నేరుగా వచ్చే ఆ రక్తంతో మృదులాస్థి చాలా పెళుసుగా ఉంటుంది. చిన్న శ్రమకే విరిగిపోతుంది. ఈ సమస్య పరిష్కారానికే ఓ



జిగురులాంటి పదార్థాన్ని కనిపెట్టారు అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఆ జిగురుని మెకాలిచిప్పలోకి నేరుగా ఇంజెక్ట్ చేస్తారు. జిగురు లోపలికెళ్లాక అందులోని ప్రొటీన్ ఆ ప్రాంతంలో టిజిఎఫ్ బీ 1 అనే రసాయనాన్ని ప్రేరేపిస్తుంది. ఆ రసాయనం అక్కడిక్కడే మృదులాస్థిని మరమ్మతు చేసి గట్టిగా ఎదిగేలా చేస్తోందట. ఇంకే సర్జరీ దీనికి అక్కర్లేదట. ఈ కొత్త విధానంతో త్వరలోనే క్లినికల్ ట్రయల్స్‌కి వెళ్తామంటున్నారు శాస్త్రవేత్తలు. □

# బీరకాయపొట్టు పొడి

కావాల్సినవి : లేత బీరకాయ పొట్టు- అరకేజీ, వాము-చెంచా, ఎండుమిర్చి-12, మినపప్పు-రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు-ఏడు, చింతపండు-10గ్రా.

**తయారీ :** బీరకాయపొట్టులో చెమ్మలేకుండా చేసుకుని అరచెంచా ఉప్పు వేసి మక్సిలో బరకగా ఆడించుకోవాలి. పొయ్యిమీద పాన్ పెట్టుకుని చెంచా నూనె వేసుకుని ఎండు మిరపకాయల్ని రంగు మారేంతవరకూ వేడి చేసి పక్కనపెట్టేయాలి. ఆ తర్వాత అదేపాన్‌లో మినపప్పుని ఎర్రగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో చెంచా నూనె వేసుకుని వేడెక్కాక బీరకాయ పొట్టుని వేసి పొడిపొడిగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే పసుపు, వాము కూడా వేసుకుని మరికాసేపు వేయించుకోవాలి. మక్సీలో వేయించిన ఎండుమిర్చి, మనిపప్పు, వెల్లుల్లిపాయ రెబ్బలు, చింతపండు వేసి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బీరకాయపొట్టు, ఉప్పు కూడా వేసి పొడి చేసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పొడి.. వామువల్ల జీర్ణప్రక్రియ సజావుగా సాగేట్టు చేస్తుంది. □



# మహిళల ప్రపంచకప్ టీమ్ ఖరారు



## అమన్‌జోత్ ఎంట్రీ
## షెఫాలీకి దక్కని చోటు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరగనున్న మహిళల ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా సభ్యుల పేర్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. స్వదేశంలో జరగనున్న ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో కూడిన జట్టును కూర్పు చేసింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే ఈ టీమ్‌లో లేడీ సెహ్వాగ్, స్టార్ ఓపెనర్ షెఫాలి వర్మకు షాక్ తగిలింది. వన్డే ప్రపంచకప్ సహా ఆస్ట్రేలియా సిరీస్‌కు సైతం ఎంపిక కాలేదు. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో షఫాలీ ఇండియా జట్టులో భాగమైంది. కానీ ఆమె ఆడిన గత మూడు వన్డే మ్యాచ్‌లతో సహా ఆరు వైట్‌బాల్ మ్యాచ్‌లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో షఫాలీ వర్మను పక్కన పెట్టనట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో సత్తా చాటిన ప్రతీక రావల్పై సెలక్టర్లు నమ్మకముంచారు. పేసర్ రేణుక సింగ్ జట్టులో పునరాగమనం చేసింది. మరో పేసర్ క్రాంతి గౌడ్ జట్టులో స్థానం సంపాదించింది. టీమ్ విషయాని కొస్తే అంచనాలకు తగ్గట్టుగానే జట్టు కూర్పు జరిగినట్లు తెలుస్తోంది.

ఆల్ రౌండర్ అమన్‌జోత్ కౌర్ ప్రస్తుతం గాయపడి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటోంది. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. వరల్డ్ కప్ కోసం ఆమె ఫిట్‌గా అవుతుందని భావిస్తున్నట్లు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ చెబుతోంది.

ఇక ప్రపంచ కప్‌తో పాటు, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత మహిళా జట్టును కూడా బిసిసిఐ ప్రకటించింది. అయితే ప్రపంచకప్ జట్టుతో పోలిస్తే ఆస్ట్రేలియా సిరీస్‌లో జట్టులో ఒకేఒక్క మార్పు జరిగింది.

సయాలి సత్ఘారే ఈ సిరీస్‌కోసం జట్టులో చేర్చారు. మహిళల ప్రపంచ కప్ కోసం ఎంపిక చేసిన టీమ్ఇండియా జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా. రిజర్వ్ ప్లేయర్స్‌గా తేజల్ హసబ్నిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా చెత్రీ, మిన్ను మణి, సయాలి సత్ఘారేను ఎంపిక చేశారు.



### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
## ఎలావెనిల్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీలో భారత ఒలింపియన్ ఎలావెనిల్ వలరివన్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించింది. కజికిస్తాన్‌లో శుక్రవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వలరివన్ స్వర్ణం సాధించి జాతీయ రికార్డు సృష్టించింది. జకార్తాలో జరిగిన 2024 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన తర్వాత, ఈ తాజా విజయం ఆమె కాంటినెంటల్ ఈవెంట్‌లో వరుసగా రెండవ వ్యక్తిగత పతకాన్నిసాధించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల ఈ అమ్మాయి ఫైనల్లో అద్భుతమైన సంయమనాన్ని ప్రదర్శించింది, 253.6 పాయింట్లతో అద్భుతమైన స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ అద్భుతమైన స్కోరు కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ఆమెతో పాటు చైనాకు చెందిన పెంగ్ జిన్లు రజత పతకం, దక్షి ణ కొరియాకు చెందిన క్వాన్ యున్‌జి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఇక ఈ పోటీలో ఉన్న మరో భారతీయురాలు మెహులి ఘోష్ ఎనిమిది షూటర్ల ఫైనల్లో 208.9 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచింది. ఆమె మొదట 10వ స్థానంలో నిలిచింది. కానీ ఇద్దరు ఉన్నత స్థానంలో ఉన్న భారతీయ షూటర్లు, ఆర్య బోర్సే, సోనమ్ మస్కర్ ర్యాంకింగ్ పాయింట్ల కోసం మాత్రమే పోటీ పడుతున్నందున పక్కకు తప్పుకోవడంతో ఫైనల్‌కు చేరుకుంది. ఎలావెనిల్, మెహులి ఘోష్ మరియు నాయుడు అనన్య త్రయం టీమ్ ఈవెంట్‌లో 1891.0 స్కోరుతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

### మహిళల అనధికారిక టెస్ట్‌లో..
## భారత్ ముందంజ
### 141 రన్స్ వెనుకబడిన ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడటంతో 300కు ఒక్క పరుగు తక్కు వద్ద ఆలౌట్ అయింది. బ్రిస్బేన్‌లో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 5 వికెట్లనష్టానికి 158 పరుగులకే పరిమితమైంది. వర్షం కారణంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లకు 72 పరుగులకు పరిమితమైన భారత్ కష్టాల్లో పడింది. కానీ ఓవర్ నైట్ 26 పరుగులతో ఉన్న బిస్ట్, మొదట రాధా యాదవ్ (33)తో 6 వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకుంది. తర్వాత మిన్ను మణి (28)తో కలిసి 75 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను ఇబ్బందుల నుండి గట్టెక్కించింది. భారత ఇన్నింగ్స్ 63వ ఓవర్లో మీడియం పేసర్ మైట్లాన్ బ్రౌన్ ఆమెను క్లీన్ అవుట్ చేసి మణిని కూడా ఔట్ చేసింది. కానీ జోషిత, టైటాస్ సాధు (23) 9వ వికెట్‌కు 75 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని పంచుకున్నారు, తద్వారా భారత్ 300 పరుగులమార్కును చేరుకుంది. జోషిత ఆఫ్‌స్పిన్నర్ లిల్లీ మిల్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయింది. ఆస్ట్రేలియా తరఫున మీడియం పేసర్లు జార్జియా ప్రెస్ట్‌విడ్జ్ (3/37) మరియు బ్రౌన్ (3/65) తమ మధ్య 6 వికెట్లు పంచుకున్నారు. ఇక ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఇండియా తరఫున మీడియం పేసర్ సైమా ఠాకూర్ (2/21), ఎడమచేతి వాటం స్పిన్నర్ రాధా (2/40) చెరో 2 వికెట్లు పడగొట్టగా, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్‌గా సాధు (1/27) రాణించింది. కెప్టెన్ తహిలా విల్సన్ 49పరుగులు చేయగా, రాచెల్ ట్రెనామన్ (21)తో కలిసి ఓపెనింగ్ భాగస్వామ్యానికి 46 పరుగులు జోడించింది. స్టంప్స్ వద్ద, వికెట్ కీపర్ నికోల్ ఫాల్టమ్ (30 నాటౌట్), సియానా జింజర్ (24 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా భారత్ కంటే 141 పరుగులు వెనుకబడి ఉంది.

### విన్‌స్టన్ సేలం ఓపెన్‌లో..
## రోహాన్ బోపన్న జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** విన్‌స్టన్‌సేలం ఓపెన్-2025, పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ జంట రోహన్ బోపన్న-రొమైన్ ఆర్నియోడో ద్వయాన్ని ఓడించింది. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన ఎటిపి 250 టోర్నమెంట్, 25వ విన్సన్‌సేలం ఓపెన్‌లో భారత స్టార్ ఆటగాడు యుకీ భాంబ్రీ మరియు అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. 1 గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో ఈ జంట ఇండోమోనెగాస్క్ జంట రోహన్ బోపన్న మరియు రొమైన్ ఆర్నియోడోపై వరుస సెట్లలో (76(2), 6 3) విజయం సాధించింది. వరుసగా మూడు టోర్నమెంట్లలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన రెండో సీడ్ ఇండోన్యూజిలాండ్ జోడీకి ఇది ఈ ఏడాది తొలి సెమీఫైనల్ అవుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో, రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంలో సవాళ్లను ఎదుర్కొంటూ తీవ్రంగా పోరాడారు. మొదటి సెట్‌లో ప్రతి ఒక్కరూ రెండు బ్రేక్‌లు ఇవ్వడంతో, టైబ్రేకర్‌కు దారితీసింది, అక్కడ రోహన్, రొమైన్ 2-7 తేడాతో ఓడిపోయారు. ఇండోకివీ ద్వయం రెండవ సెట్ ప్రారంభంలో ఇబ్బంది పడింది, మొదటి గేమ్‌లో బ్రేక్ కోల్పోయింది, కానీ అద్భుతంగా పుంజుకుంది, తరువాతి గేమ్‌లలో రెండు బ్రేక్‌లు సాధించి వరుస సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

### మహిళల ఛాంపియన్‌షిప్‌లో
## భారత్ విజయం
### బంగ్లాదేశ్ 2-0 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ఛాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో భారత్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో జరిగిన శాప్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి 2-0 తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. పెర్ల్ ఫెర్నాండెజ్ మరియు ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ యంగ్ టైగ్రెస్సెస్‌కు గోల్స్ చేశారు. ఈ విజయంతో, భారతదేశం ఆరు పాయింట్లను సాధించి పట్టికలో అగ్రస్థానంలో తన స్థానాన్ని సుస్థిరంచేసుకుంది. పెర్ల్ ఫెర్నాండెజ్ (13 నిముషం) మధ్యలో బలమైన పరుగుతర్వాత స్కోరింగ్‌ను ప్రారంభించింది. 75వ నిమిషంలో ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ అలీషా లింగ్డో కార్నర్ నుండి అద్భుతమైన వాలీని కొట్టడంతో యంగ్ టైగ్రెస్‌లు తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేశారు. 14వ నిమిషంలో, సెంటర్‌బ్యాక్ దివ్యని లిండా డీప్ నుండి స్ఫూర్తిదాయకమైన పరుగు చేసి బంతిని తీసుకొని మిడ్‌ఫీల్డ్ గుండా వెళ్లింది. డిఫెండర్లు ఆమెపైకి చేరుకోవడంతో, ఆమె తెలివిగా దానిని పెర్ల్‌కు అందించింది, ఆమె బాక్స్ అంచున గుర్తు లేకుండా మిగిలిపోయింది. బంగ్లాదేశ్ కీపర్ ఇయర్జాన్ బేగం బంతిని కొట్టినప్పటికీ, ఆమె దానిని ఆపలేకపోయింది. రెండవ అర్ధభాగం కూడా ఇదే లయను అనుసరించింది, భారత్ ఆటను నియంత్రించింది. ఇక బాంగ్లాదేశ్ ఆల్పి అక్టర్ భారత గోల్ కీపర్ మున్నీ ఒత్తిడి తెచ్చినా ముందుకు సాగలేకపోయారు.

## భారీ నష్టాల్లో సూచీలు



**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. జాక్సన్‌హక్షల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చీఫ్ వడ్డీరేట్లపై ఎలాంటి ప్రకటన చేయబోతున్నారనే దానిపై ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. అయితే దీనికి తోడు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 25శాతం పన్నుల భారం ఆగస్టు27 నుంచి అమలుచేయనున్నారు. గడువు దగ్గర పడుతుండడంతో వారాంతంలో మార్కెట్ సూచిలు నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ సుమారు 700 పాయింట్ల మేర నష్టపోగా..నిఫ్టి మళ్లీ 25వేల స్థాయిలో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,951,48 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమయింది. రోజంతా నష్టాలతోనే సాగింది. ఇంట్రాడేలో 81,291,77 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకిన సూచి చివరకు 693.86పాయింట్ల నష్టంతో 81,306.85వద్ద స్థిరపడింది. నిఫ్టి 213.65 పాయింట్ల నష్టంతో 24,870,10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయ మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30సేచిలో ఏషియన్ పెయింట్స్ అల్ట్రాటెక్ సిమెంట్,ఐటిసి, టాటా స్టీల్, హెచ్‌సిఎల్, టెక్నిలజిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్ర అండ్ మహీంద్ర, మారుతి, సుజుకి, సన్‌ఫార్మా, బీఈఎల్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి.

## మ్యూచువల్ ఫండ్స్‌లో ఆరు కొత్త స్కీమ్‌లు




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారికి ఆయ ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల కొత్తగా ఆరు స్కీంలను అందుబాటులోకి తెచ్చాయి. ఈటిఎఫ్, ఫండ్ ఆఫ్ ఫండ్ వంటి కేటగిరీలతో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆయా కంపెనీలు పేర్కొన్నాయి. ఈక్విటీ పెట్టుబడుల ద్వారా హైరిటర్న్స్ అందుకోవచ్చనే కారణంతో చాలా మంది ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాన్ని బట్టి అనువైన ఫండ్స్ ఎంచుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగిస్తుంటారు. అయితే, చాలా మంది ఇప్పటికే అందుబాటులో ఉన్న పథకాలను గత చరిత్ర, పనితీరును బట్టి ఎంచుకుంటున్నారు. ప్రధానంగా మీరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన మీరే అసెట్ గోల్డ్ సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్, ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఆఫర్లు ప్రారంభమయ్యాయి. మొదటి స్కీమ్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉండగా.. అలాగే ఏంజెల్ వన్ ఫండ్ స్కీం సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతోంది. అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (డొమెస్టిక్)స్కీం గడువు ఆగస్టు 25 వరకు ఉంటుందని పేర్కొంది. అలాగే ఎడెల్వేయిస్ మల్టీ అసెట్ ఓమ్నీ ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీం ఆగస్టు 26 వరకు అందుబాటులో ఉంటుంది. ఆలోపు బిడ్లు దాఖలు చేసిన వారికి యూనిట్లు కేటాయిస్తారు. ఇప్పటికే ప్రముఖ ఏఎంసీ ఏంజెన్ వన్ మ్యూచువల్ ఫండ్ నుంచి గోల్డ్ స్కీమ్ వచ్చింది. ఇండెక్స్ ఫండ్ కేటగిరీలోకి వస్తే యాక్సిస్ నిఫ్టీ 500 ఈక్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్ ఉంది.

## రాపిడో టాక్సీకి రూ.10 లక్షలు జరిమానా

### వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల వ్యవహారం





హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త: వినియోగదారులను ఆకర్షించేందుకు కంపెనీలు వినూత్నంగా ప్రకటనలు చేసి సొమ్ము చేసుకుంటారు. మాయమాటలతో వంచించే ప్రకటనలపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) దృష్టిసారించింది. ఈ క్రమంలో రాపిడోపై చర్యలు చేపట్టింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని చెప్పి, ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రకటనను వెంటనే నిలిపివేయాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదేశించింది. అయితే రాపిడో ట్యాక్సీపై ఎన్నో ఫిర్యాదులు వెలువెత్తుతున్న నేపథ్యంలో తప్పు ప్రకటనపై రూ.10లక్షల జరిమాన విధించినట్లు వెల్లడించింది. కంపెనీ అందించే సేవలపై చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాడ్‌తో చాలా మంది ప్యాసింజర్లు రాపిడో ఆటో బుక్ చేసుకుంటున్నారు. అయితే 5 నిమిషాలు దాటినప్పటికీ ఒక్కరంటే ఒక్క ప్యాసింజర్ కు కూడా యాడ్ లో చెప్పినట్లు రూ. 50 రీఎంబర్స్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొంది. ఆలస్యమైతే డ్రైవర్లదే బాధ్యత కానీ, కంపెనీది కాదని షరతుల్లో ఉంది. ఇది కంపెనీ జవాబుదారీ నుంచి తప్పించుకోవడమే అవుతుందని వివరించింది. అదేవిధంగా చిన్నచిన్న అక్షరాల్లో సిసిపిఎ జరిపిన దర్యాప్తులో మరో విషయం వెలుగుచూసింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని ప్రకటనలో ఉంది. కానీ నిజానికి ఇది క్యాష్ కాదు, రాపిడో కాయిన్స్ అని ప్రకటనలో చిన్న చిన్న అక్షరాల్లో రాసి ఉంది. ఈ కాయిన్స్ ను కేవలం బైక్ రైడ్స్ కోసమే ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇవి కేవలం ఏడు రోజుల్లోనే గడువు ముగించి చెల్లకుండా ఉంటాయని తెలిపింది. ఇక 2023 ఏప్రిల్ నుంచి 2024 మే వరకు ఫిర్యాదుల సంఖ్య 575 గా ఉండగా, 2024 జూన్ నుంచి 2025 జులై వరకు ఫిర్యాదులు 1,224తో రెట్టింపు అయ్యాయని జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. చాలా మంది ప్యాసింజర్లు రాపిడో రీఫండ్ పేమెంట్ల విషయంలో ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ఎక్కువ ఛార్జీ వసూలు చేశారని, మరికొందరు సర్వీస్ లేదని వాపోయినట్లు పేర్కొంది.

## ఐదేళ్ల తర్వాత.. భారత్, చైనా వాణిజ్య కలాపాలు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్త తలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య ఒక కీలకమైన సానుకూల పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఐదేళ్ల తర్వాత హిమాలయ ప్రాంతంలోని మూడు కీలక వాణిజ్య మార్గాలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో వాణిజ్యంలో చైనా కంటే భారత్‌కే ఎక్కువ ప్రయోజన సరిహద్దు గ్రామాలు, టిబెట్ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం మెరుగ్గా ఉంది. ఈ మేరకు వాణిజ్య కేంద్రాలు తెరుచుకున్నాయి. ఈ నిర్ణయం సరిహద్దు ప్రాంతాల ప్రజలకు, టిబెట్ ఆర్థిక వ్యవస్థకు, ఇరు దేశాల సంబంధాలకు ఎంతో ప్రాధా న్యత సంతరించుకుంది. ఇటీవల ఢిల్లీలో పర్యటించిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన చర్చల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని షిప్కిలా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథూ లా పాస్‌ల ద్వారా వాణిజ్యం పునఃప్రారం భం కానుంది. ఈ మార్గాలు టిబెట్‌లోని షిగాట్సే, లాసా, నియింగ్చి వంటి ప్రాంతాలను భారత సరిహద్దు ప్రాంతాలతో కలుపుతాయి. 2020లో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఈ మూడు మార్గాలను మూసివేశారు. ఇరుదేశాల సైనికులమధ్య సరిహద్దుల్లోఘర్షణలు, సైనికప్రతిష్టంభన.

## వాణిజ్యం

## భారత్‌లో ఓపెన్ ఏఐ!




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్‌లో చాట్‌జిపిటి సంస్థ ఓపెన్ ఏఐ కార్యకలాపాలను త్వరలో విస్తరించనుంది. ఇందులో భాగంగా భారత్ రాజధాని ఢిల్లీలో ఏడాది చివరిలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తుంది. అయితే చాట్ జిపిటి వినియోగం గణనీయంగా పెరగడంతో నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య నిపుణుల వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్‌లో ఏఐకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఏఐ టీడర్‌గా ఎదిగేందుకు అవసరమైన అన్ని అంశాలు భారత్‌లో ఉన్నాయని గుర్తించింది. ప్రతిభ, ప్రపంచస్థాయి డెవలపర్ సిస్టం, ఇండియా ఐఏ మిషన్ ద్వారా బలమైన ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. తొలి కార్యాలయాన్ని ప్రారంభించి టిమ్‌ను నియమించి మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అందుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు తొలిమెట్టు. అయితే ఓపెన్ ఏఐ సిఈవో శామ్‌ఆల్ట్‌మన్ వెల్లడించారు. ఇదిలా ఉండగా భారత్ ఈ విషయాన్ని దృవీకరించాల్సి ఉంటుంది. మరోవైపు ఓపెన్ ఏఐ ఇప్పటికే ఇండియా ఏఐ మిషన్ భాగస్వామి అయ్యేందుకు అంగీకరించింది. ప్రభుత్వం కోసం ఏఐ వ్యవస్థల నిర్మాణం జరుగుతుందని. దీంతో దేశంలో సేవలు అపారంగా విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ లక్షల మంది విద్యార్థులు, ఎడ్యుకేటర్లు, ప్రొఫెషనల్స్ డెవలపర్లు దీన్ని వాడుతున్నారు. చాట్‌పిజిటి డేటా ప్రకారం అమెరికా తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలిచిందని నిపుణులు పేర్కొంటున్నారు. యాక్టివ్ యూజర్ల సంఖ్య కూడా వారంలో నాలుగు రెట్ల వేగంగా పెరుగుతుందని చెబుతున్నారు. ఓపెన్ ఏఐలో మొదటి అయిదు డెవలపర్ల మార్కెట్‌లో, అంతేకాకుండా అత్యదిక విద్యార్థులు సైతం ఉన్నది భారత్ ఒకటిగా నిలిచింది.

## తెలంగాణలో త్వరలో హెలీ టూరిజం- హైదరాబాద్ నుంచి సోమశిల, శ్రీశైలం మధ్య సేవలు

### ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం - మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** త్వరలోనే తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా హెలీ టూరిజం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గగనతలంలో కొద్దిసేపు విహరింపజేసి పర్యాటకులకు అహ్లాదాన్ని, అనుభూతిని కల్పించేందుకు హెలీ టూరిజం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడి నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు హెలి టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు. రూ. 68.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్ట్ అభివృద్ధి పనులకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో రూ. 45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు, రూ.1.60 కోట్లతో సోమశిల విఐపీ ఘాట్ - బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పర్యాటక ఆతిథ్యానికి తెలంగాణ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పర్యాటక ప్రాజెక్టులు చేపడుతోందన్నారు. టూరిజం అభివృద్ధికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత పదేండ్లలో టూరిజం నిర్లక్ష్యానికి గురైందని, స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మౌలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని, తద్వారా ఉద్యోగ కల్పనతోపాటు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయన్నారు. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజానికి పెద్దపీట వేస్తాం. అమరగిరి ఐలాండ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏడాది లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, నీటి ప్రవాహం తగిన, పర్యాటకులను ఐలాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త పర్యాటక ప్రాజెక్ట్ ల అభివృద్ధి వల్ల పర్యాటకుల సందర్శన మరింత పెరగనుందని, నల్లమల్ల అడవుల మధ్యలో కృష్ణా నది ఒడ్డున ఉన్న సోమశిల, అమరగిరి అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారని, తద్వారా టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగి ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమశిల సిద్దేశ్వరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే దూరాభారం తగ్గడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.